తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

జూలై 2021..... వెల రూ.5/-



తిరుమల


శ్రీవారి ఆలయంలో

ఆణివరఆస్థానం

(2021, జూలై 16)

# తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగిన జ్యేష్ఠాభిషేకం దృశ్యాలు (2021, జూన్ 22 నుండి 24 వరకు)





# గీతాశ్లోకార్థసారం

**శ్లో : భీష్మద్రోణ ప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్ ।**
**ఉవాచ పార్థ పశ్యైతాన్ సమవేతాన్ కురూనితి ॥**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 25)

**ప్రతిపదార్థం:** భీష్మద్రోణ ప్రముఖతః= భీష్మద్రోణుల ఎదుట; చ= మరియు; సర్వేషాం= అందరి; మహీక్షితాం= రాజుల; పార్థ= ఓ అర్జునా; సమవేతాన్= సన్నద్ధులై ఉన్న; ఏతాన్= ఈ; కురూన్= కౌరవులను; పశ్య= చూడు, ఇతి= అని; ఉవాచ= పలికాడు.

**భావం:** భీష్మద్రోణులకు, ఆ పక్షంలో మహారాజులందరికి ఎదురుగా ఉభయసేనుల మధ్య నిలిపి, తరువాత అతడు అర్జునునితో 'పార్థా! ఇక్కడ సమావేశమైన ఈ కౌరవ వీరులందరినీ బాగా పరికించు' అని అన్నాడు.

---

## జ్ఞానయజ్ఞమే మోక్షసాధనం

జ్ఞానయజ్ఞ మీ - గతి మోక్షసాధనము
నానార్థములు నిన్నే - నడపె మా గురుఁడు.

అలరి దేహ మనేటి - యాగశాలలోన
బలువై యజ్ఞానపు - పశువు బంధించి,
కలసి వైరాగ్యపు - కత్తులఁ గోసికోసి
వెలయ జ్ఞానాగ్నిలో - వేలిచె మా గురుఁడు ॥

మొక్కుచు వైష్ణవులనే - ముని సభ గూడపెట్టి
చొక్కుచు శ్రీపాదతీర్థ - సోమపానము నించి,
చక్కగాఁ సంకీర్తన - సామగానము చేసి
యిక్కువతో యజ్ఞము సే - యించెఁబో మా గురుఁడు ॥

తదీయ గురుప్రసాద - పు పురోడాశ మిచ్చి
కొదదీర ద్వయ మను - కుండలంబులు వెట్టి,
యెదలో శ్రీవేంకటేశు - నిటు ప్రత్యక్షము చేసె
యిదివో స్వరూపదీక్ష - యిచ్చెను మా గురుఁడు ॥

(అధ్యాత్మ సంకీర్తన, సంపుటము: 2-148)






*"వేదములలో నానావిధములైన యజ్ఞములు ప్రతిపాదింపబడినవి. స్వర్గాదిఫలములు గోరువారు 'జ్యోతిష్టోమాది' యజ్ఞముల నొనర్పవలెనని నిర్దేశించుచున్నవి. వాటిచే కలుగు స్వర్గాదిఫలములు నిత్యములు గావు. మోక్షఫల మొక్కటే నిత్యము. దానిని పొందుటకు ద్రవ్యమయములైన యజ్ఞములు ఉపయోగపడవు. 'జ్ఞానయజ్ఞ' మొక్కటే మోక్షప్రాప్తికి తగిన సాధనము. దీనిని నిర్వహించుటకు గురుదొక్కడే సమర్థుడు. అతడు నిర్వహించు జ్ఞాన యజ్ఞములో భాగస్వాములైన వారికెల్లరకు భగవంతుడు ప్రత్యక్షము కాగలడు" అని అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని కీర్తిస్తున్నాడు.*



# శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్టు



ప్రభుత్వ విద్యాసంస్థల్లోను, జిల్లాపరిషత్తు పాఠశాలల్లోను, నగరపాలకసంస్థలు, పురపాలక సంస్థల పాఠశాలలలోను, ప్రైవేటు సహాయానుధాన విద్యాసంస్థల్లోను మరియు తి.తి.దేవస్థానం నిర్వహిస్తున్న సంస్థల్లోను చదువుకుంటున్న దారిద్ర్యరేఖకు దిగువన గల 1000 మంది ప్రతిభావంతులైన విద్యార్థినీ విద్యార్థులకు ఉపకారవేతనాలను మంజూరు చేయడం ద్వారా వారిని ఆదుకుని, వారిభవిష్యత్తుకు బంగారుబాటలు వేయాలనేమహాశయంతో, 2008 సంవత్సరంలో శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్టు కు తి.తి.దేవస్థానం శ్రీకారం చుట్టింది. విద్య, అజ్ఞానాన్ని పారద్రోలి, మానవజాతిని జాగృతం చేస్తుంది. ప్రగతిపథాలవెంట దేశాన్ని పురోగమింపజేస్తుంది. ఉదాత్తమైన ఈ ట్రస్టుకు ఆర్థికంగా చేయూత నివ్వండి.

**80 (జి) క్రింద దాతలు ఆదాయపు పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని పొందవచ్చు.**

డిమాండు డ్రాఫ్ట్ / చెక్కులు
'కార్యనిర్వహణాధికారి, తి.తి.దే., తిరుపతి' వారి
పేరున తీసి పంపవలసిన చిరునామా :

ముఖ్యగణాంకాధికారి,
తి.తి.దే. పరిపాలన భవనం,
కె.టి.రోడ్డు, తిరుపతి - 517501,
ఫోన్ నెం.0877-2264258,
2264249, 2277777,
2233333











50 వసంతాల
1970-2020
SAPTHAGIRI
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక


# సప్తగిరి


సంపుటి : 52 జూలై, 2021 సంచిక : 02




వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
ఆచార్య కె.రాజగోపాలన్, పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ అల్లాడి సంధ్య
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సప్తగిరి మాస పత్రిక
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| విఖనస మహర్షి | శ్రీ పి.కృష్ణ బాలాజీ | 07 |
| జగన్నాథ స్వామి! నయన పథగామీ | శ్రీ ఎస్.వి.ఎస్.శర్మ | 10 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి.హేమంత కుమార్ | 13 |
| సంస్కృతం చిత్తవృత్తికి తేజం! | డా॥ జి.లక్ష్మీనారాయణ | 15 |
| సద్వాణి సూక్తి | శ్రీ మాదిరాజు రంగారావు | 16 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు, కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 17 |
| వ్యాసపూర్ణిమ | డా॥ కె. అన్నపూర్ణ | 19 |
| చాతుర్మాస్య వ్రతం | డా॥నేతి అనంతరామశాస్త్రి | 20 |
| వేదములు-విద్యలు | శ్రీ ధారా రాధాకృష్ణమూర్తి | 23 |
| ఏకాదశుల ప్రాముఖ్యత | ఆచార్య ఎస్. మురళీధర్ రావ్ | 25 |
| 'గురు' గ్రహం | శ్రీ మద్దులపల్లి వేంకటేశ అవధాని | 26 |
| శుచీంద్రం | శ్రీ దేవరకొండ శేషగిరిరావు | 31 |
| శ్రీమద్భగవద్గీత | ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ | 33 |
| ఉదంకోపాఖ్యానం - గురుశిష్య సంబంధం | శ్రీ పాలకుర్తి రామమూర్తి | 35 |
| తల్లిదండ్రులు-తనయుల సంబంధాలు | శ్రీ చివుకుల రమాకాంతశర్మ | 38 |
| పరమ భక్తునిగా మలుచుకున్న స్వామి | డా॥ గణగళ్ళ విజయకుమార్ | 39 |
| ఉన్నతి, పురోగమనం ప్రతి జీవికి లక్ష్యం | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ | 40 |
| హరిదాసవాఙ్మయంలో... శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 41 |
| వ్యాసుడు-వేదవిభాగము | కీ.శే.'కులపతి'ఎక్కిరాల రామకృష్ణమాచార్య | 43 |
| అపారఔషధ గుణాలున్న 'నల్లతుమ్మ' | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 46 |
| కలసి ఉంటే కలదు సుఖము | శ్రీ రామమూర్తి పాలకుర్తి | 48 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య, నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 49 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 50 |
| భక్తి శ్రద్ధలతో అనుష్ఠానం | శ్రీమతి ఎం.సత్యవతి | 51 |
| వేదవ్యాసుడు (చిత్రకథ) | కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు, చిత్రాలు : శ్రీ కె.తులసీప్రసాద్ | 52 |
| బాలవినోదం | నిర్వహణ- డా॥ అల్లాడి సంధ్య | 54 |


ముఖచిత్రం : ఆణివర ఆస్థానం (తిరుమల)
వెనుక చిత్రం : శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కార వైభవోత్సవం (శ్రీనివాసమంగాపురం)


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333





వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# నిజమైన గురువు-శిష్యుడు

*గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః। గురుస్సాక్షత్ పరమ్ బ్రహ్మా తస్మై శ్రీగురవే నమః॥*

మానవులకు తొలిగురువు తల్లి. లౌకిక విషయాలను తెలిపే మలిగురువు తండ్రి. ఆ తర్వాత స్థానం విద్యనేర్పే గురువుది. లౌకిక వైద్య, పారమార్థిక విద్య అని రెండు రకాలు. లౌకిక విద్యనభ్యసించి, సంసారంలో ఉంటూ తామరాకును నీటి బొట్టు అంటని విధంగా ఉంటూ, ఆత్మ జ్ఞానాన్ని పొంది పరంకొరకు ప్రయత్నం చేసేవాడు నిజమైన జ్ఞాని. ఆ జ్ఞానాన్ని కలుగజేసేవాడు గురువు.

శిష్యుడు యోగ్యుడైతే గురువే శిష్యుని వెతుక్కుని వస్తాడు. శ్రీరాముని వద్దకు విశ్వామిత్రుడు అలా వచ్చే సాయమడిగినాడు.

పుస్తకంలోని విద్యే విద్యకాదు. దానిని బోధించేవాడు మాత్రమే గురువూ కాదు. ప్రకృతిలో ఎన్నో విద్యలున్నాయి. ఎన్నో విషయాలను బోధించే గురువుగా ప్రకృతి ఎన్నో మతాలను చెబుతుంది. సమయపాలన గురించి సూర్యుడు, ఇచ్చి పుచ్చుకునే ధోరణిని వృక్షాలు, సహనగుణం కలిగి ఉండాలని భూమి ఇలా పంచ భూతాలు గురువులై అనేక విషయాలని బోధిస్తున్నాయి.

వాటితో పాటు చీమలు క్రమశిక్షణని, కష్టపడి పని చెయ్యమని బోధిస్తాయి. తేనెటీగలు సంఘీ భావాన్ని బోధిస్తాయి. "బ్రతికినన్నాళ్ళు ఆనందం పంచు జీవితం ముగిశాక కాకుండా మౌనంగా నిష్క్రమించు" అని బోధిస్తుంది పువ్వు. చిగురు తుంచితే మొక్క రెండు చిగురులుగా పైకి లేచి "అపజయానికి కృంగిపోకు. ప్రయత్నించి దిగ్విజయం పొందు" అని బోధిస్తుంది. ఆకాశం వైశాల్యాన్ని, కొండ ధీరత్వాన్ని, ఔన్నత్యాన్ని బోధిస్తాయి. ఇవన్నీ పరోక్షంగా మానవునికి గురువులే. కాబట్టి ఆ గురువులందరిబోధనలను ఒంటపట్టించుకుని పురోగమిస్తే, మానవుని మనుగడ ఉన్నతస్థాయిలో సాగుతుంది.

**దీపదర్శన మాత్రేణ ప్రణశ్యతి తమోయుధా। 'సద్గురోర్ద'ర్శనాదేన తథా జ్ఞానం వినశ్యతి॥**

దీపము యొక్క కాంతి పడగానే చీకటి ఎలా మాయమౌతుందో, అలాగే మంచి గురువు దర్శనంతో అజ్ఞానాంధకారం తొలగిపోతుంది. నిజానికి ప్రతి మనిషీ జ్ఞనస్వరూపుడే కానీ! మాయ, స్వార్థం, అహంకారాలు కలిగి ఉండడం వలన ఆ జ్ఞానం కప్పుబడిపోయి ఉంటుంది. ఆ అజ్ఞానాంధకారాన్ని తొలగించి, వివేకాన్ని మేల్కొలిపేవాడు గురువు.

**'గు'కారస్త్వన్దకారశ్యాత్, 'రు'కారస్తన్ని రోధకః। అంధకార నిరోధత్వాద్గురురిత్యభిధీయతే॥**

"గు" అనే శబ్దానికి అంధకారమని "రు" అనే శబ్దానికి దానిని తొలగించే వాడు అని అర్థం. కాబట్టి "గురు" అనే రెండక్షరాల సమాహార పదానికి "అజ్ఞానాంధకారాన్ని తొలగించేవాడు" అని అర్థం.

"గురువు" అనే పదానికి గొప్పది, విశేషమైనది అనే అర్థాలూ ఉన్నాయి. అంటే గురువు "అందరి కంటే గొప్పవాడు" అని అర్థం. ఎందుకంటే దేశాన్ని ఏలే చక్రవర్తి, నా తయారు చేసేది గురువే. ఎందరిచేతో వందనాలు స్వీకరించే ఆ ప్రభువు సైతం శిరస్సు వంచి పాదాభివందనం చేసేది గురువుకే.

ఎవరు నిజమైన గురువో, ఎవరు కాదో తెలుసుకోవటానికి మన పెద్దలు కొన్ని కొండగుర్తులు చెప్పి ఉంచినారు. అవి ఏమిటి?

నిజమైన గురువు దగ్గర డబ్బు ప్రసక్తి వుండదు. అతడు బోధ గురువే కాని, బాధ గురువు కాదు.

నిజమైన గురువుకు అందరూ సమానమే. అతడికి బీదవాడు, ధనికుడు అనే భేదం వుండదు. కులం, మతం, ప్రాంతం అనే తేడాలుండవు.

అతడు ఎప్పుడూ అనందం అనుభవిస్తూ వుంటాడు. అతడి చుట్టు ఆనందం వెల్లివిరుస్తూ వుంటుంది. అతణ్ణి దర్శించుకోవటానికి వచ్చిన వాళ్ళకు కూడా ఈ ఆనందం, కొదో గొప్పో, వాళ్ళ వాళ్ళ ప్రాప్తాన్ని బట్టి, అంటుకుంటుంది.

అతడు ఏ స్థితిలో ఉన్న మనుష్యుల మధ్య అయినా, పరిస్థితుల మధ్య అయినా అప్రయత్నంగానూ, సహజంగానూ ఇమిడి పోగలడు. రాజులలో మహారాజుగా, ధనికులలో అత్యంత ధనికుడుగా, బీదలలో అతి బీదగా ఉండగలడు. పెద్దవాళ్ళ మధ్య పెద్దవాడుగా, పిల్లవాళ్ళ మధ్య పిల్లవాడుగా ఉండగలడు.

నిజమైన గురువు చెప్పేదానికీ, చేసే దానికీ తేడా వుండదు. శిష్యులకు ఉపదేశించేది ఒకటి, తాను ఆచరించేది వేరొకటిగా వుండదు. అతడి జీవితం పది మందికి తెలిసేటట్టుగా వుంటుంది. గోప్యం వుండదు. దాచుకోవలసింది అతడికి ఏమీ ఉండదు.

నిజమైన గురువు దగ్గర అట్టహాసాలు, ఆడంబరాలు, వేషాలు, కృత్రిమత్వాలు వుండవు. అతడి ప్రవర్తన, మాట తీరు, చాల సహజంగా, సాదాసీదాగా ఉంటుంది.

గురుశిష్యుల మధ్య ఉండవలసిన ఈ పవిత్రబంధం ఆధ్యాత్మిక విద్యలకు మాత్రమే పరిమితం కాదు. నేటికాలంలో స్కూళ్ళు, కాలేజీల్లో చెప్పే ప్రాపంచిక విద్యలక్కూడా ఇది వర్తిస్తుంది. వెలుగుతున్న దివ్వె ఇంకో దివ్వెని వెలిగించినట్లు, జ్ఞాని అయిన గురువు నిజమైన విద్యార్థిని ఇంకో జ్ఞానిగా మారుస్తాడు.

నమస్కారం చెయ్యటం అంటే వట్టినే చేతులు జోడించటం కాదు. సర్వశరణాగతి అవటం. ప్రశ్నించటం కేవలం ప్రశ్నించటం కొరకు కాదు. ప్రశ్నించటం అనేది గురువుగారి తెలివితేటలు. పరీక్షించటానికో చిక్కుల్లో పడెయ్యటానికో కాదు. సద్బుద్ధితో విషయం తెలుసుకోవటానికి ప్రశ్నించాలి. ఇష్టమైతే సేవించటం, లేకపోతే మానెయ్యటం సేవ అనిపించుకోదు. గురువుగార్ని సేవించటానికి నేను ఉన్నాననే భావంతో ఉండటమే నిజమైన సేవ అనిపించుకొంటుంది.

'మంచిని మానవత్వపు విలువలు ప్రభోదించి, జ్ఞానాన్ని కలిగించి, వ్యక్తిత్వాన్ని నిర్మించేవాడే "గురువు"

చరిత్ర కందని కాలం నుండి,
కలియుగ వైకుంఠమైన తిరుమల ఆలయంతో సహా..
మరెన్నో ప్రముఖ వైష్ణవాలయాలలో ప్రతినిత్యం జరిగే
పెక్కు సేవలు, కైంకర్యాల నుండి;
వార, పక్ష, మాస, సంవత్సరోత్సవాల వరకు జరిగే
వైదిక ప్రక్రియలన్నీ
**'శ్రీవైఖానస ఆగమశాస్త్రాన్ని'**
అనుసరించే నిర్వహింపబడుతుంటాయి.
ఈ సంప్రదాయానికి మూలపురుషుడై నట్టి
'విఖనసమహర్షి' గురించి తెలుసుకుందాం.



# విఖనస మహర్షి

- శ్రీ పి.కృష్ణ బాలాజీ

## వైఖానః సామగాయనః

ఆత్మయోనిః స్వయంజాతో వైఖానః సామగాయనః ।
దేవకీనందనః స్రష్టా క్షితీశః పాపనాశనః ॥

శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రంలో శ్రీమహావిష్ణువును వర్ణించిన వేయి నామాలలో 'వైఖానః' అనే నామం (106వ శ్లోకం, 987వ నామం) కూడా ఒకటి. ఈ పదం- 'ఖం' అనే పదం యొక్క వ్యుత్పత్తి. 'ఖం' అంటే- తొలచిన, మలచిన, తీర్చిదిద్దిన అనే అర్థాలున్నాయి. 'వైఖానః' అంటే- 'తొలచినవాడు' లేదా 'మలచినవాడు' లేదా 'తీర్చిదిద్దినవాడు' అని అర్థం.

ఈ విశ్వాన్ని- సృష్టిలోని సమస్త చరాచరజీవులు; భూమండలం, గ్రహాలు, పంచభూతాలు వంటి నిర్జీవులు; తమ మనుగడను నిరంతరాయంగా సాగించడానికి వీలుగా తీర్చిదిద్దిన వాడు కనుక శ్రీమహావిష్ణువు 'వైఖానః' అని కీర్తించబడ్డాడు.

## విఖనసమహర్షి ఆవిర్భావం

కృతయుగంలో నాలుగు పాదాలతో విరాజిల్లిన 'ధర్మం' క్రమంగా ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క పాదాన్ని కోల్పోతూ- కలియుగంలో కేవలం ఒక్క పాదం పైనే నడుస్తుందని; తన సృష్టిలో ధర్మం కుంటుపడబోతోందని; కలియుగ వాసుల్లో విష్ణు భక్తి, పాపభీతి, మోక్షకాంక్షలుప్తమై భోగలాలసత్వం మరియు భౌతిక సంపదల పట్ల వ్యామోహం ప్రబలడమే దానికి కారణం కాబోతోందని; భూతభవిష్యద్వర్తమానాలకు కర్తయైన శ్రీమన్నారాయణుడు తలపోశాడు. ప్రజలలో నిద్రాణమై ఉన్న విష్ణుభక్తిని మేల్కొలిపి, వారి దృష్టిని ధార్మిక చింతన వైపు మళ్ళించితే ధర్మం తిరిగి పాదుకొంటుం దని విష్ణువు భావించాడు. కలియుగంలో నెలకొన్న కాల, మాన పరిస్థితుల దృష్ట్యా తపస్సు, యజ్ఞయాగాదులవంటి సంక్లిష్ట ప్రక్రియలు ఆచరణ సాధ్యం కాకపోవడంవల్ల అర్చనలు, నిత్యపూజలు, నివేదనల వంటి సులభతరమైన వైదిక పద్ధతుల ద్వారా ప్రజలను భక్తి మార్గంలోకి మళ్ళించాలి. అందునిమిత్తం కలియుగంలో అర్చామూర్తి రూపంలో ఆవిర్భవించబోయే తనను శాస్త్రోక్తంగా అర్చించుకోవడం కోసం కావ లసిన నియమ నిబంధనలను ఓ గ్రంథ రూపంలో క్రోడీకరించ వలసిందిగా తన పుత్రుడైన బ్రహ్మను కోరాడు. ఈ నియమా లన్నీ అపౌరుషేయాలైన చతుర్వేదాలలో నిక్షిప్తమై ఉన్నాయి. కానీ అవన్నీ కలగా పులగంగా ఉన్న వేదరాశిలో సంక్లిష్టంగా ఇమిడి ఉండడంతో, వేదపరిజ్ఞానం అంతగా లేని కలియుగవాసులు ఆకళింపు

చేసుకో గలిగే సులభమైన రీతిలో శాస్త్రవిధులను సంకలనం చేయించాలని విష్ణుదేవుని సంకల్పం.

అంతటి మహత్కార్యాన్ని చేపట్ట గలిగే శక్తి తనకు లేదని, అటువంటి సామర్థ్యం కలిగిన వ్యక్తిని తాను సృజించ లేనని బ్రహ్మదేవుడు తన అశక్తతను వ్యక్తం చేశాడు. సృష్టికర్త యైన బ్రహ్మకే సాధ్యం కాకపోతే ఈ కార్యం మరెవరి వల్ల సిద్ధింపబడుతుంది? ఈ విధంగా తలపోసిన శ్రీమహావిష్ణువు, తన సంకల్పాన్ని సాకారం చేసుకోవడం కోసం– తన మానసం నుండి ఓ మహానుభావుణ్ణి ఉద్భవింపజేశాడు. అలా జన్మించిన వాడే విష్ణుమానస పుత్రుడైన **'విఖనసమహర్షి'.**

*'శ్రీవిష్ణోరాత్మజ శ్రీమాన్ విఖనో మునివల్లభః'* – అనే పురాణశ్లోక సారాంశం ఇదే..

ఆ విధంగా, విఖనసుడు 'బ్రహ్మదేవునికి' అనుజుడన్న మాట. శ్రావణమాసపు శుక్లపక్షంలో, పౌర్ణమి, శ్రవణానక్షత్రం సోమవారం నాడు నైమిశారణ్యంలో వీరు ఆవిర్భవించారు. వీరు ఉద్భవించిన శ్రావణపౌర్ణమి పుణ్యదినం 'జంధ్యాల పౌర్ణమి' మరియు 'రక్షాబంధనదినం"గా కుడా వ్యవహరింపబడుతుంది. ఈ రోజున గాయత్రీ మంత్రాన్ని జపించి, నూతన యజ్ఞోప వీతాన్ని ధరించే సంప్రదాయముంది.

## రూపురేఖలు

ముమ్మూర్తులా విష్ణువును పోలియుండే విఖనసుడు కూడా చతుర్భుజుడై, శంఖుచక్రాలను ధరించి, ద్వాదశ ఊర్ధ్వ పుండ్రాలంకార ధారియై; దివ్యతేజస్సుతో వెలుగొందుతుంటాడు. అదనంగా మునిపుంగవుడు గావున దండ కమండాలలను, తులసీ పుష్పమాలలను కూడా ధరించి ఉంటాడు. బ్రహ్మను పోలిన ముఖవర్ఛస్సుతో వెలుగొందుతూ విష్ణుసేవకు, జనులలో విష్ణువుపట్ల భక్తిభావనను పెంపొందించడానికి సదా సన్నద్ధంగా ఉంటాడు.



## వైఖానస ఆగమం

విఖనసుని ద్వారా ఉద్భవించినది కనుక ఈ శాస్త్రం 'వైఖానస ఆగమం' అయ్యింది. శ్రీమహావిష్ణువు ఆదేశానుసారం వేదాలలో పొందుపరచబడియున్న అర్చారీతులన్నింటినీ క్రోడీ కరించే బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకొన్న విఖనసుడు– మరో నలుగురు ఋషిపుంగవులను శిష్యులుగా జేసుకొని, వారి సహాయంతో ఈ మహత్కార్యాన్ని సాధించాడు. వారిలో– అత్రి మహర్షి, భృగుమహర్షి, మరీచిమహర్షి బ్రహ్మమానస పుత్రులు కాగా; నాల్గవ వాడైన 'కశ్యపమహర్షి' మరీచి పుత్రుడు.

విఖనస మహర్షి వైఖానస ఆగమాన్ని విషయానుసారం వర్గీకరించి– ఆత్రేయస గోత్రీకులకు మూలపురుషుడైన అత్రి మహర్షికి 'సమూర్తార్చనా విధులు'– అంటే దేవాలయాలలో మూర్తులను అర్చించే పద్ధతులను; భృగుమహర్షికి 'అమూర్తార్చనా విధులు'– అంటే యజ్ఞయాగాదులను నిర్వహించే పద్ధతులను; కశ్యపగోత్రీకులకు మూలపురుషుడైన కశ్యపమహర్షికి 'తర్క, జప విధులను'; మరీచిమహర్షికి 'అగ్నిహుతం' అనే వైదిక కర్మ కాండను బోధించి, వారి శిష్యులు, ప్రశిష్యుల ద్వారా వైఖానస ఆగమశాస్త్రాలను వ్యాప్తి చేశాడు.

వేదాలు కర్మలను బోధిస్తే, ఉపనిషత్తులు జ్ఞానాన్ని ప్రసాదిస్తాయి. ఆగమశాస్త్రం మాత్రం కర్మ, జ్ఞానం రెండింటిని సమన్వయ పరచి, కర్తవ్యబోధ చేస్తాయి. శ్రీవేంకటేశ్వరుని ఆదేశం మేరకు, తిరుమలలోని ఆనందనిలయ విమానాన్ని మొట్ట మొదటగా 'మరీచి సంహిత' ననుసరించి తొండమాన్ చక్రవర్తి నిర్మించాడని ప్రతీతి. 'సంహిత' అంటే 'సంకలనము' అని అర్థం. దీని ద్వారా వైఖానస ఆగమసూత్రాలు వ్రాయ బడలేదని, అపౌరుషేయాలైన వేదాల నుండి వెలికి తీసి సంకలనం చేయబడ్డాయని రూఢి అవుతుంది. సహస్రాబ్దాలుగా ఉనికి లోనున్న వైఖానస ఆగమశాస్త్రం శాఖోపశాఖలుగా విస్తరించింది. ప్రస్తుత మున్న వైఖానస అర్చకు లందరూ, దాదాపుగా, వైఖానస కృష్ణయజు ర్వేద తైత్తరీయశాఖకు చెందినవారే.

## విష్ణురూపాలు

వైఖానస ఆగమశాస్త్రాలలో శ్రీమహా విష్ణువుకు ఈ క్రింది ఐదురూపాలు ఉన్నట్లుగా చెప్పబడింది.

**1) విష్ణువు** - అనగా, విశ్వమంతా వ్యాపించి యున్నవాడు. ఈ రూపం పరమేశ్వరుని విశ్వవ్యాపకత్వాన్ని సూచిస్తుంది.

**2) పురుషుడు** - అనగా పూర్ణత్వం కలిగినవాడు. విశ్వవ్యాపకత్వం మరియు పూర్ణత్వం సమానార్థం కలిగిన పదాలుగా గోచరించినప్పటికీ ఈ రెండు రూపాలు ఒక దానికొకటి పూర్తిగా భిన్నం. 'పూర్ణత్వం' అంటే ఉత్తమోత్తములకు ఉండవలసిన గుణాలను తనలో పరిపూర్ణంగా కలిగి ఉండటం. 'విశ్వవ్యాప్త' మంటే తాను విశ్వమంతటా వ్యాపించి యుండటం. సులభంగా అర్థమయ్యే గణితపరిభాషలో చెప్పాలంటే పూర్ణత్వాన్ని 'గరిష్ట సామాన్య ప్రామాణికం' తోనూ; విశ్వవ్యాపకత్వాన్ని 'కనిష్ట సామాన్యం గుణిజం'తోనూ పోల్చవచ్చు. మరింత సులభంగా చెప్పాలంటే, పూర్ణత్వం అంటే తనలో అన్నింటినీ నింపుకోవడం; విశ్వవ్యాపకత్వం అంటే తానన్నింటి యందు నిండియుండటం.

**3) సత్య** - అంటే శాశ్వతమైన వాడు. ఈ రూపం శ్రీమహావిష్ణువును పుట్టుక, జరామరణాలు లేనివానిగా చెబుతుంది.

**4) అనిరుద్ధ** - అంటే, ఏ విధమైన అడ్డంకి గాని లేదా పరిమితులు లేని వాడు. ఈ రూపం తలచినంతనే అసాధ్యాలను సైతం సుసాధ్యం చేయగలిగే ఘటనాఘటన సమర్థునిగా విష్ణువును తలపుకు తెస్తుంది.

**5) అచ్యుత** - అంటే మార్పు లేదా క్షయం లేనివాడు. స్వయంగా తాను మార్పు లేకుండా ఉండడమే గాక, తనచే సృజించబడిన గ్రహాలను, జీవులను, ప్రకృతిని, పంచభూతాలను, ఋతుచక్రాన్ని సృష్ట్యాది నుండి ఏవిధమైన మార్పుకు లోను గాకుండా ఉంచ గలిగినవాడు.

విష్ణువుకు ఆపాదించబడిన ఈ రూపాలన్నీ అనాది నుండి నేటివరకూ నిత్యసత్యాలై వెలుగొందుతున్నాయి. వెలుగొందుతూనే ఉంటాయి కూడా..

ఇదే భావనను ప్రామాణికంగా చేసుకొని 'వైఖానస ఆగమశాస్త్రం' రూపొందించబడింది.

## వైఖానస కల్పసూత్రం

విఖనస మహర్షి విరచితమైన వైఖానస కల్పసూత్రంలో- మానవుడు తన బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ ఆశ్రమాల యందు తప్పనిసరిగా ఆచరించవలసిన ధర్మాలు; నిదుర లేచినది మొదలు రాత్రి నిదురించేంత వరకూ దినమంతా చేపట్టవలసిన విధులు; పరమపదాన్ని సులభంగా చేరుకోవడానికి ఆచరించవలసిన వైదిక కర్మలు మొదలగు విషయాలన్నీ ముప్పైరెండు ప్రశ్నోత్తరాల రూపంలో పొందుపరచబడ్డాయి.

## వైఖానస అర్చకులు

వైఖానస ఆగమశాస్త్రాన్ని అనుసరించి, అందులో పొందుపరచబడిన నియమాలను తూచా తప్పకుండా పాటిస్తూ, శ్రీమహావిష్ణువును ఆరాధిస్తూ, వారికి ఆగమశాస్త్రంలో ప్రస్తుతించిన కైంకర్యాలను నియమబద్ధంగా నిర్వహించేవారిని 'వైఖానస అర్చకులు' గా వ్యవహరిస్తారు. తిరుమల ఆలయంలో- చరిత్రకందని కాలంలో, పురాణాలలో ఉటంకించిన 'గోపీనాథ దీక్షితుల' వారి నుండి ఈనాటి వరకూ కూడా వైఖానస అర్చకులే శ్రీవారి పూజాకైంకర్యాలను నిర్వహిస్తున్నారు. పురాణేతిహాసాలననుసరించి- విష్ణువును అర్చించగలిగిన అర్హత, సామర్థ్యం కేవలం వైఖానసులుకే ఉంటాయి. కావున, వైఖానస అర్చకులు స్నానాదికాలు కావించి, ఊర్ధ్వపుండ్రధారులై, ఆగమప్రక్రియల ద్వారా తమలో విష్ణువును ఆవహింపజేసుకుని మాత్రమే భగవదారాధనకు పూనుకుంటారు.

## విఖనస మహర్షి ఆలయం

తిరుమల క్షేత్రంలోని ఉత్తరమాడవీధిలో, ఆదివరాహస్వామి ఆలయానికి అభిముఖంగా, నిర్మింపబడిన ఆలయంలో- విఖనసమహర్షి కొలువై ఉంటాడు. సమున్నతమైన పీఠంపై ఆసీనుడై, తన నలుగురి శిష్యులకు ఆగమశాస్త్రాన్ని ప్రవచిస్తున్న విఖనసుని దివ్యమంగళమూర్తిని ఈ ఆలయంలో దర్శించుకోవచ్చు. దాని చెంతనే ఉన్న వైఖానస అర్చక నిలయంలో నివసించే అర్చకులు లాంఛనప్రాయంగా విఖనస మహర్షి అనుమతి తీసుకుని మాత్రమే ఆలయంలో విధులు నిర్వర్తిస్తారు. ఈ ఆలయంలో ప్రతి ఏటా విఖనసమహర్షి జయంత్యుత్సవం వైభవోపేతంగా జరుపబడుతుంది. ఆరోజు సాయం సమయంలో సహస్రదీపాలంకరణ సేవ జరిగిన తరువాత, ఉభయదేవేరులతో కూడిన మలయప్పస్వామి విఖనస మహర్షి ఆలయానికి విచ్చేసి, మునివర్యుల ఆతిథ్యం స్వీకరిస్తారు తన జన్మదిన సందర్భంగా తండ్రిగారికి ఆదరపూర్వకంగా ఆతిథ్యమిచ్చిన తనయుడు ఆనందపరవశుడై పులకించి పోతాడు.

ఈ విధంగా విఖనసమహర్షి సాక్షాత్తు శ్రీనివాసునికి ఆతిథ్యమిచ్చి భక్తలోకానికి మార్గదర్శిగా నిలచిన అతనికి సహస్రాధిక వందనాలు.

*గోవిందా! గోవిందా!! గోవిందా!!!*



# జగన్నాథస్వామి! నయనపథగామి

- శ్రీ యస్.వి.యస్.వి.శర్మ

సప్త మోక్షపురాలలో ఒకటిగా, 'చార్ధాం'గా పిలువబడే నాలుగు మహాక్షేత్రాలలో ప్రధానమైనదిగా కీర్తింపబడుతున్నది **'పురుషోత్తమ క్షేత్రం'** (పురీ). దీని గురించి ఋగ్వేద, అథర్వణ వేదాలు మొదలుకొని స్కంద, బ్రహ్మ, పద్మపురాణాలలోనూ, వామదేవసంహిత, కపిలసంహితలలోనూ చాలా వివరంగా ఉంది.

ఈ క్షేత్రం మహోదధి (బంగాళాఖాతం) అనే సముద్ర తీరంలో 5 క్రోసుల విస్తీర్ణం గల క్షేత్రం. ఈ దేవాలయాన్ని తొలిసారిగా ఇంద్రద్యుమ్న మహారాజు కట్టించగా, బ్రహ్మదేవుడు నారదాది మహర్షులతో వేంచేసి భరద్వాజుని ఆధ్వర్యవంలో ఈ దేవాలయాన్ని ప్రతిష్ఠించాడు. వారి సూచనలు అనుసరించే రథాలు కూడా ప్రథమంగా తయారు చేయబడ్డాయి.

ఈ దేవాలయానికి ముందు అరుణస్తంభం దర్శనం ఇస్తుంది. ప్రధాన ఆలయంలో 'రత్నవేది' అని పిలవబడే పెద్ద వేదికపై ప్రధానంగా ఉండే దేవతా విగ్రహాలు జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రా దేవి, సుదర్శనుడు అనే దారు (చెక్క) బ్రహ్మమూర్తులు. ఇవి కాక మాధవుడు, శ్రీదేవి, భూదేవి విగ్రహాలు అష్టధాతు మూర్తులుగా కొలువై ఉంటారు.

జగన్నాథ, బలభద్ర, సుదర్శన విగ్రహాలు సుమారుగా 6 అడుగుల ఎత్తులో ఉంటాయి. సుభద్రాదేవి విగ్రహం 5 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఇవి వేపచెట్టు దారువుతో తయారైనవి. బృహత్ సంహిత, విష్ణుసంహితల ప్రకారం చూస్తే వేపదారువులతో చేసిన విష్ణువును పూజిస్తే ఆయువు, శ్రీ(సంపద), బలము, విజయము కలుగుతాయి. జగన్నాథ బలభద్రుల చేతులు సమాంతరంగా ఉండి నమ్మిన భక్తులకు ఆలింగన భాగ్యాన్ని కలిగించడానికి సిద్ధంగా ఉంటాయి. ఇది అత్యంత భక్తవాత్సల్యానికి పరాకాష్ఠ. చక్రాలవంటి కళ్ళతో కంటికి రెప్పలు కూడా (లేకుండా) వేయకుండా కనిపెట్టుకుని ఉంటాడు.

## నీలచక్రము

ప్రధాన దేవాలయంలో స్తంభాకారంగా ఉన్న సుదర్శనుడు 214 అడుగుల ఎత్తుగల ప్రధాన దేవాలయ శిఖరముపై అష్టధాతు నిర్మిత చక్రముగా "నీలచక్రము" అనే పేరుతో కొలువై ఉంటాడు.

ఇది 2200 కిలోల బరువుతో సుమారు 12 అడుగుల పొడవు కలిగి 36 అడుగుల వ్యాసంతో ఉంటుంది. ప్రతి ఏకాదశినాడు గోపురంపై ఈ నీలచక్రం వద్ద దీపాన్ని వెలిగిస్తారు. ఆ చక్రముపై విశాలమైన ధ్వజము ఉంటుంది. ధ్వజము గాలికి వ్యతిరేక దిశలో కదలడం ఇక్కడి మరో ఆశ్చర్యకరమైన విషయం. ప్రతిరోజూ నూతనధ్వజాన్ని, కడతారు ప్రధాన ధ్వజమే కాక, భక్తులు ధ్వజము మొక్కుబడిగా కొని, కట్టించడం జరుగుతుంది. ఆ ధ్వజములు ఒక అడుగు నుండి 25 అడుగుల వరకు వారి వారి శక్తిమేరకు సమర్పించుకుంటారు. ఈ ధ్వజములు కాషాయము లేదా పసుపు రంగులలో ఉండి అర్ధచంద్ర, సూర్యబింబములు కలిగి ఉంటాయి.

## తీర్థములు

సర్వతీర్థ, నదీమయమైన మహోదధి పేరుతో ఉన్న సముద్రమే కాక, స్మరించినంత మాత్రాన పవిత్రులను చేసే తీర్థ


'విద్య' దారిద్ర్యంలో దారి చూపి, ఆశ్రయమిస్తుంది

రాజాలు *(1)ఇంద్రద్యుమ్న తీర్థము; (2)శ్వేతగంగా తీర్థము; (3)రోహిణీ కుండము;* మరియు *(4)మార్కండేయ తీర్థములు* నెలకొని ఉన్నాయి.

ప్రణవములోని 'అ'కార, 'ఉ'కార, 'మ'కారాలే ఈ త్రిమూర్తులు కాగా, తురీయమైన బిందురూపమే సుదర్శనుడు. *"జి కారస్తు జగన్నాథః బలభద్రోగ కారకః న కారో సుభద్ర రూపాచ త కారోపి సుదర్శనః"* ఒకే జగన్నాథ పరబ్రహ్మం నాలుగుగా మారి ఈ రూపాలను దాల్చింది. ఈ త్రిమూర్తుల శిరసు పైభాగాలు త్రిభుజాకారంలో ఉండడం ఒకానొక యంత్రవిశేషం. ఇక్కడ పూజా విధానం వైదిక, తాంత్రిక, వైష్ణవ పద్ధతులలో జరుగుతుంది. బలభద్రుడు తారా యంత్రముపై, సుభద్రాదేవి భువనేశ్వరీ యంత్రముపైన, జగన్నాథుడు కాళీ యంత్రముపైన విరాజిల్లుతుంటారని ప్రసిద్ధి. ప్రతిరోజూ వీటికి మూల మంత్ర, దేవతాన్యాస, పీఠన్యాస మంత్రన్యాస, మూర్తి పంజరన్యాసములు మొదలైనవి చేస్తారు. జగన్నాథునికి గోపా లార్చన పూజాపద్ధతి, బలభద్రునికి వాసుదేవ పూజాపద్ధతి, సుభద్రాదేవికి భువనేశ్వరీ పూజా పద్ధతులతో పూజలు జరుగుతాయి. సుదర్శనునకు సుదర్శన, నారసింహ మంత్రాదులతో పూజలు చేస్తారు.

## రథయాత్ర

ప్రతి ఏడాది వైశాఖ శుక్ల తృతీయ (అక్షయతృతీయ) నాడు విధివిధానంగా హోమాదులు చేసి మూడు రథాలు తయారు చేయడం ప్రారంభిస్తారు. ఆషాఢ శుక్ల విదియనాడు ప్రపంచప్రసిద్ధమైన **'శ్రీపూరీజగన్నాథ రథయాత్ర'** ఆరంభం అవుతుంది. 'రత్నవేది' పై ఉన్న మూలవిరాట్టులే భక్తులకోసం రథాలపైకి వేంచేసి ప్రధాన ఆలయం నుండి గుండిచా మందిరం వరకు ఊరేగుతారు. రథాలలో మూర్తులు చేరాక, గజపతి రాజు వచ్చి బంగారు పిడిగల చీపురుతో రథాలను తుడవడం ఆనవాయితీ. పూరీలో గల గోవర్ధనపీఠ శంకరాచార్యుల వారు ప్రథమంగా వేంచేసి రథస్థులైన మూర్తులను కొలుచుకున్న తరువాత భక్తుల సంకీర్తనలు, శంఖధ్వనులు, మేళతాళాలతో అంగరంగ వైభోగంగా రథయాత్ర ప్రారంభం అవుతుంది. గుండిచా మందిరంలో తొమ్మిది రోజులు దశావతారాలతో భక్తులకు దర్శనం లభిస్తుంది. ఈ రథాలయందు పార్శ్వదేవతలు, శిఖర దేవతలు ఇలా ఎన్నో శక్తులు నెలకొని ఉంటాయి. వాటి వివరాలు తెలుసుకుంటే ఆ దివ్యశక్తుల అనుగ్రహం లభిస్తుంది.

## 1) జగన్నాథ రథం విశేషాలు

**పేరు:** నందిఘోష, **పొడవు:** 45' 6", 16 చక్రాలు, రథముపైన పసుపు, ఎరుపు రంగులతో ఉన్న వస్త్రాన్ని గోపురంగా అమరుస్తారు. దాని పైనున్న ధ్వజముపై హనుమంతుడు, చంద్రుడు, శంఖము ఉంటాయి. శంఖ, వలాహక, శ్వేత, హరిదశ్వ అనబడే నాలుగు తెల్లగుర్రాలు అమర్చబడతాయి.

**రథపాలకుడు:** గరుత్మంతుడు. **సారథి:** దారుకుడు. రథాన్ని లాగే త్రాడు యందు శంఖచూడుడు అనే దివ్య సర్పశక్తిని ఆవహింపచేస్తారు. రథము చుట్టూ తొమ్మిది మంది పార్శ్వదేవతలు దారు (కర్ర) మూర్తులుగా దర్శనమిస్తారు. వారి పేర్లు: వరాహ, గోవర్ధన, కృష్ణ, నరసింహ, రామ, నారాయణ, త్రివిక్రమ, హనుమాన్ మరియు రుద్రుడు.

## 2) బలభద్రుని రథం విశేషాలు

**పేరు:** తాళధ్వజ, **పొడవు:** 45', 14 చక్రాలు. రథముపైన ఆకుపచ్చ, ఎరుపు రంగులతో ఉన్న వస్త్రాన్ని గోపురంగా అమరుస్తారు. తాటిచెట్టు గుర్తుగా గల ధ్వజము పేరు "ఉన్మణి". తీవ్ర, ఘోర, దీర్ఘశ్రమ, స్వరార్ణవ అనబడే నాలుగు నల్లగుర్రాలు అమర్చబడి ఉంటాయి.



**రథపాలకుడు:** వసుదేవుడు. **సారథి:** మాతలి. రథాన్ని లాగే త్రాడుయందు వాసుకి అనే దివ్యసర్పశక్తిని ఆవహింపజేస్తారు. రథము చుట్టూ తొమ్మిది మంది పార్శ్వదేవతలు దారు (కర్ర) మూర్తులుగా దర్శనమిస్తారు. వారి పేర్లు: గణేశ, కార్తికేయ, సర్వమంగళ, ప్రలంబారి, హలాయుధ, మృత్యుంజయ, నతాంవర, ముక్తేశ్వర మరియు శేషదేవులు.

## 3.సుభద్రాదేవి రథం విశేషాలు

**పేరు:** దేవదలన/ దర్పదలన, **పొడవు:** 44' 6", 12 చక్రాలు. సుదర్శనస్వామి వారు కూడా దీనియందే ఉంటారు. రథము పైన నలుపు, ఎరుపు రంగులతో ఉన్న వస్త్రాన్ని గోపురంగా అమరుస్తారు. ధ్వజము పేరు నాదాంబిక. రోచిక, మోచిక, జిత, అపరాజిత అనబడే నాలుగు ఎర్ర రంగులో గల గుర్రాలు అమర్చబడి ఉంటాయి. రథమునకు రక్షణశక్తిగా త్రిపుర సుందరీ దేవి కమలమును, పద్మమును ధరించి ఉంటుంది.

**రథపాలకురాలు:** జయదుర్గ, **సారథి:** అర్జునుడు. రథాన్ని లాగే త్రాడుయందు స్వర్ణచూడుడు అనే దివ్య సర్పశక్తిని ఆవహింపజేస్తారు. రథము చుట్టూ తొమ్మిది మంది పార్శ్వ దేవతలు దారు (కర్ర) మూర్తులుగా దర్శనమిస్తారు. వారి పేర్లు: చండి, చాముండ, ఉగ్రతార, వనదుర్గ, శూలిదుర్గ, వారాహి, శ్యామాకాళి, మంగళ మరియు విమలాదేవి.

## బాహుదా రథయాత్ర, సువర్ణ వేషము, అధరపానము

మరల ఆ రథాలు గుండిచా మందిరం నుండి ప్రధాన ఆలయానికి చేరడానికి యాత్ర జరుగుతుంది. అది "బాహుదా యాత్ర" అని ప్రసిద్ధి. తిరుగు రథయాత్రలో రథముపై ఉండగానే ఈ మూర్తులకు సుమారు 208 కిలోలకు పైగా గల బంగారు, రత్న ఆభరణములతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తారు. దీనిని "సునావేష" అంటారు.

**అధరపానం:** ఇది చాలా ముఖ్య ఘట్టం. తిరుగు రథయాత్రలో ఏకాదశి రోజున త్రిమూర్తుల పెదాలవరకు వచ్చేటంతటి పొడవైన మట్టి పాత్రలలో పాలు, పంచదార, వెన్న, అరటిపళ్లు, మిరియాలు, సుగంధ ద్రవ్యాలు మొదలైనవి కలిపిన సుమారు 100 లీటర్లకు పైగా ఉన్న పానీయాలను అందిస్తారు. తరువాత ఆ పాత్రలను పగలగొడతారు. ఆ పానీయాలు అంతవరకు ఆ రథాలకు రక్షకులుగా ఉన్న దేవగణ, రక్షోగణాలు సూక్ష్మరూపాలలో ప్రసాదంగా స్వీకరించి తృప్తి పడతాయి.

## అన్నమ్ బ్రహ్మ

ప్రపంచంలోనే పెద్దదిగా పిలువబడే వంటశాలలో స్వామివార్ల నైవేద్యానికి ప్రసాదాలు తయారవుతాయి. సాధారణంగా రోజూ 56 రకాల వంటకాలు కాగా, విశేషదినాలలో ఇంకా ఎక్కువ రకాలు తయారవు తాయి. ఎటువంటి యంత్ర పరికరాలు (గ్రైండర్ వంటివి) వాడకుండా అన్నీ స్వహస్తాలతోనే కర్ర పొయ్యిలపైన, మట్టి కుండలలోనే చేయడం ఇక్కడ విశేషం. మిరపకాయలు, మసాలా దినుసులు కూడా వాడరు. నిత్యభోగం రోజుకి 5 సార్లు జరుగుతుంది. జగన్నాథునికి నివేదించిన తరువాత అక్కడి అమ్మవారైన "విమలాదేవి"కి నివేదిస్తారు. అప్పుడు అది మహాప్రసాదం అవుతుంది. ఇక్కడి ప్రసాదం 'అన్న బ్రహ్మ'గా కీర్తింపబడుతుంది.

ప్రసాదం సాక్షాత్తూ జగన్నాథుని స్వరూపం. ఇక్కడి ప్రసాదానికి ఎంగిలి, అశౌచము మొదలైన దోషాలు లేవు.

'సర్వం శ్రీజగన్నాథం' అనే నానుడి అలా వచ్చినదే. ఈ అన్న ప్రసాదం ఎండిన తరువాత 'నిర్మాల్యము'గా తెచ్చుకుని తినడం కూడా సంప్రదాయంగా వస్తోంది. భక్ష్యాభక్ష్యదోషాలు ఆ ప్రసాదం తినడం వల్ల పరిహారమవుతాయి. శ్రీరామకృష్ణ పరమహంస వారు కూడా ఆ నిర్మాల్య ప్రసాదాన్ని రోజూ సేవించేవారు.


జగద్గురు శ్రీఆదిశంకరాచార్యులవారు ధర్మప్రతిష్ఠాపనకు స్థాపించిన నాలుగు ధామాలలో తూర్పు దిక్కున ప్రసిద్ధి చెందిన గోవర్ధన ధామం ఇక్కడ నెలకొని ఉంది. వారు జగన్నాథునిపై భావించిన ఈ దిగువ భావనను మన హృదయాలలో స్థిరపరచుకుందాం.

**రథారూడో గచ్ఛన్ పథిమిలిత భూదేవపటలైః**
**స్తుతిః ప్రాదుర్భావో ప్రతిపదముపాకర్ణ్య సదయః।**
**దయాసింధుః బంధుః సకల జగతాం సింధు సుతయా**
**జగన్నాథ స్వామీ! నయనపథగామీ భవతు మే॥**

రథాలపైన పయనిస్తూ మార్గములో భక్తులచే చేయబడుచున్న స్తోత్రములలో ప్రతియొక్క పదాన్ని సముద్రతనయ అయిన సుభద్రా దేవితో కలిసి ఎంతో ప్రేమగా వింటున్న, సకలజగములకు బంధువైన జగన్నాథస్వామీ! నా కనులకు దర్శనమిచ్చి కరుణింపుము.

# శ్రీమద్భగవద్గీత





## 8వ-అధ్యాయం (సారసంగ్రహం)

*విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్,*
***94416 45995***

### అక్షరపరబ్రహ్మ యోగం అధ్యాయ నామౌచిత్యం

క్షరమంటే నశించేది. అక్షరమంటే శాశ్వతమైంది. ఈ ప్రపంచంలో వినాశరహితమైంది పరబ్రహ్మం. పరబ్రహ్మం ఒక్కటి తప్ప తక్కిన పదార్థాలన్నీ కాలగర్భంలో నశించిపోయేవే. క్షరమైంది అధి భూతం. పురుషుడు అధిదైవతం. పరమాత్మ అధి యజ్ఞం, అని అర్జునుని ప్రశ్నలకు సమాధానమిస్తూ భగవంతుడు చెప్పిన మాటలివి. శాశ్వతమై, సత్యమై, నిత్యమై వెలుగొందే పర బ్రహ్మ మొక్కటే అక్షరమైంది. కనుక అటువంటి పరబ్రహ్మను గూర్చి బోధించే ఈ అధ్యాయానికి అక్షర పరబ్రహ్మ యోగం అనే పేరు సార్థకం.

ఈ అధ్యాయంలో ప్రాణప్రయాణ కాలంలో భగ వంతుణ్ణి తెలుసుకొనే విధానం చక్కగా బోధింపబడింది. పురా తనుడు, సర్వజ్ఞుడు, సర్వలోక నియామకుడు, అణువుకంటే మిక్కిలి సూక్ష్మమైనవాడు, సమస్త ప్రపంచానికి ఆధారమైన వాడూ, చింతింప నలవి కాని స్వరూపం కలవాడు, సూర్య కాంతి వంటి కాంతి గలవాడు, అజ్ఞానాంధకారానికి అవతల ఉండే ఆ పరమాత్మను వర్ణించిన విధానం చూడండి –

**కవిం పురాణ మనుశాసితార మణోరణీయాంసమనుస్మరేద్యః ।**
**సర్వస్య ధాతార మచింత్యరూప మాదిత్యవర్ణం తమసః పరస్తాత్॥ 9**

అవసానకాలంలో జీవులు ఏ ఏ భావాలను కలిగి శరీరాన్ని త్యజిస్తారో ఆ యా భావానుగుణమైన ప్రాప్తే కలుగు తుందన్నాడు. అందుచేత సదా భగవత్స్మరణం అవసరమని చెప్ప బడింది. తరువాత ఓంకారోపాసనను వివరించాడు పరమాత్మ.

**ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్మా మనుస్మరన్।**
**యః ప్రయాతి త్యజద్రోహం స యాతి పరమాం గతిమ్॥ 13**

'ఓం' అనగా బ్రహ్మం. ఈ ప్రణవాన్ని ఉచ్చరిస్తూ 'మననం చేస్తూ దేహాన్ని చాలించేవాడు పరమపదాన్ని పొందు తాడు' అని భగవంతుడే చెప్పాడు. ముక్తులైనవారు పునర్జన్మ పొందరు. తక్కిన వారంతా మళ్ళీ పుట్టే వాళ్ళే. ఈ ప్రాణికోటి అవ్యక్తం నుంచి పుట్టి పుట్టి మళ్ళీ అవ్యక్తంలోనే లీనమవుతూ ఉంది. కానీ నశించే ప్రాణికోటిలో నశించని తత్త్వమే పరమాత్మ. అది క్షరం కాదు. అక్షరం. అదే పరబ్రహ్మం. భక్తితోనే దాన్ని పొందాలి.

ఉత్తరాయణ కాలంలో పోయినవారు బ్రహ్మప్రాప్తిని, దక్షిణాయన కాలంలో గతించిన వారు పునర్జన్మను పొందుతారని కృష్ణుడు చెప్పాడు. యోగికి భ్రమ ఉండకూడదు. అందువలన అర్జునుణ్ణి యోగివి కమ్మని ప్రబోధించాడు. ఈ అధ్యాయాన్ని నియమంగా పారాయణం చేయడం వలన వినడం వలన స్థావరత్వం, బ్రహ్మరాక్షసత్వం నశిస్తుంది.

- - - - - - -

### అర్జునుడడుగుతున్నాడు

"మధుసూదనా! బ్రహ్మమనగా నేమి? అధ్యాత్మం అంటే ఏమిటి? కర్మ మనగానేమి? అధిభూతం, అధిదైవం, అధి యజ్ఞం అనేవి ఏమిటి? ఈ దేహంలో అధియజ్ఞు డెలా ఉంటాడు? అవసానకాలంలో నిన్ను తెలుసుకోవడం ఎలా?" అని అర్జునుడు ప్రశ్నించగా శ్రీకృష్ణపరమాత్మ ఈ అధ్యాయంలో చక్కగా సమాధాన మిచ్చారు.

### భగవంతుడంటున్నాడు

దేహధారులలో శ్రేష్ఠుడా! ఓ అర్జునా! సర్వోత్కృష్టము, శాశ్వతమూ ఐన శుద్ధాత్మే బ్రహ్మము. ప్రత్యగాత్మ భావం (బ్రహ్మస్వభావం) అంటే జీవాత్మ– స్వభావమే అధ్యాత్మం. చరాచర భూతజాల ఉత్పత్తికి చేసే క్రియ 'కర్మ'. నశించే పదార్థం అధిభూతం (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు– ఇదే అపర ప్రకృతి). అధిభూతంలో ఉండే చైతన్యమే అధిష్ఠాత– అతడే విరాట్పురుషుడు– అధిదైవతం. (ఇదే పరప్రకృతి).

ఈ దేహమందున్న పరమాత్మే అధియజ్ఞం. ఆ అధియజ్ఞుడను నేనే. అంత్యకాలంలో నన్ను తెలుసుకోవాలంటే జీవితకాలమంతా అభ్యాసయోగంతో దైవస్మరణ కలిగిఉంటేనే అది సాధ్యం. అందువలన సద్గతి కలుగుతుంది.

**అన్తకాలే చ మామేవ స్మరన్ముక్త్వా కలేబరమ్ ।**
**యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః॥ 5**

మరణకాలంలో నన్ను స్మరిస్తే నన్నే పొందుతాడు. అందులో సందేహం లేదు. ఓ కుంతీ పుత్రా! మరణకాలంలో జీవుడు ఏ భావాన్నీ, ఏ వస్తువునూ స్మరిస్తాడో, ఆ యా రూపాలతో తిరిగి ఆ జన్మనే పొందుతాడు.

భగవంతుడు సర్వజ్ఞుడు, సనాతనుడు, (పురాణపురుషుడు), జగన్నియామకుడు, నాశకుడు, శాసకుడు, పరమాణుస్వరూపుడు, లోకాలకాధారభూతుడు, చింతింపనలవికానివాడు, సూర్యకాంతి మయుడు (తేజోమయుడు), తమస్సున కతీతమైనవాడు. ముముక్షువు మరణకాలమందు యోగబలంతో ప్రాణశక్తిని, దృష్టిని భ్రూమధ్యంలో నిల్పి భగవత్స్వరూపాన్ని చింతన చేస్తూ దివ్యస్థితిని పొందుతాడు. ఎవడు కట్టకడపట ఇంద్రియాలను నిగ్రహించి, మనస్సును హృదయంలో, ప్రాణాన్ని బ్రహ్మరంధ్రంలో నిలుపుకొని, నిశ్చల మనస్సుతో పరబ్రహ్మస్వరూపమైన ఓంకారాన్ని ఉపాసిస్తూ శరీరత్యాగం చేస్తాడో వాడు పరమాత్మను పొందుతాడు.

**అనన్యచేతా స్సతతం యో మాం స్మరతి నిత్యశః ।**
**తస్యాహం సులభః పార్థ! నిత్యయుక్తస్య యోగినః ॥ 14**



అనన్యచిత్తంతో – నిరంతరం నన్ను స్మరించే యోగికి నేనతిసులభుడను. అతడు నన్ను అనాయాసంగా పొందుతాడు. మనుజుడు బ్రహ్మలోకాన్ని పొందినా తిరిగి జన్మను పొందాల్సిందే. కానీ నన్ను పొందినవాడు మాత్రం తిరిగి జన్మింపడు. పార్థా! వెయ్యి మహాయుగాలు బ్రహ్మకు పగలు. అంతకాలమే ఆయనకు రాత్రి. ఇది తెలుసుకున్నవాడు కాలజ్ఞాని. సృష్టిలోని భూతజాలమంతా కూడా ప్రతినిత్యం ప్రాతఃకాల ప్రారంభంతో ప్రభవిస్తూ, తిరిగి రాత్రి కాగానే బ్రహ్మలో (ప్రకృతిలో) లయిస్తున్నది. ఇదే క్రమంలో సృష్టి నడుస్తున్నది. ఈ ప్రపంచంలో 'పరబ్రహ్మం' ఒకటి తప్ప తక్కిన పదార్థాలన్నీ కాలగర్భంలో కలిసిపోవాల్సిందే.

**అవ్యక్తఽక్షర ఇత్యుక్తః తమాహుః పరమాం గతిమ్ ।**
**యం ప్రాప్య న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥ 21**

క్షరమంటే నశించేది. అక్షరమంటే శాశ్వతమైనది, అవ్యక్తమైనది, నిత్యమైనది, సత్యమైనది, సనాతనమైనది. దీనికి నాశనం లేదు. ఆ అక్షర పరబ్రహ్మను, పరంధాముడను నేనే. ఆ పరమపదం నాదే. దానిని పొందినవారు తిరిగి ప్రపంచంలోకి రారు. ఆ పరమపురుషుడ్ని పొందాలంటే అనన్యభక్తి మార్గంతోనే పొందగలం. అగ్ని, తేజస్సు, అహస్సు, శుక్లపక్షం, ఉత్తరాయణం– వీటి యందు గతించిన బ్రహ్మవేత్తలు(యోగులు) బ్రహ్మపదం (మోక్షాన్ని) పొందుతారు. దీన్నే అర్చిరాది మార్గమని, దేవ యానమని, జ్యోతిరాది మార్గమని అంటారు. పొగ, రాత్రి, కృష్ణ పక్షం, దక్షిణాయానం– వీటియందు మరణించిన యోగులు చంద్రసంబంధమైన తేజస్సు ననుభవించి మరల జన్మిస్తారు. దీనికే ధూమాది మార్గమని, పితృయానమని పేరు. నిష్కాములై కర్మచేసి భగవంతునే ఉపాసించే వాళ్ళు జ్యోతిరాది(శుక్ల) మార్గంలో పోయి జన్మరాహిత్య స్థితిని అనుభవిస్తారు. సకామ కర్మయోగులు అంధకార (కృష్ణమార్గంలో పయనించి మరల జన్మిస్తున్నారు. ఈ రెండు మార్గాల నెరిగిన యోగి ఏ వ్యా మోహానికీ లొంగడు. కావున అర్జునా! ఎల్ల కాలమందుకూడా యోగ యుక్తుడవై ఉండు.

**వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్।**
**అత్యేతి తత్సర్వమిదం విదిత్వా యోగీ పరం స్థాన ముపైతి చాద్యమ్॥ 28**

వేదములను అభ్యసించటం వల్ల, యజ్ఞయాగాది క్రతువుల వల్ల, తపస్సు వల్ల, దానం వల్ల, ఎటువంటి పుణ్యం లభిస్తుందో దాన్ని మించిన పుణ్యఫలాన్ని యోగిపొందుతాడు. పరమ పదాన్నధిష్టిస్తాడు.

శ్రీకృష్ణార్పణమస్తు.

# సంస్కృతం చిత్తవృత్తికి తేజం!

- డా॥ జి.లక్ష్మీనారాయణ

మానసిక ప్రశాంతతకు ప్రశాంతమయ జీవన మాధుర్యం పెంపొందించుకొనడానికి దోహదంచేసే మార్గం సంస్కృత భాష!

సంస్కృతభాషా గరిమ అద్వితీయమైనది. సంస్కృత భాషలోని ప్రతిపదం ఒక మంత్రం. సంస్కృత భాషను మాట్లాడడం వల్ల ఉద్భవించే ధ్వనితరంగాలు ప్రతిభావంత మైనవి. ఈ ధ్వనులు ప్రశాంతభావాన్ని కల్గిస్తాయి. సంస్కృత భాష ధ్వనిసౌందర్యం, నిర్దిష్ట ఉచ్చారణరీతి, స్వరూప సమగ్రత, ప్రసార పరిపూర్ణత మిగిలిన అన్ని భాషలలోకంటె మిన్న అయినవి.

అందువల్లనే సంస్కృతభాషా మౌలికతత్త్వం మార లేదు. మానవజాతికి లభించిన ఈ నిర్దుష్టభాషా స్వరూప, స్వభావాలను మార్చవలసిన అవసరం ఏర్పడలేదు. సమస్త భాషలకు తల్లి అయిన సంస్కృత భాషను చక్కగా నేర్చుకొనడం వల్ల మాట్లాడడంవల్ల మిగిలిన భాషలను నేర్చుకొనడం, మాట్లాడడం సులభతరం అవుతోంది. వక్తృత్వకళ నాయకత్వ లక్షణం. ఉచ్చారణను వృక్తృత్వాన్ని పెంపొందించడానికి ఉచ్చారణ దోషాలను తొలగించుకోవడానికి సంస్కృతభాష ఔషధం వంటిదని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు.

గణితశాస్త్ర, భౌతికశాస్త్రాల అధ్యయనం కూడా సంస్కృత భాషా పరిజ్ఞానంవల్ల మరింత సులభం అవుతున్నది. సంస్కృత భాష వల్ల అవధానశక్తి, ఒక అంశం పై ధ్యాసను కేంద్రీకరించడం కూడా పెరుగుతుంది. సంస్కృత అధ్యయనం వల్ల సృజనాత్మకత, ధారణ జ్ఞాపకశక్తి కూడా మెరుగుపడతాయి. సంస్కృతం నేర్చుకునే శిశువులు తమ భావాలను చక్కగా సమగ్రంగా వ్యక్తీకరించగలరు. విశ్వజనీన సమన్వయాత్మక, సాధారణసత్యాలను శిశువులనోట పలుకుతారు. పిల్లలకు సంస్కృతం నేర్పడం తల్లిదండ్రుల సహజ కర్తవ్యం. మానవీయ, ఏకాత్మభావ, సమైక్య సమాజనిరంతర వికాసానికి ఈ కర్తవ్య నిర్వహణ దోహదం చేస్తుంది. విజ్ఞాన భూమికలో వేళ్ళూని, వికసించిన సంస్కృత భాషవల్లనే సమన్వయం పరిమళించ గలదు.

వేలాది ఏళ్లు గడిచినప్పటికీ సంస్కృత భాష జవసత్వా లను ప్రసాదించగలుగుతోందని, అలజడి జడిలో అలమటిస్తూనే ప్రపంచానికి ప్రశాంతిని ప్రసాదించగల వ్యక్తీకరణ మాధ్యమం.

## వేదమంత్ర మాధ్యమం

ధ్వని ప్రకంపనల ప్రభావాన్ని శాస్త్ర ప్రపంచం గుర్తిం చింది. ఈ ప్రకంపనాల విస్తృతి అణువణువులోని శక్తిని ప్రచోదనం చేయగలదు. విశ్వవ్యవస్థను ప్రభావితం చేయగలదు. నిర్దిష్ట స్వరాలు నిహితమై ఉన్న సంస్కృత భాషా ఉచ్చారణవల్ల సమన్వయాత్మకమైన ధ్వనితరంగాలు విస్తరిస్తున్నాయి. ఆధునిక విజ్ఞానశాస్త్ర పద్ధతుల ద్వారా సంస్కృత భాషలోని యజ్ఞసంబంధ మంత్రాల ధ్వని ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి అవకాశం ఏర్పడి ఉంది. సంబంధించిన మంత్రాల 'విశ్వశక్తి కేంద్రం' నుండి వెలువడుతున్న జీవపోషక ధాతుప్రసరణ 'ధ్వని తరంగాలు' లేదా 'నాదాలు' నిబిడీ కృతం అయిన విధంగా ఆయా మంత్రాలు రూపొంది ఉన్నాయి. ఉదాహరణకు గాయత్రీమంత్ర సంబంధిత విశ్వశక్తి కేంద్రం 'సూర్య మండలం'. ఈ మంత్రాల ఉచ్చారణ వల్ల జనిస్తున్న ప్రకంపన తరంగాలు మానవబుద్ధికి, మొక్కలకు, జంతువులకు ఉపశమన ప్రశాంతతని కలిగిస్తున్నాయి. పరిసరాల పర్యావరణంలో నిర్దిష్ట శక్తి తరంగా లను నింపుతున్నాయి.


ఇలా యజ్ఞ నిర్వహణలో నిర్దిష్ట పద్ధతిలోను, నియ మాలకు అనుగుణంగాను మంత్రాలను గానం చేస్తున్నాము. ఈ మంత్రోచ్చారణ సంబంధిత వ్యక్తులకు లాభం చేకూర్చడమే కాక మితకరమైన తరంగాలను ప్రచోదనం చేస్తోంది. పరిసరాలకు పరిపుష్టిని కలిగిస్తోంది. దీనివల్ల యజ్ఞంలో వినియోగించే పదార్థాలలో నిహితమై ఉన్న శక్తి బహుముఖంగా విస్తరిస్తోంది! మంత్ర పవిత్రమైన హోమద్రవ్యాల ప్రభావం ఔషధాల కంటే ప్రబలంగా పనిచేస్తోంది.

మంత్ర ఉచ్చారణ లేకుండా 'హవిస్సుల'ను- హోమ ద్రవ్యాలను అగ్నికి సమర్పించడంవల్ల కేవలం సుగంధం వ్యాపి

స్తుంది, పరిమిత ప్రయోజనం మాత్రమే కలుగుతోంది. మంత్రోచ్చారణ ద్వారా పవిత్రవంతమవుతున్న హోమద్రవ్యాలను యజ్ఞజ్వాలలో సమర్పించడంవల్ల మాత్రమే సమగ్రప్రభావం ప్రస్ఫుటిస్తోంది, సంపూర్ణ ప్రయోజనం సిద్ధిస్తోంది.

యజ్ఞ సమయంలో సామూహికంగా 'మంత్రాన్ని' ఉచ్చరించడం వల్ల ధ్వని తరంగశక్తి ప్రభావం మరింతగా విస్తరిస్తుంది. ధ్వని తరంగాలు పలుచటి 'జ్వాలాపటలం' (ఫ్లేమ్ స్క్రీన్‌తో) సంగమించడం వల్ల ప్రకంపనాలు ఉధృతంగా విస్తరించడం ఈ శక్తి ప్రభావం పెరగడానికి ఒక ప్రధాన కారణం. ధ్వని తరంగాల సంఖ్య పెరిగి అవి మంత్రసంబంధ 'విశ్వశక్తి కేంద్రం' నుండి ప్రసరణమయ్యే శక్తి తరంగాలతో సంలీనం చెందడం ప్రభావ విస్తృతికి మరో కారణం. హోమద్రవ్యధూమం పరిసరకాలుష్య వాయువులను పరిశుభ్రం చేయగలగడం మరోకారణం యజ్ఞ నిర్వహణ జీవ, బౌద్ధిక, శారీరక శక్తుల సమిష్టి ఉన్మీలన ప్రభావం ఇలా ధ్వనితరంగశక్తి ప్రబలంగా విస్తరించడానికి ఇంకొక కారణం!

హవిస్సుల- హోమద్రవ్యాల ప్రచోదన కారణంగా మంత్ర ధ్వనితరంగాలు వృత్తాకారంలో అడ్డంగాకాక, ఊర్ధ్వముఖ శృంఖల (నిలువుగా ఏర్పడే గొలుసు) రూపంలో పై పైకి విస్తరిస్తాయి. దీనివల్ల అంతరిక్షక్షాళన కూడా జరుగుతుంది! ప్రశాంతత విశ్వానికి విస్తరిస్తుంది. 'చిత్తవృత్తికి' తేజాన్ని ఇస్తుంది.



# సద్వాణి సూక్తి

– శ్రీ మాదిరాజు రంగారావు

**"కిం చన్దనైః స కర్పూరైస్తుహినైః క్వ శీతలైః**
**సర్వేతే మిత్ర మాత్రస్య కలాం నార్హన్తి షోడశీమ్"**

ఈ సూక్తి మిత్ర రూపాన్ని గురించి చెబుతుంది. దాని విశిష్టతను కవితామయంగా చిత్రించింది. చందనం, కర్పూరం, తుషారం వీటితో ఏర్పడిన చల్లటి పై పూతల ప్రయోజనమే ముంది? వీటి ప్రభావం తాత్కాలికం. ఇవి శారీరక లాభ మాత్రమైనవి, భౌతిక స్థాయిలో పనిచేసేవి. ఈ ద్రవ్యాలు కొంత సేపు అలరిస్తాయి. ఉల్లాసాన్ని కలిగిస్తాయి. ఇది ఒక విధమైన అనుభవ కళ కలిగివున్న మాట వాస్తవమే. కానీ అన్నీ కలిసి కూడా "మిత్రము" అన్న పదునారు కళలతో కూడిన పూర్ణమైన బింబంలోని, ఒక్క కళతో కూడా సరితూగవు, సాటిరావు. ఎందువల్ల నంటే మిత్రభావన మానసిక స్థాయిలో పనిచేస్తుంది. సూక్ష్మమైన అనుభవ శక్తిని కలిగి ఉంది. కళాపూర్ణమైన రూపాన్ని తలపిస్తుంది. హృదయానికి ఆహ్లాదాన్నీ, ఉపశమనాన్ని కలిగిస్తుంది.

**"కేనామృత మిదం సృష్టం మిత్ర మిత్యక్షర ద్వయం**
**ఆపదాం చ పరిత్రాణాం శోక సంతాప భేషజమ్"**

మిత్రమన్న రెండు అక్షరాల శబ్దం అమృతమయం. ఎవరి చేత సృజించబడిందో? అతని ప్రతిభకు నిదర్శనంగా, చిరంజీవ భావన కలిగి ఉంది. శాశ్వతమైన విలువలతో వెలుగును నింపుతుంది. దీనికిదే సాటి. ఇది ఆపదలను, దుఃఖాన్ని, సంతాపాన్ని పోగొట్టి ఔషధంలా పని చేస్తుంది.

మానసికంగా అవసరానికి సంతోషాన్ని కలిగించే చికిత్సా సాధనమయింది. సహాయపడుతూ, మనసుకు ధైర్యాన్ని ఇస్తూ, తోడుగా జీవితగమనాన్ని సుగమం చేస్తుంది.

వ్యక్తిలో తనకు తానుగా అనుభవించే ప్రేమ, స్నేహం, వాత్సల్యం మొదలైన కోమలమైన, ఆర్ద్రమైన, సున్నితమైన, గుణాలు స్పర్శామాత్రం చేత గొప్ప ప్రభావాన్ని నెరపుతాయి. మిత్ర హృదయం అనుభవం చేత మాత్రమే తెలియదగింది. ఇది మనిషి వ్యక్తిత్వాన్ని, సుందరంగా, సమున్నతంగా తీర్చి దిద్దుతుంది. ఉపశమన గుణంతో సుస్థితిని కలిగిస్తుంది. ఈ మనస్తత్వ శాస్త్ర విషయం జగమెరిగిన వాస్తవం. సన్మిత్ర రూపాన్ని పొందడం, పొందిన దాన్ని కాపాడుకోవడం, మంచి ఫలితాన్ని అనుభవించడం – ఒక అదృష్ట విశేషం.

*(గత సంచిక తరువాయి....)*

వేంగడత్తుఱై వాన్ (ఉత్సవమూర్తి) తన యవతారదిన వైభవముచే దివ్యనగరాభివృద్ధికి అనుకూలురు కారు అను ఐతిహ్యము ఆ స్థలమున ప్రసిద్ధమై యుండుటచేత, ఇక, నగరాభివృద్ధికై శ్రీవేంకటాచలపతి(మూలవిరాట్టు) కనకలతా యోగమున అవతరించినను, సన్నిధియందు దివ్యైశ్వర్యము ఉత్తరోత్తరాభివృద్ధి చెందుటకై అప్పుడు ఉత్సవమూర్తిగా ఆరాధన లందుకొనుచున్న వేంగడత్తుఱై వానును కౌతుకమూర్తిగను, కౌతుకమూర్తియగు 'మలై కునియ నిన్ఱ పెరుమాళు'ను (విగ్రహమును) ఉత్సవమూర్తి గను ఆరాధనము పొందునట్లుగ యంత్రోద్ధరణ పూర్వకముగ ఆవాహనము చేసి ఆరాధన లందుకొనునట్లును చేయ సంకల్పించినారు.

బింబాధరుని (శెంగనివాయన్) వంశమున పుట్టిన పరమభాగవతుల శ్రీహస్తముతోడనే శ్రీవేంకటేశ్వరుడు నిత్యారాధన మందుకొనునట్లును-

**"గోక్షీరైర్హేమకుంభస్థై ర్వల్మీకవివరోదరమ్,**
**అనుస్యూతాచ్ఛిన్నధారై రభిషేకం ప్రచక్రమే.**


**క్రియమాణాభిషేకేణ వల్మీకవివరాంతరాత్,**
**ఆవిర్భభూవ భగవాన్ వరాహవపురీశ్వరః."**

(బంగారు కలశములందలి యావుపాలచే అవిచ్ఛిన్న ధారలతోడ పుట్టరంధ్రము లోభాగమును అభిషేకించు టారంభమాయెను. అట్లు చేసెడి యభిషేకముచేత పుట్టరంధ్రము లోపలి నుంచి వరాహరూపియును సర్వనియంతయు నగు భగవాను డావిర్భవించెను.)

అనునట్లుగ భూగోళవరాహ (పురాణ)ము ఆరవయధ్యాయమునందును వరాహపద్మపురాణములందును ప్రసిద్ధమై స్వయంవ్యక్తముగా ఆవిర్భవించిన జ్ఞానమూర్తి (వరాహస్వామి) వేంకటాధీశ్వరునకు పూర్వపుకల్పము నందే దివ్యావతారము గైకొని యున్నందునను,

**"రథ్యాబల్యంతరే దేవం బలిహోమవివర్జితమ్,**
**ఆరాధయే దప్రధానం న కుర్యా దుత్సవాదికమ్."**

(వీధి- బలిస్థానములకు మధ్యనున్నట్టి దేవుని బలి హోమములు లేకుండ అప్రధానముగనే ఆరాధింపవలెను. ఉత్సవాదులు చేయరాదు.)




అని వైఖానసశాస్త్రమున ఆనందసంహితయం దుండుటచేత ఒక క్షేత్రమున రెండు విగ్రహములకు సమప్రాధాన్యముతోడపూజామహోత్సవాదులు నిషిద్ధమని జ్ఞానమూర్తికి బలిపీఠార్చన నిత్యమహోత్సవాదులు ఏవియు లేకుండ,

**"మత్స్థాపితవరాహస్య పూర్వం స్యా త్పూజనం హరే,**
**దర్శనం స్నానదానాద్యై రిత్యుక్తోయం శ్రియఃపతిః**
**తథాஉస్త్వితి వరం దత్వా కారయామాస తత్తథాః."**

(హరీ, నాచే స్థాపింపబడిన వరాహస్వామికి స్నానదానాదులతోడ పూజనము దర్శనము ముందుగా జరుగవలెను- అని బ్రహ్మ చెప్పగా శ్రియఃపతి అట్లే యగుగాక యని వరమిచ్చి యని యట్లే చేయించెను.)

అని బ్రహ్మపురాణమునందు అష్టమాధ్యాయమునం దున్నట్లే శ్రీవేంకటాచలపతికంటె ముందుగ త్రిసంధ్యలందును జ్ఞానవరాహస్వామికి ఆరాధనయు నివేదనము జరుగునట్లును అచ్చోటను ఉత్సవమూర్తిని కూడ ప్రతిష్ఠింపజేసి ఆరాధన చేయు నట్లును జరిపించెను. అధ్యయనోత్సవము మాత్రము ఒకే దినమున జరిపింపవలెను.

"శ్రీవేంకటవరాహాయ స్వామిపుష్కరిణీతటే,
శ్రవణే తులామాసే ప్రాదుర్భూతాత్మనే నమః."

(స్వామిపుష్కరిణీ తీరమున తులామాసము శ్రవణ నక్షత్రమున ఆవిర్భూతస్వరూపుడగు శ్రీవేంకటవరాహునకు నమస్కారము.)

అనినట్లుగ ఆయన జన్మనక్షత్రమగు తులామాసమందలి శ్రవణనక్షత్రమందు శ్రీవరాహజయంతియు విశేషోత్సవముగా కొండాడవలెను"

"నిత్యం బిలేన చాగత్య దేవం నత్వా నృపోత్తమః,
రాజ్యం చకార ధర్మేణ భుంజానో భోగముత్తమమ్."

(ఆ రాజశేఖరుడు ప్రతిదినము బిలమార్గమున వచ్చి దేవునకు మొక్కి ఉత్తమభోగము లనుభవించుచు ధర్మముగ రాజ్యముచేసెను.)

అని భూగోళవరాహమున పదవ యధ్యాయమందు చెప్పిన చొప్పున తొండమాన్ చక్రవర్తి కలియుగారంభమున శ్రీవేంకటేశ్వరుని పాదారవిందములపై పరిపూర్ణభక్తి గలవాడై భగవదనుగ్రహముచే రాజ్యమును ధర్మమార్గమున పరిపాలించుచు, సకలభోగముల ననుభవించుచు, ప్రతిదినమున తన రాజభవనమునకు తిరుమలకును రాకపోకలకైన ఒక బిల మార్గమును స్వామి చూపగ అందుచొచ్చి స్వామి సన్నిధికి పోయి సేవించి వచ్చుచుండెను. ఇట్లుండగా–

> **మాటలు వచ్చేది**
> **నాలుక చివరనుంచి.**
> **అందువలన**
> **మన మాట**
> **తీరువల్లనే**
> **సంపదలు వస్తాయి.**

"స్థితే కదాచిత్తితిపే శ్రీనివాసస్య సన్నిధౌ,
శత్రవశ్య బలోద్రిక్తా రురుధుస్తస్యవై పురీమ్."

(ఆ ప్రభువు శ్రీనివాసుని సన్నిధిలో నుండగా, ఒకానొకప్పుడు బలదర్పితులగు శత్రువులు అతని పట్టణమును ముట్టడించిరి.)

అని బ్రహ్మపురాణము వర్ణించిన విధముగా సామంత రాజు లితనిని జయింపవచ్చి పట్టణము ముట్టడించిరి. అప్పుడు చక్రవర్తియు వారిని తరుముతూపోయి పోరుసలుపుచుండ పరస్పరయుద్ధము నడచుచుండెను. చక్రవర్తి బలము క్షీణింపగ పరాజితుడై స్వదేశమునకు పరుగిడి వచ్చి శ్రీనివాసుని చరణారవిందములపై భక్తితోడ

"శ్రీనృసింహం నమస్కృత్య పునః ప్రాప్య బిలోత్తమమ్,
శ్రీనివాసం యయే ద్రష్టుం శ్రీభూమిసహితం నృపః.
తం దృష్ట్వా సహసాయాంతం జుగూహతే ధరారమే,
ప్రణమంత మహోచత్తంకి మకాలే నృపాగతః"

(రాజు శ్రీనరసింహునికి ప్రణమిల్లి మరల బయలుదేరి శ్రీభూదేవులతో కలసియున్న శ్రీనివాసుని చూడ నరిగెను. హఠాత్తుగ వచ్చుచున్న ఆతనిని చూచి శ్రీదేవి భూదేవులు దాగుకొనిరి, (స్వామి) ఓయీ నృపా, అకాలమున వచ్చితివేల?– అని నమస్కరించుచున్న అతనితో ననెను.)

అని భూగోళవరాహమున దశమాధ్యాయమున నున్న తీరుగ బిలద్వారమున ప్రవేశించి అకాలమున వచ్చి నిలువగ, అప్పుడు ఏకాంతసన్నివేశమున సేవించుచున్న శ్రీభూదేవు లిరువురును అదృశ్యులైరి. అంతఃపురమునకు పరమపురుషుడు వచ్చినాడని సంకోచించి శ్రీదేవి తనకు నిత్యనివాసస్థానమైన శ్రీనివాసుని దివ్యవక్షఃస్థల మధిష్ఠించినది. భూదేవి బయలు వెడలి పూర్వకాలము రంగదాసుడు శ్రీనందవన కైంకర్యార్థమై త్రవ్విన, సమీపముననున్న బావిలో దుమికినది.

ఈ కథ ఆ స్థలమున పండితపావనసాధారణము, సర్వసంప్రతి సంపన్నమునై యున్నందున ఆ భూదేవిని అర్చా (విగ్రహ) రూపముగ ప్రతిష్ఠ చేయించి దేవికి సమీపమున ఒక 'తీర్థనయినార్' అను శ్రీనివాసునికూడ ప్రతిష్ఠించి ఆ బావిలో వారి నిరువురిని జంటగా విజయము చేయించి వారికి ప్రతి దినము ప్రసాదము ఆరగింపుచేయునట్లేర్పరచిరి.

*(ఇంకా ఉంది)*

# వ్యాసపూర్ణిమ

- డా॥ కె. అన్నపూర్ణ

వ్యాసం వసిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమ కల్మషం।
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిం॥

ప్రతి ద్వాపరంలోను ఆర్షవిద్యలు ఒక్కొక్కరి చేత విస్తరింపబడుతూ వుంటాయి. వేదాలను ప్రసరింపజేసిన ముని వేదవ్యాసుడవుతాడు. నారాయణుడు, బ్రహ్మ ముఖకమలం నుండి పుట్టిన వేదాలను ప్రసరింపజేయమని అపాంతరతముడనే మానసపుత్రుణ్ణి కోరుతాడు. అతడావిధంగా చేయడంతో సంతోషించి, ఈ విధంగానే అన్ని మన్వంతరాలలోనూ చేయమని చెప్పి, రాబోయే కాలంలో వశిష్ఠుని పౌత్రుడైన పరాశరునికి కుమారునిగా జన్మించమని చెబుతాడు. ఆ ప్రకారంగానే వ్యాసుడు జన్మిస్తాడు. వ్యాసుని అసలు పేరు 'కృష్ణ ద్వైపాయనుడు'.


నది రెండుభాగాలైన చోట ఇతడు ఉండడంవల్ల ఇతనికి ఆ పేరు కలిగింది. ఇతడు యమునానదిలో నావ దాటించే సత్యవతియందు పరాశరునికి కలిగిన కుమారుడు. కృష్ణ ద్వైపాయనుడు పుట్టగానే కపిలజటలతోను, దండ కమండ లాలలోను ఒప్పారుతూ తల్లి ముందు నిలిచి 'నీకు అవసరమైనప్పుడల్లా నన్ను తలచుకో, నేను వస్తానని' చెప్పి వనాలకువెళ్లి తపస్సు చేసుకోసాగాడు. సత్యవతికుమారులైన చిత్రాంగదుడు విచిత్రవీర్యుడు పుత్రసంతానం లేకుండానే మరణించడంవల్ల శంతనునివంశాన్ని నిలబెట్టడం కోసం విచిత్రవీర్యుని భార్యలైన అంబిక అంబాలికలయందు పుత్రులను పొందడానికై సత్యవతి కృష్ణద్వైపాయనుణ్ణి స్మరించింది.

ఇతనివలననే అంబిక అంబాలికలయందు ధృతరాష్ట్ర పాండురాజులు జన్మించారు. అప్పటినుండి కృష్ణద్వైపాయనుడు వీరి మంచిచెడ్డలను తెలుసుకుంటూ ఉండేవాడు. గాంధారి గర్భవతయ్యేలా వరమిచ్చాడు. ఆమె ఒక సంవత్సరం గర్భం ధరించి గర్భతాడనం చేసుకోగా ఇతడు వెళ్ళి బయటపడిన మాంసపుముద్దను నూరుతునకలు చేయించి నూరుగురు పుత్రులు, ఒక పుత్రిక కలుగుతారని చెప్పి వారిని రక్షించే మార్గాన్ని తెలిపాడు. కృష్ణద్వైపాయనుడు అవసరం వచ్చినపుడల్లా ధృతరాష్ట్రుని దగ్గరకు, ధర్మరాజు దగ్గరకు వచ్చి హితాన్ని బోధిస్తూ ఉండేవారు. ద్రుపదుడు ద్రౌపదిని పాండవులకిచ్చి వివాహం చేయడానికి సంశయిస్తుండగా ద్రుపదునికి పంచేంద్రోపాఖ్యానాన్ని చెప్పి పాండవులైదుగురు ఒకటేనని చెప్పాడు.

పాండవులతో మైత్రిచేయడం యుక్తమని దుర్యోధనునికి నచ్చచెప్పమని ధృతరాష్ట్రునికి చెప్పాడు. ధృతరాష్ట్రుని కోసమై సంజయునికి రహస్య భాషణాన్ని వినడం నేర్పాడు. యుద్ధ భూమిలో ఎవ్వరికీ గోచరించకుండా సంచరింపగలిగే శక్తి నిచ్చారు. అభిమన్యుని మరణానికి ధర్మరాజు విలపిస్తూండగా వ్యాసుడు వచ్చి ఇతిహాసాలుచెప్పి ఊరడించాడు. వనవాస సమయంలో పాండవులకు అభయమిచ్చాడు. ధర్మరాజుకు ప్రతి స్మృతి అనే విద్యనుపదేశించాడు. ధర్మాధర్మాలు తెలిపాడు. మరణించిన బంధుమిత్రుల కోసం విలపిస్తున్న గాంధారి ధృతరాష్ట్రులకు తన దివ్యశక్తి చేత వారికి కావలసిన విధంగా గతించినవారిని చూపించాడు. ధృతరాష్ట్రుడు తపోవనానికి వెళ్ళటానికి అనతి నిచ్చాడు. ధర్మరాజు పట్టాభిషిక్తుడైన తరువాత అతని చేత రాజ సూయాన్ని చేయించాడు. వేదాల నంచిత న్యాసమొనరించాడు. అందువల్ల ఇతనికి వేదవ్యాసుడనే పేరు వచ్చింది.

ఇంతకు పూర్వం వేదాలు ఏకీభూతమై ఉన్నప్పుడు ఇతని శిష్యులైన పైలుడు, వైశంపాయనుడు, సుమంతుడు, జైమినుల చేత సూత్రాలను వేర్పరిచాడు. జనమేజయునికి భారతకథను తెలపడానికి వైశంపాయనుణ్ణి పంపించాడు. వ్యాసుడు అరణిని మథిస్తుండగా ఘృతాచి వస్తుంది. ఇతడు శపిస్తాడేమోనని భయపడి ఆమె శుకరూపాన్ని దాల్చింది. ఇతడు ఆ శుకాన్ని చూస్తాడు. అపుడు అరణి నుండి పుట్టిన పుత్రుడు శుకుడు. శుకమహర్షికి వ్యాసమహర్షి బ్రహ్మవిద్యను, వేదశాస్త్రాలను నేర్పారు.

సకల ధర్మాలను చెప్పినా, భారతాన్ని రచించినా, వేద విభజనను చేసినా ఇంకా అతని మనస్సుకు శాంతి లేకపోవడం చేత తన ఆశ్రమంలోనే వ్యాకులచిత్తుడై ఉన్నాడు. అపుడు నారదుడు వెళ్లి అతని శాంతిలేమికి కారణాన్ని కనుగొని శ్రీవిష్ణుకథలు తెలపకపోవడం వల్ల కలిగినదని చెప్పారు. అపుడు వ్యాసుడు భాగవతాన్ని రచించి శుక్రునిచేత పఠింపజేశాడు. అనితర సాధ్యమైన రీతిలో ఇన్ని మహత్కార్యాలను సాధించిన వేదవ్యాసుడు **"వ్యాసాయ విష్ణు రూపాయ, వ్యాసరూపాయ విష్ణవే"** అని స్తుతించబడ్డాడు. ఆషాడ పౌర్ణమి గురుపౌర్ణమిగాను, వ్యాస పౌర్ణమిగాను ప్రసిద్ధికెక్కింది.



# చాతుర్మాస్యవ్రతం

- ఆచార్య నేతి అనంతరామశాస్త్రి

నాలుగు ఆశ్రమాలకు అనుగుణంగా చతుర్విధ పురుషార్థాలైన ధర్మ, అర్థ, కామ, మోక్షాలు కల్పింపబడ్డాయి. ఇందులో 'ధర్మపురుషార్థం' మొదటిది. ధర్మం ద్వారానే కామ పురుషార్థాలను సంపాదించాలి. గృహస్థాశ్రమం ఇటు బ్రహ్మ చర్యాన్ని ఆచరించేవారికి, వానప్రస్థ, సన్యాసులకు ఆధారభూత మైన ఆశ్రమంగా ప్రస్తుతించబడింది. వైవిధ్యం ఉన్నప్పటికీ సర్వాశ్రమ వాసులకు ధర్మవిధి విహిత. **'చాతుర్మాస్యం'** వ్రతం అంటే నాలుగు నెలలు ఆచరించాల్సిన వ్రతం.

**'చాతుర్మాస్యవ్రతాన్ని'** ఆషాఢశుద్ధఏకాదశి (తొలిఏకాదశి) నాడు ప్రారంభించి కార్తికశుద్ధ ఏకాదశి వరకూ ఆచరిస్తారు.

ఆషాఢశుద్ధ ఏకాదశిని **'శయనైకాదశి'** అంటారు. అట్లాగే కార్తికశుద్ధ ఏకాదశిని **'ఉత్థాన ఏకాదశి'** అంటారు. అంటే వర్షఋతువు మొదలుకొని శరదృతువు వరకూ గల నాలుగు నెలలు శ్రీమన్నారాయణుడు శేషశయనంపై పవళించి, యోగ నిద్రలో ఉండి, ఉత్థాన ఏకాదశినాడు ఆ నిద్రనుండి మేల్కొంటాడు. కాబట్టి ఈ నాలుగు నెలలకాలం నియమనిష్ఠ లతో గడపాలని ధర్మశాస్త్రాలు చెప్తున్నాయి. అంతేకాదు ఈ 'చాతుర్మాస్య వ్రతాన్ని' దీక్షానియమాలతో మహర్షులు, అవధూతలు, పీఠాధిపతులు, సాధువులు ఆచరిస్తున్నట్లు పురాణాలు చెప్తున్నాయి.

ముఖ్యంగా ఈ రోజుల్లో ఎక్కువగా ఈ వ్రతాన్ని యతీశ్వరులు మాత్రమే ఆచరిస్తున్నట్లు తెలుస్తున్నది. కానీ ఈ వ్రతాన్ని యతీశ్వరులు మాత్రమే ఆచరించాలని ఏ ధర్మ శాస్త్రంలోనూ చెప్పలేదు. దీన్ని బట్టి ఈ వ్రతాన్ని సర్వఆశ్రమాల వారాచరింప వచ్చని స్పష్టమౌతున్నది.

**ఆషాఢేతు సితేపక్షే ఏకాదశ్యా ముపోషితః।**
**చాతుర్మాస్య వ్రతం కుర్యా దృత్కించిన్ని యశోనరః॥**

ఇక్కడ 'యత్కించిన్ని యశోనరః' అనడం చేత సర్వా శ్రమాల వారు ఈ వ్రతాన్ని ఆచరించవచ్చు. ఆయా నియ మాలను పాటించటానికి సామర్థ్యం కలవారంతా ఈ చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించయోగ్యులు అని అర్థం.

వర్షాకాలం సన్యాసాశ్రమాన్ని స్వీకరించినవారికి గడ్డు కాలం. ఓషధీప్రస్థానంలో ప్రకృతి నిండుచూలాలైన కాలం. నిత్యం సంచారం చేసే ప్రవృత్తి ఉన్న యతీశ్వరులు, సాధువులు ఈ నాలుగు నెలల కాలంలో తమ పర్యటనలను నిలిపివేసుకొని ఒకచోటనే ఉండి భగవదారాధనాది విశేషకార్యక్రమాలను ఆచరి స్తారు. గ్రామైక రాత్రంగా తరుతలవాసం, కరతల భిక్షచేసే యతీంద్రులు ఈ చాతుర్మాస్య వ్రతదీక్షతో నిలకడగా నిలచి భక్తియుక్తులు సంపాదించాల్సిన దివ్యకాలం.

ఈ వ్రతాన్ని ఆషాఢశుద్ధ ఏకాదశి నాడుగానీ, ద్వాదశినాడు గానీ, పౌర్ణమినాడుగానీ ప్రారంభించవచ్చని శాస్త్రం చెప్తున్నది.

**తే నాషాఢ శుక్లైకా దశ్యాం ద్వాదశ్యాం పౌర్ణమాస్యాం వో**
**ఆరమ్భః ప్రతివర్షం చ యః కుర్యాదేవం వై సంస్మరన్ హరీమ్**

ఈ వ్రతాన్ని ఆచరించేవారు బ్రహ్మచర్యాన్ని పాటించాలి. భిక్షాటన చేస్తూ, ఆహారనియమాన్ని పాటిస్తూ, నియమిత కాలంలో భగవదారాధనాన్ని చేయాలి. నిత్య నైమిత్తిక కర్మలను ఆచరిస్తూ స్వాధ్యాయాధ్యయనం చేస్తూ అపరిగ్రహం (ఎవరివద్దా ఏమీ తీసుకోక పోవటం) చేయాలి.

ఈ వ్రతం నిత్యమైంది. ఒకసారి ప్రారంభించిన తరువాత మధ్యలో దీనిని విడిచి పెట్టకూడదు. కార్తిక ద్వాదశినాడు వ్రతోత్సర్జన చేయాలి. ఈ వ్రతాన్ని చేపట్టినవారు ఆ రోజు పొలిమేర దాటి వెళ్లి అక్కడ భగవదారాధన చేసి, ఆ రోజు అక్కడే నిద్రించి మరుసటి రోజు తిరిగి గ్రామానికి రావాలి. ఆషాఢ పూర్ణిమనాడు యతీశ్వరులందరూ ఈ వ్రతాన్ని ఆరంభిస్తారు. ఆ రోజు వ్యాసమహాముని పుట్టినరోజు అవడంతో ఆషాఢ పూర్ణిమనే 'వ్యాసపూర్ణిమ' అని కూడా పిలుస్తారు. ఇంకా 'గురుపూర్ణిమ' అని కూడా పిలుస్తారు. ఈ రోజున ఆదిగురువైన వ్యాసుణ్ణి పూజించటం సనాతనంగా వస్తున్న సంప్రదాయం. నిర్వ్యాజమైన ప్రేమను అందించే మహానుభావుడు వేద వ్యాసుడు. అతడు సాక్షాత్ శ్రీమన్నారాయణుడు కాక మరొక సామాన్యవ్యక్తి అవటానికి అవకాశం లేదు. కాబట్టే ఆషాఢ పూర్ణిమనాడు వ్రతం ఆరంభిస్తారు. అంతేకాదు శ్రీమహావిష్ణువే వ్యాసావతారం ఎత్తాడు.

ఈ చాతుర్మాస్యదీక్ష తీసుకున్న వారు ఈ వ్రతాన్ని ఏ విధంగా ఆచరిస్తారో పరిశీలిద్దాం.

వ్రతం చేయదలచుకున్న రోజున శుచియైన పిమ్మట సర్వతోభద్రమంటపంపై బియ్యం పోసి ఉంచాలి. తరువాత శాస్త్రంలో చెప్పబడ్డట్లు దిక్పతులను ఆరాధించాలి. పిమ్మట విష్ణుమూర్తిని, తదంగ దేవతలనందరినీ పూజిస్తూ, వ్యాసుడు వారి శిష్యపరంపరను, ఆదిశంకరులను వారి గురుశిష్య పరంపరను పూజ చేయాలి. చివరకు షోడోపచార పూజ గావించి, ఇంకా భూతపూజ, భూపూజలను చేసి చేతులు జోడించి నమస్కరిస్తూ....

"స్వామీ! నేను ఈ వ్రతాన్ని నియమంగా నాలుగు మాసాలు చేస్తాను. పరమపవిత్రమైన ఈ చాతుర్మాస్య వ్రతాన్ని నిర్విఘ్నంగా జరిపించు. నీ అనుగ్రహం చేత ఈ నాలుగు మాసాలు నేను చేసే వ్రతానికి సిద్ధి కలిగేట్లు చేయమని" ప్రార్థించాలి.

ప్రతిమానవుడు గురుఋణాన్నీ, దేవఋణాన్నీ, పితృఋణాన్నీ తీర్చుకోవలసిన బాధ్యత ఉంది. చాతుర్మాస్యవ్రత విధానం ద్వారా దేవఋణాన్ని తీర్చుకోవడానికి అవకాశం కలుగుతుంది.

ఈ వ్రతమాహాత్మ్యాన్ని లేక ప్రాశస్త్యాన్ని గురించి వరాహపురాణంలోనూ, స్కాందపురాణంలోనూ, పద్మపురాణంలోనూ చెప్పటం జరిగింది.

## వరాహపురాణంలో చాతుర్మాస్య మాహాత్మ్యం

విష్ణువు మత్స్యావతారాన్నెత్తి హిరణ్యాక్షుని సంహరించి ధరణికి విముక్తి కలిగించిన తరువాత భూదేవి "స్వామీ! ప్రతి కల్పంలోనూ నన్నీవిధంగా ఉద్ధరిస్తుంటావు. సంవత్సరంలో వచ్చే పన్నెండునెలల్లో నీకు ఇష్టమైన నెలలు ఏవి? ఆ నెలల్లో చేసే ఏ ధర్మకర్మలు నీకు ప్రీతిదాయకాలుగా ఉంటాయి" అని భూదేవి అడిగింది.

*అస్తి ప్రియతమః కాలః చాతుర్మాస్యాభిధో మమ। ఆషాఢ దశమి శుక్ల మారభ్య స్యాత్తు కార్తికే॥ 'పౌర్ణమాసి తావదిదం చాతుర్మాస్య వ్రతాదికం'* – అని విష్ణువు చెప్పాడు.

అంటే ఆషాఢ శుద్ధ దశమి మొదలు కార్తిక శుద్ధ పౌర్ణమివరకు చాతుర్మాస్యమనీ, ఆ రోజుల్లో చేసే దానాలు, వ్రతాలు, జపహోమాదులు అనంతములైన ఫలాల్ని ఇస్తాయి. వాటిని వివరించమని భూదేవి వరాహమూర్తిని ప్రార్థించింది.

## స్కాందపురాణంలో చాతుర్మాస్యవ్రత ప్రాశస్త్యం

*'ఆషాఢస్యతు మాసస్య సూర్యే కర్కట గీతథా ఏకాదశ్యాం సితే పక్షే దేవానాం రాత్రి రిష్యతే। తన్మధ్యగో మహావిష్ణుః ఉపేంద్ర ఇతి సంజ్ఞితం అవస్థాత్రయ మాదాయ మహామూర్తి భిరవ్యయః సమస్యర్విఋస్తుద్ధైత్యో యోగ నిద్ర ముపేయవాన్'*

**తల్లి-తండ్రి-ఆచార్యులనే**
**ఈ ముగ్గురు ఉత్తమ శిక్షకులైతే మనిషి**
**విజ్ఞానవంతుడవుతాడు. ఆ వంశం ధన్యమవుతుంది.**
**తల్లిదండ్రులు ధర్మపరాయణులు, విద్వాంసులైనచో**
**ఆ సంతతికి మహాభాగ్యం అబ్బినట్లే!**

సూర్యుడు కర్కాటకరాశిలో ఉన్నప్పుడు– అంటే ఆషాఢ శుద్ధ ఏకాదశినుండి దేవతలకు రాత్రి ఆరంభమవుతుంది. అప్పుడు శ్రీహరి కపట నిద్రను నటిస్తాడు. అందుకే ఆ రోజును 'శయన ఏకాదశి' అంటారు. భాద్రపదశుద్ధఏకాదశిని 'పరివర్తన ఏకాదశి' అనీ, కార్తిక శుద్ధ ఏకాదశిని 'ఉత్థానఏకాదశి' అనీ, మరుసటి రోజున 'ఉత్థాన ద్వాదశి' అనీ అంటారు.

ఈ వ్రతాన్ని ఆచరించటం వల్ల కలిగే ఫలితమేమంటే ఈ నాలుగునెలల సమయంలో శ్రీమన్నారాయణుడు పాలసముద్రంలో శేషశయనంపై పరుంటాడు. కాబట్టి ఆ సమయంలో భగవద్దర్శనాలను నియమబద్ధంగా చేసేవారికి బ్రహ్మహత్యాది దోషాలవల్ల కలిగే పాపాలు శీఘ్రంగా పోతాయని చెప్పబడింది. అంతేకాదు సంవత్సరకాలంలో మనచే చేయబడ్డ పాపాలు కూడా ఈ వ్రతం చేయడంవల్ల నశిస్తాయని కూడా చెప్పబడింది.

ఈ కాలంలో తీర్థయాత్రలు చేయకూడదు. ఈ చాతుర్మాస్య కాలంలో చేసే వ్రతాల వల్ల అశ్వమేథయాగఫలం లభిస్తుందని చెప్పబడింది. సూర్యుడు, మిథునరాశిలో సంచరించేటపుడు చక్ర, గదాధారియైన శ్రీహరిని షోడశోపచారాలతో పూజించి తెల్లని పట్టుపాన్పుపై పరుండబెట్టి చాతుర్మాస్య సంకల్పం చేయాలని స్కాందపురాణంలో ఉంది.

## పద్మపురాణంలో చాతుర్మాస్య వ్రతవిధానము

**'శ్రావణే వర్జయేత్ శాకం దధి భాద్రపదేతథా। దుగ్ధ మాశ్వయుజి త్యాజ్యం కార్తికే ద్విదళం త్యజేత్॥ అథవా బ్రహ్మచర్యస్థః నయాతి పరమాంగతిః'** అంటే ఈ చతుర్మాస్య వ్రతదీక్షలో ఉన్నవారు ఆషాఢశుద్ధ ద్వాదశి నుండి శ్రావణ శుద్ధ ఏకాదశి వరకు కూరగాయలు తినకుండా విడిచి పెట్టాలి. అట్లే భాద్రపదమాసంలో పెరుగు విడిచి పెట్టాలి. ఆశ్వయుజ మాసంలో పాలను విడిచి పెట్టాలి. కార్తిక ఏకాదశి వరకు "ద్విదళం" గల వస్తువులను అంటే రెండు బద్దలుగా ఉన్న పెసలవంటి పప్పుదినుసులను విడిచి పెట్టాలని పద్మపురాణంలో చెప్పబడింది. ఇంక ఈ నాలుగు నెలల కాలం దానధర్మాలు చేస్తూ, దేవ బ్రాహ్మణ పూజలను ఆచరిస్తూ బ్రహ్మచర్య వ్రతాన్ని అవలంబించి నేల పైనే శయనించాలి.

అంతేకాక, **'శయనీ బోధనీ మధ్యేయు కృష్ణైకాదశీ భవేత్। నైరోపోష్యాగృహస్థస్య నాన్యా కృష్ణా కదాచన'** అంటే ఈ నాలుగు నెలల్లో కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశులలో ఉపవాసం చేయాలి. జాగరణ చేస్తూ హరినామస్మరణ చేసి తీరాలని కూడా చెబుతారు.

వర్షశరదృతువులలో యాత్రలకు అనువైన మార్గాలుండవు. జనులంతా సస్యము యొక్క అభివృద్ధిపై పాటుపడుతుంటారు. అంతేకాక అధ్యయన సమయం. వేదవిద్యార్థులకు శ్రావణమాసంలో ఉపాకర్మచేసి అధ్యయనాన్ని ఆరంభించి, పుష్యమాసంలో అధ్యయన ఉత్సర్జన చేయాలి. ఈ మాసాలను గురువులు తమ శిష్యులకు అధ్యయన కాలంగా గ్రహించారు.

చాతుర్మాస్యకాలంలో బెల్లాన్ని విడిచిపెడితే మధుర వాక్కు అవుతాడు. తైలాన్ని విడిచి పెడితే సంతాన సుఖాన్ని, నేతిని వదిలితే సుందరశరీరాన్ని, సువాసనా తైలాన్ని విడిచిపెడితే సౌభాగ్యప్రాప్తి, పువ్వులు ధరించకుంటే విద్యాధరజన్మాన్ని, యోగాభ్యాసంవల్ల బ్రహ్మపదప్రాప్తి, షడ్రసాలను విడిస్తే స్ఫురద్రూప ప్రాప్తి, తాంబూలంను విసర్జిస్తే భోగ, భాగ్యప్రాప్తి. పండ్లను, కాయలను వర్జిస్తే సంతాన సుఖప్రాప్తి, మౌనవ్రతంతో సర్వాధికారాన్ని, నారాయణ అష్టాక్షరీ మంత్రంచే సర్వసౌభాగ్యాలను, నేలపై భోజనం చేయటం చేత సామ్రాజ్య ప్రాప్తి, దేవాలయాన్ని శుభ్రం చేయడం వల్ల వైకుంఠ ప్రాప్తి, ప్రతిదినం వేదవేదాంత ప్రవచనం వల్ల విష్ణుపదప్రాప్తి, తులసి పూజచే విష్ణులోక ప్రాప్తి కలుగుతుందని నారదునికి పరమేశ్వరుడు చెప్పాడు. చాతుర్మాస్య కాలంలో ప్రాణిహింస నిషిద్ధం. అహింస, దయ, దానం, ఇంద్రియ నిగ్రహాన్ని కలిగి ఉండాలి.

ఈ చాతుర్మాస్యకాలంలో 'విసర్జించవలసిన ఆహార పదార్థాలను' నియమ నిష్ఠలతో కార్తిక ద్వాదశినాడు దేవుని ప్రార్థిస్తూ బ్రాహ్మణునకు దానిమిచ్చిన తరువాత భుజించాలి.

చాతుర్మాస్య కాలంలో దైవసన్నిధిలో సాయంకాలం ప్రతి నిత్యం **మధుసూదనాష్టోత్తర స్తోత్రాన్ని** పఠించాలి.

ఈ స్తోత్రాన్ని స్వయంగా భూదేవి కోరిక మేరకు వరాహస్వామి బోధించాడు. దీనివల్ల శారీరక మానసిక ప్రశాంతత కలుగుతుంది. చాతుర్మాస్య దీక్షలో ఉన్న యతులనుంచి ప్రసాదాన్ని స్వీకరించిన అయిదు సంవత్సరాల బాలుడు భక్తిభావాన్ని పొంది మరుజన్మలో దేవర్షి నారదునిగా అవతరించాడు. కాబట్టి ఈ వ్రతాన్ని ఆచరించే శక్తి లేకపోయినప్పటికీ, చాతుర్మాస్యదీక్షను ఆచరించే వారిని సేవిస్తూ, తీర్థ, ప్రసాదాలను స్వీకరించటం వల్ల పుణ్యం కలుగుతుంది.



'అహంకార-మమకారాలు' తొలగించేదే 'దేవాలయం'

వేద పరిచయం

# వేదములు- విద్యలు

- శ్రీ ధారా రాధాకృష్ణమూర్తి

బ్రహ్మయొక్క తూర్పు ముఖమున ఋగ్వేదము, దక్షిణముఖమున యజుర్వేదము, పశ్చిమ ముఖమున సామ వేదము, ఉత్తర ముఖమున అధర్వణవేదము ఉద్భవించాయి.

నలుగురు ఋత్విక్కులలో హోతయను వానిచే చేయ బడు శస్త్రములనబడు ప్రశంసన మంత్రములు తూర్పు ముఖమునుండి వెలువడినాయి. అవి గానము చేయబడక కేవలము ప్రశస్తిరూపమున ఉంటాయి. అధ్వర్యువు అనువాడు రెండవ ఋత్విక్కు, అతడును అతనిచే ఆచరింపబడే స్తుతి అనే గాన స్తోత్రము, ఇజ్యమనబడు విధానము బ్రహ్మదక్షిణ ముఖమున జనించింది. ఉద్గాత మూడవవాడు. అతడు ప్రయోగించు స్తోమములు అనఋడు ఋగ్వేద మంత్రములు పశ్చిమ ముఖమున వెలువడినాయి. బ్రహ్మ అనే నాల్గవ ఋత్విక్కు, అతడాచరించు ప్రాయశ్చిత్త కాండము ఉత్తర ముఖమున వెలువడినాయి.


ఉపవేదములలో ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వవేదము, స్థాపత్యము అనే నాలుగు తూర్పు మొదలు నాలుగు ముఖముల నుండి వెలువడినాయి. స్థాపత్యమనగా శిల్పవేదము. (అశ్వవిద్యకూడ ఉపవేదములలో నొకటియని కొందరి మతము.)

ఐదవ వేదములో ఇతిహాస పురాణముల సముదాయము నాలుగు ముఖముల నుండి వెలువడింది. (అనగా నిది నాలుగు వేదముల వివరణమని యర్థము.)

కర్మ తంత్రములు అనబడు యజ్ఞములలో షోడశి, ఉక్థ్యము తూర్పునను, యజనము అగ్నిష్టోమము దక్షిణముననను, ఆప్తోర్యామము అతిరాత్రము పశ్చిమముననను, వాజపేయము, గవామయనము ఉత్తరమున నుండి పుట్టినవి.

ధర్మపాదములనబడు నాలుగేసి శిక్షణముల గణములు ఉన్నాయి. ఒక్కొక్క గణమునందలి నాలుగు ధర్మములును వరుసగా తూర్పు మొదలుకొని బ్రహ్మ ముఖములందు జనించాయి. వాని వివరములెట్టి వనగా: **(అ)**విద్య, దానము, తపస్సు, సత్యము అను నాలుగ భ్యాసములు. **(ఆ)**బ్రహ్మచర్యము, గృహస్థము, వానప్రస్థము, యతిత్వము అను నాశ్రమములును. **(ఇ)**సావిత్ర మనబడు బ్రహ్మచారి దీక్ష, వాని వృత్తులును తూర్పు ముఖమున వెలువడినాయి. అట్లే మిగిలిన మూడాశ్రమములును వృత్తులును దీక్షలును మిగిలిన మూడు ముఖముల నుండి ఉద్భవించాయి.

సావిత్రమనబడు బ్రహ్మచర్య దీక్షయందు ఉపనయనము, అప్పటినుండి మూడు దినములు గాయత్రీ జపదీక్ష ప్రాజాపత్యము, నాలుగు వేదములు చదువు దీక్ష, సంవత్సరము ఆచరించు అధ్యయన దీక్ష, బ్రహ్మచారి వ్రతమును, వేదము



నేర్చుట అయిన వెనుక బృహద్వ్రతము, నైష్ఠిక వ్రతము అతడాచరింపవలసినవి.

ఇక గృహస్థుని ధర్మములలో కృషి జీవనోపాధిగా పెట్టు కొనుట వార్త తింటారు. గృహస్థుడు యజ్ఞయాగాది కర్మల కుపయోగించే సాధనములను అనగా డబ్బు మొదలగు వానిని యాచించి కూడబెట్టి లోకహిత కర్మలకు వినియోగింపవలెను. తన కుటుంబమునకు, తనకును కావల్సిన ధాన్యమును యాచింపక పొలమున పండించు కొవాలి. పొలమున పడిన కంకులను కుప్పజేసికొని రాళ్లపై కొట్టి ధాన్యమును సేకరించు కొని రాతి తిరుగళ్లతో సంస్కరించు కొవాలి.

వానప్రస్థాశ్రమమువారు నాలుగువిధములైన వృత్తులవ లంబించునట్టి నాలుగు తరగతులవారు ఉన్నారు. అందు వైఖానసులను వారు భూమి దున్ని పండింపక దుంపలు మున్నగు వానిని త్రవ్వుకొని తినుచుంటారు. వాలఖిల్యులను రెండవ తెగవారు భూమిని పండించ వచ్చునుగాని క్రొత్తపంటలు వచ్చి నంతనే వెనుకటి ఫలసాయమును మిగులకుండ పంచి పెట్ట వలెను. ఔదుంబరులు అను మూడవ తెగవారు ప్రొద్దుననే మేల్కాంచినప్పుడు ఏదిక్కు కనబడునో ఆ దిక్కునకు పోయి అచ్చట అయాచితముగా లభించిన ఆహార పదార్థములను భుజిస్తారు. ఫేనపులు అనబడు నాల్గవ తెగవారు చెట్లపై పండిరాలిన కాయలను, ఆకులను భుజించి జీవిస్తారు.

సన్న్యాసాశ్రమము వారిలో కూడ నాలుగు తరగతుల వారున్నారు. అందు కుటీచకుడు అనబడు వానికి స్వంత కుటీరముండును. ఆచరణీయ కర్మలుండును. బహూదుడు అను తెగవానికి కుటీరముండదు. కర్మలను విడిచి జ్ఞాన ప్రధానుడై తిరుగుచుంటాయి. హంసుడనబడు సన్న్యాసి కేవలము జ్ఞానా భ్యాసము మాత్రమే చేస్తుంటాయి. నిష్క్రియుడు అను నాల్గవ తరగతివాడు అభ్యాససాధన కూడ చేయడు. కేవలము పరబ్రహ్మ తత్త్వముగా ఉంటాడు.

అన్వీకి, త్రయీవిద్య, వార్త, దండనీతి అనబడు నాలుగును న్యాయవిద్యలు అనే పేర్లు ఉన్నాయి. ఇవి నాలుగు తూర్పు మొదలు నాలుగు ముఖములనుండి జనించాయి. అన్వీక్షకి యనగా ఆత్మయననేమో, కానిది అనగానేమో తెలియగల వివేకము నేర్పువిద్య. త్రయీ విద్య యనగా స్వర్గాది ఫలములు కోరి వేద కర్మ లాచరించు విధానము. వార్తయనగా జీవననో పాధికై భూమిని దున్ని పండించుకొనే విద్య. వార్త అంటే తానాచరించు పనికి అర్థ సంపాదనము సమర్థతతో చేయుట, అట్టి సందర్భములలో తన ప్రవర్తనమును ఇతరులకు నచ్చునట్లు, మెలగుట, వాణిజ్యాదులు, అందు తనకు రావల్సిన అర్థ సంపాదనము, చెల్లింపని వారిని చట్టముతో బద్ధులను చేసి కార్యము సాధించుకొని జీవించుట. నేటికాలమున ఉద్యోగస్థుడు, వ్యాపారస్థుడు అగు పౌరుడవలంబించు మార్గములు దీనికి సరిపోతుంది. ఈ నాలుగింటిలో అన్వీక్షకి మోక్షమునకును, త్రయీ విద్య కామమునకును, వార్త ధర్మమునకును, దండనీతి అర్థమునకును సాధకములు.

భూః భువః సువః మహః అను నాలుగు వ్యాహృతు లును నాలుగు ముఖములనుండి ఉద్భవించాయి.

బ్రహ్మ హృదయమునందలి ఆకాశమునుండి ఓంకారము ఉద్భవించింది. రోమములనుండి ఉష్ణిక్ ఛందస్సు, చర్మమునుండి గాయత్రి, మాంసమునుండి త్రిష్టుప్, కీళ్లనుండి అనుష్టుప్, ఎముకలనుండి జగతీ, దేహమందలి చమురు నుండి పంక్తి, ప్రాణమునుండి బృహతీ ఛందస్సు అను ఛందస్సులు వెలువడినాయి.

హల్లులలో కవర్గ మొదలగు ఐదు వర్గలలో జీవులేర్పడ తాయి. అకారము మొదలు అచ్చులతో దేహమేర్పడెను. శ, ష, స, హ అను ఊష్మములలో నింద్రియములు సృష్టియేర్పడెను. య, ర, ల, వ, అను అంతస్థములలో ఆత్మబలము అనబడు శబ్దబ్రహ్మము ఏర్పడెను. షడ్జము, ఋషభము, గాంధారము, మధ్యమము. పంచమమమము, ధైవతము, నిషాదము అనబడు సప్తస్వరములలో ఈ శబ్ద బ్రహ్మ స్వరూపుని యొక్క విహార క్రీడ లేర్పడినవి.

ఓంకారము వైఖరీవాక్కుగా వ్యక్తస్వరూపమై ఏర్పడింది. మిగిలిన మూడు వాక్కులుగా (పరా పశ్యంతీ మధ్యమా వాక్కులుగా) ఉచ్చరించబడిన ఓంకారము అవ్యక్తమై సృష్టి తత్త్వముగా నేర్పడింది.. అందు పరమాత్మ అవ్యక్తుడు మాత్రమే. జీవులు వాని వ్యక్తస్వరూపములు, ఈ రెండింటియందును ప్రణవము ఆత్మోచ్చారణముగా వ్యక్తమౌతుంటుంది. భగవంతుడు అవ్యక్తాతుడు అయినందున పరిపూర్ణ స్వరూపుడు. వ్యక్తాత్మకుడు అయినందు వల్ల ఇంద్రుడు మొదలగు దేవతాశక్తులతో రూపాలుగా దిగివస్తాయి.



'మానసిక-శారీరిక రోగాలను' తగ్గించే శక్తి గుడికి ఉంది

# 'ఏకాదశుల' ప్రాముఖ్యత

- ఆచార్య ఎస్.మురళీధరరావ్

హిందూ సంప్రదాయంలో పరమ పవిత్రమైన తిథి 'ఏకాదశి'. ఎంత పవిత్రమైనదంటే ఏడాదిలో వచ్చే 24 ఏకాదశులకూ ఏదోఒక విశిష్టతను ఆపాదించి హరినామ స్మరణ చేస్తారు భక్తులు. ఒక్కో రోజుకు ఒక్కో ప్రాధాన్యత, తొలి ఏకాదశి, వైకుంఠ ఏకాదశిలాంటి ఏకాదశులకు ఎంతటి పవిత్రత ఉందో అందరికీ తెలుసు. అలాంటి ప్రత్యేకతే అలాంటి పవిత్రతే జ్యేష్ఠమాసంలో వచ్చే మొదటి ఏకాదశికీ ఉంది. దీనిని 'త్రివిక్రమైకాదశి' అంటారు. నీరుకూడా త్రాగకుండా ఉపవాసం చేస్తారు కాబట్టి దీన్నే 'నిర్జలైకాదశి' అంటారు. జ్యేష్ఠబహుళ ఏకాదశి దీన్ని 'యోగిన్యైకాదశి' అంటారు.

ఆషాఢమాసంలో వచ్చే శుద్ధ ఏకాదశి, దీన్నే 'తొలి ఏకాదశి' అంటారు. పూర్వం ఆషాఢ శుద్ధ ఏకాదశినే సంవత్సరారంభంగా భావించేవారు కాబట్టి ఈ పేరు వచ్చిందని ప్రతీతి. శ్రీమహావిష్ణువు పాలసముద్రంలో శేషతల్పంపై శయనించే రోజు కాబట్టి, ఈ రోజును 'శయనైకాదశి' అని కూడా అంటారని పురాణాలు చెబుతున్నాయి. ఖగోళపరంగా చూస్తే ఈ రోజు దాకా ఉత్తరదిశగా వాలి కనిపించే సూర్యుడు ఒకింత దక్షిణ దిశగా వాలినట్లు కనిపిస్తాడు. సూర్యుడంటే ప్రత్యక్ష నారాయణుడు. అందువల్ల కూడా మన పూర్వులు ఈరోజును శయనైకాదశిగా వ్యవహరించి ఉండొచ్చని పండితుల అభిప్రాయం.

ఈ రోజున ఏకాదశివ్రతం చేసి విష్ణువును పూజించడం ఆచారంగా పాటిస్తారు. భక్తులు తొలి ఏకాదశినాడు 'గోపద్మ వ్రతం' చేస్తారు. అంటే గోవును పూజించడం అన్న మాట. ఈనెల బహుళంలో వచ్చే ఏకాదశిని 'పాపనాశిని' ఏకాదశి అంటారు. ఆరోజు విష్ణువును పూజించి ఏకాదశి వ్రతం చేస్తే జన్మజన్మల పాపాలు నశిస్తాయని నమ్మిక.

శ్రావణ శుద్ధ ఏకాదశిని 'పుత్రదా ఏకాదశి', 'లలితైకా దశి' అంటారు. ఆరోజున గొడుగు దానమిస్తే మంచిదని ప్రతీతి. ఇక బహుళంలో వచ్చేది 'కామిక ఏకాదశి'. ఈ రోజున వెన్న దానం చేయాలంటారు. భాద్రపద శుద్ధ ఏకాదశిని 'పరివర్తన ఏకాదశి' అంటారు. ఈరోజు ఉపవాసం నుండి మర్నాడు ద్వాదశి ఘడియల్లో హరిని పూజిస్తే కరవు కాటకాలు తొలగి పోతాయని పద్మపురాణంలో ఉంది. విశ్వామిత్రుడికి మాటిచ్చి అనేకకష్టాలను అనుభవించిన హరిశ్చంద్రుడు భాద్రపద బహుళఏకాదశి నాడు వ్రతం ఆచరించి వాటిని దూరం చేసుకొన్నాడని పురాణ ప్రవచనం. అలాంటిదే కార్తికశుద్ధ ఏకాదశి బహుళం లోని 'ఉత్పత్తి ఏకాదశి'. విష్ణుమూర్తి శరీరం నుంచి పుట్టిన కన్య మురాసురుని సంహరించిన దినం ఇది.

తొలి ఏకాదశినాడు శయనించిన విష్ణుమూర్తి యోగ నిద్రనుంచి మేలుకునే రోజు కాబట్టి ఈరోజును 'ఉత్థాన ఏకాదశి' అనికూడా అంటారు. మార్గశిర శుద్ధంలో వచ్చేది 'మోక్షైకాదశి', 'సౌఖ్యదా ఏకాదశి', అప్పటికి ధనుర్మాసం కూడా వచ్చి ఉంటే ఆ రోజును 'ముక్కోటి/ వైకుంఠ ఏకాదశి' అంటారు. ముక్కోటి ఏకాదశినాడు విష్ణ్వాలయాల్లో ఉత్తరద్వార దర్శనం ఉంటుంది. ఆరోజున స్వామిని ఉత్తరద్వారం నుంచి దర్శనం చేసుకున్న వారికి మోక్షం లభిస్తుందని ప్రతీతి.


ఇక మార్గశిర బహుళలో వచ్చేది 'విమలైకాదశి', దీన్నే 'సఫలైకాదశి' అని కూడా అంటారు. పుష్యశుద్ధంలో వచ్చేది 'నంద/ పుత్ర ఏకాదశి'. అదే మాసం బహుళంలో వచ్చేది. 'కల్యాణైకాదశి', మాఘశుద్ధ ఏకాదశిని 'భీష్మఏకాదశి'గా ఆచరిస్తారు. ఈరోజునే 'కామదైకాదశి, జయైకాదశి' అని కూడా వ్యవహరిస్తారు. మరో పదిహేను రోజులకు వచ్చేది 'విజయై కాదశి', ఆరోజున పాదరక్షలు దానం చేయడం మంచిదంటారు. ఫాల్గుణ మాసంలో 'దాత్రైకాదశి, సౌమ్యైకాదశి' వస్తాయి, చైత్రశుద్ధంలో వచ్చే ఏకాదశిని 'దమనైకాదశి' అంటారు. దీనికే అవైధవ్య ఏకాదశి అని కూడా పేరు, చైత్ర బహుళ ఏకాదశినాడు ఉపవాసం ఉంటే వేయి ఆవులను దానం చేసిన పుణ్యం లభిస్తుందంటారు. ఈ రోజున 'వరూధిన్యైకాదశి' అంటారు. ఇక మిగిలింది వైశాఖమాసం. ఇక్కడ మొదట వచ్చేది మోహిన్యై కాదశి. బహుళంలో వచ్చేది 'సిద్ధైకాదశి'.

కాబట్టి, ఈ విధంగా సంవత్సరంలో వచ్చే ఇరవై నాలుగు ఏకాదశులను క్రమం తప్పకుండా ఆచరిస్తే మోక్షదాయ కంగా ఉంటుంది.

# 'గురు' గ్రహం

- శ్రీ మద్దులపల్లి వేంకటేశావధాని

బృహస్పతి స్వర్ణమకుటం, సుందరమైన పూమాల ధరించి ఉంటాడు. పసుపుపచ్చని వస్త్రాలు ధరించి పద్మాసనములో ఆసీనుడై ఉంటాడు. ఇతనికి నాలుగు చేతులు ఉండును. వాటిలో స్వర్ణముచే చేయబడిన దండము, రుద్రాక్ష జపమాల, పాత్ర, వరదముద్ర ఉండును. బృహస్పతి అత్యంత సౌందర్యవంతుడని ప్రాచీనఋగ్వేదంలో తెలుపబడినది. బంగారంచే నిర్మించబడిన గృహంలో నివసిస్తాడు. ఇతని రథము కూడా బంగారం చేతనే నిర్మించబడి ఉంటుంది. అది సూర్యునికి సమానంగా కాంతిని విరజిమ్ముతుంది. అందులో అన్ని రకాలసౌకర్యాలు కలిగి ఉంటుంది. అది వాయువేగంతో పరుగులు పెట్ట గలిగే 8 గుర్రాలచే నడుపుబడుతుంది. ఇదేకాక 'ఏనుగు' కూడా బృహస్పతి వాహనమే.



మహాభారతం ప్రకారం బృహస్పతి బ్రహ్మమానస పుత్రులలో ఒకడైన అంగీరసుని కొడుకు. అయితే మరికొన్ని పురాణాలలో ఇతను అగ్నిపుత్రుడుగా చెప్పబడుచున్నాడు. మొదట బృహస్పతి మానవమాత్రుడే. అయితే శివుడి ఆజ్ఞచే దైవత్వం పొందినాడు. మహాబుద్ధిమంతుడు. ఇతనికి వాచస్పతి అని మరొక పేరు కలదు. ఇతని సహోదరుఁడు ఉతథ్యుఁడు. సహోదరి పేరు యోగసిద్ధి.




మన సనాతన సంప్రదాయంలో బృహస్పతికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. గురుగ్రహం జీర్ణక్రియవ్యవస్థ పైన, శరీరంలోని కొవ్వులు, అలాగే నాలుక–రుచి, కాలేయం అవయవాలపైన ఆధిపత్యం వహిస్తున్నాడు. సంతానం, విద్య, పాండిత్యం, ధర్మం, వివేకం, సన్మానం, సుఖవంతమైన వైవాహిక జీవితం మొదలైనవి గురుగ్రహం యొక్క శుభదృష్టి లేదా శుభస్థానాల్లో ఉండటం వలన కలుగుతాయి. చాలావరకు పుస్తకరచయితల జాతకాలను గమనిస్తే గురుగ్రహం యొక్క శుభదృష్టి లేదా శుభస్థానాల్లో ఉండటం ఉంటుంది.

గురుగ్రహం అనుగ్రహానికి శనగలు దానమివ్వాలి. 16వేలసార్లు గురుధ్యాన శ్లోకం జపించాలి. గురుదక్షిణామూర్తి, దత్తాత్రేయ, విష్ణువులను ఈ సందర్భంగా ఆరాధించాల్సి ఉంటుంది. అలాగే పసుపు వస్త్రం ధరించాలి. రవి సమిధలలో హోమం చేయాలి. పుష్యరాగ రత్నాన్ని ధరించాలి. రుద్రాక్ష అయితే పంచముఖి రుద్రాక్ష ధరించాలి. అలాగే పూజలు, జపాలు, హోమం, దానం, రత్నధారణ విధిగా చేయాలి. ఈ రోజు గురుపౌర్ణమి సందర్భంగా దక్షిణామూర్తిని పూజించడం, దత్తాత్రేయ ఆరాధాన చేస్తే శుభం కలుగుతుంది. అలాగే శ్రీహయగ్రీవాయనమః అనే జపం చేసుకున్నా అన్ని విధాలుగా మేలు జరుగుతుంది. విద్యార్థులు, ఉద్యోగులు ఈ జపం చేస్తే అన్ని మంచి ఫలితాలే కలుగుతాయి.

## గురుగ్రహస్తోత్రం

**దేవానాం చ ఋషీనాం చ, గురుం కాంచన సన్నిభం।**
**బుద్ధి మంతం త్రిలోకేశం, తం నమామి బృహస్పతిం॥**

# తిరుమల
# నారాయణగిరిలో వెలసిన
# శ్రీవారిపాదాలు









తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయంలోని శ్రీసుందరరాజస్వామివారికి జరిగిన అవతారోత్సవం
(2021, జూన్ 29 నుండి జూలై 01 వరకు)



తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామివారికి జరిగిన పత్రపుష్పయాగం
(2021, మే 26)

# తిరుమల శ్రీవారి ఆలయంలో జరగనున్న పవిత్రోత్సవాలు
## (2021, ఆగష్టు 17 నుండి 20 వరకు)







2021, జూన్ 13న జమ్మూలో వైభవంగా శ్రీవారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన.
ఈ కార్యక్రమంలో జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ మనోజ్‌సిన్హా, కేంద్ర మంత్రులు శ్రీ జి.కిషన్ రెడ్డి, శ్రీ జితేంద్రసింగ్,
తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి,
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., మరియు ఇతర ప్రత్యేక అధికారులు





2021, జూన్ 24న తి.తి.దే. స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., గారికి శ్రీవారి ప్రసాదాలను అందజేస్తున్న
తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి మరియు తి.తి.దే. స్పెసిఫైడ్ అథారిటీ కన్వీనర్ శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్.,
తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారిణి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., గారలు



2021, జూన్ 30న తిరుపతిలోని తి.తి.దే. గోసంరక్షణశాలను తనిఖీ చేసిన
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., గారు.
ఈ కార్యక్రమంలో గోసంరక్షణశాల డైరెక్టర్ డా॥ హరినాథరెడ్డి,
తి.తి.దే. సి.ఇ. శ్రీనాగేశ్వరరావు, తి.తి.దే. ఎస్.ఇ. శ్రీ జగదీశ్వర రెడ్డి,
తి.తి.దే. పి.ఆర్.ఓ. డా॥ రవి మరియు ఇతర అధికారులు ఉన్నారు.



2021, జూన్ 30న
తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో,
తాళపత్రగ్రంథాలను పరిశీలిస్తున్న
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్., మరియు
వైస్ ఛాన్సలర్ ఆచార్య మురళీధర్ శర్మ, తదితరులు

# శుచీంద్రం

- శ్రీ దేవరకొండ శేషగిరిరావు

నాగర్‌కోయిల్, కన్యాకుమారి క్షేత్రాల నడుమ 'శుచీంద్ర క్షేత్రం' కనువిందు చేస్తుంది. ఆస్తికులెట్లాగూ ఆశ్చర్యపడతారు. ఇక నాస్తికుడు కూడా అందులోని శిల్ప సంపదను తిలకించి పులకించకపోడు. అది ఒక అద్భుత శిల్పక్షేత్రం.

ఈ పేరెట్లా వచ్చింది? ***'శుచితః ఇంద్రః అత్ర ఇతి శుచీంద్రం'*** అంటే, ఇంద్రుణ్ణి పవిత్రం చేసిన చోటని అర్థం.

ఇంద్రాహల్యల కథ మనకు తెలియనిది కాదు. దేవ కార్యం కోసం అహల్యా సంగమమని చెప్పినా తప్పుచేస్తే ఎంతటి వానికైనా శిక్ష అనుభవింపక తప్పదనే నీతిని బోధిస్తుందీ కథ.

ఇంద్రుడు తపస్సు చేసిన చోటు జ్ఞానారణ్యం. ఇతడు శుద్ధి పొందిన తరవాత అది శుచీంద్రంగా పిలవబడింది. దీనిని ఇంద్రుడే నిర్మించాడని, ప్రతి రాత్రి వచ్చి సేవిస్తూ ఉంటాడని స్థలపురాణం అంటోంది.

ఈ స్థలానికి ఇంద్రునితోనే కాదు, అనసూయ పతివ్రతా మాహాత్మ్యానికీ సంబంధం ఉంది. ఈమె జ్ఞానారణ్యంలోకి వెళ్లినప్పుడు, త్రిమూర్తులు ఈమెను వివస్త్రగా ఉండి వడ్డించాలని అనడం, వారిని ఈమె చిన్నపిల్లలుగా చేయడం; సరస్వతి, లక్ష్మి, పార్వతుల కోరికపై త్రిమూర్తులను మామూలు ఆకారాలతో ఈమె చూపించడం మొదలైన కథ మనకు తెలిసిందే. త్రిమూర్తులు ఆత్రి, అనసూయలను అనుగ్రహించిన చోటున మూడు లింగాలు ఏర్పడ్డాయి. ఒక చెట్టు పుట్టింది. అత్రి అనసూయలు స్వామిని అర్చించినట్లు కథ. ఇలా ఇది త్రిమూర్తుల ఆలయమైంది. అయితే గర్భగృహంలో స్థాణునాథునికే ప్రాధాన్యం. వివాహానికై ఎదురుచూస్తూ ఉంటాడు.



ఇక్కడున్న చెట్టు వయస్సును పరిశోధకులు పరిశీలించి రెండు వేల సంవత్సరాలకు పైనే దీని వయస్సుంటుందని తేల్చారు. అట్లే ఇక్కడి ఆలయం నిర్మింపబడి వేయి సంవత్సరాలైనా అయి ఉంటుందని తేల్చారు. పాండ్య, చేర, చోళ ప్రభువులు ఆయా కాలాల్లో స్వామికి కైంకర్యాలు చేశారు. చివరగా తిరుమల నాయకుడు గరుడమంటపాన్ని నిర్మించాడు.

134 అడుగుల ఎత్తైన గోపురం ముందుగా చూపరులను ఆకట్టుకొంటుంది. సాధకునిలో ఉన్నత భావానికి ఊపిరి





పోస్తుంది. నాటకశాల, ఊంజల్ మంటపం, సుదీర్ఘమైన నడవలు లేదా వసారాలు, అందలి దీపకాంతులు, సప్తస్వరాలు పలికే అలంకారమంటప స్తంభాలు, దేవీ హనుమన్మందిరాలు, చిత్రసభ, విష్ణుమందిరం, చెట్టుమొదట్లో మూడు లింగాలు ఆవిర్భవించిన చోటు, గరుడమంటపం, చంపకరామన్ మంటపం, శిల్పాలు చెక్కిన 32 రాతిస్తంభాల మంటపం మొదలైనన్నీ శిల్పకళా శోభితాలే.

గర్భగృహంలో ఉన్నది శివలింగమే. పన్నెండున్నర అడుగుల ఎత్తులో చూడముచ్చటైన నంది కన్పిస్తుంది. గర్భగృహానికి



పక్కగా ఉన్న విష్ణ్వాలయంలో యథావిధిగా పూజలు కొనసాగుతూనే ఉంటాయి. శివకేశవుల అభేదాన్ని ఈ ఆలయం ఇలా చాటుతుంది. ఉత్తరవైపున నటరాజ ఆలయముంది. ఇక్కడున్న వసంత మంటపంలో ఆలయం పైకప్పు పై నవగ్రహాలు చెక్కబడ్డాయి. తలయెత్తి చూడాలి. మిగిలిన ఆలయాల్లో మామూలుగా కన్పిస్తూ ఉంటాయి కదా! ఇదీ ఇక్కడ ప్రత్యేకత.



సీతారాముల విగ్రహాలు, 18 అడుగుల ఎత్తైన ఆంజనేయవిగ్రహం కనువిందు చేస్తుంది. ఇది లంకలో హనుమ చూపిన ఉన్నత రూపానికి గుర్తుగా మలచబడింది.

ఇలా ఇది త్రిమూర్తి ఆలయం. 'స్థాణుమాలయ' అని మూర్తిని పిలుస్తారు.

అనేక రాజుల శిల్పకళా శైలులు, ఒకచోట దర్శించాలంటే శుచీంద్ర క్షేత్రాన్ని తప్పక చూడాలి.



కోరికలు ఉన్నంతవరకూ పునర్జన్మ తప్పదు

*గత సంచిక తరువాయి భాగం...*

గురువును మొదలు ఆశ్రయించాలి. గురువును ఆశ్రయిస్తేనే మనకు తత్త్వజ్ఞానం కలుగుతుంది అని ఉపనిషత్తులలో చాలా స్పష్టంగా బోధిస్తూ ఉంటారు. అయితే గురువు దగ్గరకు వెళ్లినంత మాత్రన సరిపోదు. గురువు దగ్గరకు వెళ్ళి ఏం చేయాలి అనే విషయం ప్రధానం. ఆ విషయమే ఉపనిషత్తులలో చెప్పాడు భగవద్గీతలో కూడ పైన పరమాత్మ చాలా విస్తారంగా చెప్పాడు అవన్నీ దుర్యోధనుడు ఆచరించబోవటం లేదు కాబట్టి గురువు వలన కావలసిన ఏప్రయోజనం దుర్యోధనుడికి దక్కటం లేదు దుర్యోధనుడు కిప్పుడు కనీసం కావలసిన ప్రయోజనమేమిటి? యుద్ధంలో విజయం అది దక్కిందా దక్కలేదు ఎందుకు దక్కలేదు గురువు దగ్గరకు వెళ్లాడు ఇంకా చెప్పాలంటే భీష్మాచార్యుడు దగ్గరకు వెళ్లాడు కంటే ద్రోణుడి దగ్గరకు వెళ్ళటమే న్యాయం గురువు దగ్గరకు వెళ్లి అయ్యా నేను గెలవాలి దానికొక ఉపాయం చెప్పండి అంటే, ఆయన చెప్పేసి ఉండేవాడు ద్రోణుడి దగ్గర లేని అస్త్రాలా? లేని వస్త్రాలా? ఆయనకు లేని వ్యూహాలా? పాండవులలో మహావీరులలో ఎవరు ఈయన శిష్యులు కారు? అందరు ఈయన శిష్యులేగా కాని అక్కడకు వెళ్లి సరిగ్గా గురువు దగ్గర విజయంకోసం ప్రార్థించాడా లేదా నాకు తత్త్వజ్ఞానం చెప్పమని అడిగాడా ఏమి అడగలేను. కాబట్టి గురువును ఆశ్రయించాలి గురువును ఆశ్రయించినప్పుడు సర్వంగవినయంగా జాగ్రత్తగ మనకు కావలసిన కార్యాన్ని నెరవేర్చుకోవాలి వారు చేసినటువంటి ఉపదేశాన్ని శ్రద్ధగా మనసు కెక్కించుకోవాలి ఈ భావన సర్వంగా రావటంకోసం 'ఆచార్యముపసంగమ్య' అని ఒక ఉపనిషద్వాక్యరేబని ఇక్కడ పెట్టాడు. ఈ శ్రీమద్భగవద్గీతను మనం గీతామృతం, గీతామృతం అని ఎందుకనుకుంటున్నాం ప్రతి ముక్కలో ప్రతి మాటలో మనకు జీవితానికి కావలసినటువంటి ప్రధానమైన అంశం ఒకటి చెప్పకుందాం. మానవజన్మకు సార్థకత చేకూర్చే అంశం ప్రతి శ్లోకంలో ప్రతివాక్యంలో ప్రతిపదంలో ప్రతి అక్షరంలో ఉంది. అటువంటిది కాబట్టే మనం ప్రత్యేకించి గీతామృతం అనుకుంటున్నాం అటువంటిది కాబట్టే మనం ప్రత్యేకించి గీతామృతం అనుకుంటున్నాం. అటువంటి గీతామృతాన్ని ఆచార్యోపసదనం' గురుపపదదనంతో ఇక్కడ ప్రారంభం చేశారు. ఈ గురువు గురూప సదనం వలన దుర్యోధనుడు ఏవిధమైన ప్రయోజనం పొందాడు. తెలుసుకుందాం ఏ రకంగా ఈ గురుశిష్యుల సంభాషణ జరిగింది వంటి ప్రశ్నలన్నిటికి సమాధానం తెలుసుకుందాం.

**కృష్ణం వందే జగద్గురుమ్**

ధారావాహిక - 4

# శ్రీమద్భగవద్గీత

- ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ

పరమాత్మ భగవంతుడు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీవారు తండ్రి అయితే శ్రీమద్భగవద్గీత ఆయన ముఖారవిందం నుండి వచ్చినటువంటి వాక్కు మనకు తల్లి ఆ తల్లి మనల్ని అర్జునుడిలా మారమంటుంది. అర్జునుడిలా యోగ్యత కలిగి ఉండమంటుంది. అర్జునుడిలా యోగ్యత కలిగితే మంచి ఉపదేశాన్ని నీవు పొందగలవు మంచి ఉపదేశాన్ని అనుభవించగలవు మంచి ఉపదేశాన్ని ఆచరించగలవు, అని చెబుతుంది. కాబట్టి మనమందరం అర్జుననిలా మారటానికి ప్రయత్నించాలి అంటే ఇంకొకరిలా మారకూడదా? మారకూడదు, దుర్యోధనుడిలా అస్సలు మారకూడదు. ఎందుకు మారకూడదు, దుర్యోధనునిలా మారితే తప్పేంటి అని భగవద్గీతామృతం స్వయంగానే ఉపదేశం చేస్తున్నది. మనం ఇంతకు ముందే అనుకున్నట్లుగా దుర్యోధనుడు తన గురువుగారైనటువంటి ద్రోణాచార్యుని దగ్గరకు వెళ్ళాడు వెళ్ళి సంభాషణ మొదలు పెట్టాడు సామాన్యంగా మనందరం మనం చిన్నప్పుడు చదువుకొనిన గురువుల వద్దకు వెళ్ళినప్పుడు మర్యాదగా మాట్లాడుతాం, దండం పెడతాం ఇంకా మనలో కనుక వినయం పరిపూర్ణమైతే సాష్టాంగనమస్కారం చేస్తాం. ఆయనే పరమాత్మ అని నమ్ముతాం. కాని ఈ దుర్యోధనుడు వెళ్ళి

"పశ్యైతాం పాండు పుత్రాణాం ఆచార్య మహతీం చమూం
వ్యూఢాం ద్రుపద పుత్రేణ తవ శిష్యేణ ధీమతామ్"

అన్నాడు ఓ ఆచార్య! ఓ గురువా! చూడు ఏం చూడాలి. 'పాండు పుత్రాణాం మహతీం చమూం' పాండు పుత్రులు పెద్దసేన తీసుకొచ్చారు. తీసుకొచ్చి ఎదురుగా కూర్చున్నాను. నిలుచుని ఉన్నారు. ఎలా నిల్చున్నారు వ్యూహాత్మకంగా నిల్చున్నారు. యుద్ధంలో కావలసిన వ్యూహాన్ని రచించి యెదురుగుండా నిలుచుని ఉన్నారు. ఆ వ్యూహానికి నాయకత్వం ఎవరు వహిస్తున్నారు? అంటే దృష్టద్యుమ్నుడు వహిస్తున్నాడు ఎవరా ద్రుష్టద్యుమ్నుడు? ద్రుపద మహారాజు యొక్క కొడుకు. అంటే పాండవులకు బావమరిది. ఎవరాద్రుష్టద్యుమ్నుడు 'తవశిష్యేణ

నీ శిష్యుడు నీదగ్గరే విద్యాభ్యాసం చేశాడు నీ దగ్గరే విద్యాభ్యాసం చేసినటువంటి ద్రుష్టద్యుమ్నుడు నీయెదురుగుండా వ్యూహాత్మకంగా నిలుచుని ఉన్నాడు నీదగ్గర విద్యాభ్యాసం చేసినటువంటి పాండవులు నీకు ఎదురుగా నిలుచుని ఉన్నారు. దృష్టద్యుముడు ఎలాంటివాడు? 'ధీమతా' చాలా తెలివైనవాడు వ్యూహం చూస్తేనే తెలిసిపోతున్నది. మంచి వ్యూహంలో నిలుచునివున్నాడు. ప్రతి రోజున ఏ రకమైన వ్యూహంలో రావాల్నో ఆ రకమైన వ్యూహంలో నిలుచుని ఉన్నాడు కాబట్టి దీన్నొకసారి చూడు అన్నాడు. ఇంతవరకే ఇది మనకు సామాన్యంగా తోచేటువంటి మాట. ఇందులో మనం దుర్యోధనుడి యొక్క అసలు అభిప్రాయం ఏమిటి? అని తెలుకునే ముందు ఈ శ్లోకంలో ప్రధానమైన పదాన్ని పట్టుకోవాలి ఈ శ్లోకంలో ప్రధానమైన పదం ఆచార్య ఆచార్యః అంటే ఎవరు. మనం సామాన్యంగా గురువు అంటాం. కొన్నిసార్లు శాస్త్రాలలో గురువు ఉపాధ్యాయుడు, ఆచార్యుడు అని వివిధరకాలుగా ఆచార్యుని గురువుని వర్గీకరిస్తూ ఉంటారు. ఏ రకంగా చెప్పుకున్నా సరే మనకు ప్రాథమికంగా గురువు అనే అర్థం చేసుకుందాం గురువు అంటే ఎవరెవరౌతారు? మొదట తల్లి. ఎందుకంటే ప్రథమ గురువు తల్లి. తరువాత తండ్రి గురువు నిసర్గగురువు అని తండ్రికి పేరు నిసర్గగురువు అంటే భగవంతుడు మనకు ప్రసాదించినటువంటి సహజమైన గురువు తల్లి ప్రథమగురువు అనటంలో సందేహమే లేదు. తండ్రి మనకు సహజంగా ఆయన పుట్టడమే తండ్రిగా గురువుగా పుట్టాడు. మనకు నిసర్గగురువు తండ్రి. ఇదిగాక విద్యాబుద్ధులు నేర్పించేవారు గురువులున్నారు. ఇదిగాక మనకు సజ్ఞానోపదేశం చేసే వారున్నాను. సద్గురువులున్నారు. అందరు గురువులు. వారందరు ఆచార్యులే అయితే ఆచార్యపదంలో ఒక స్వారస్యమైతే తప్పకుండా ఉంది. ఆచార్య అనే పదానికి అర్థాన్ని ఒక చోట ఇలా చెప్పారు.

"అచినోతిః శాస్త్రార్థం ఆ చారే స్థాపయత్యపి
స్వయమాచరతేవస్తు ఉత్తమాచార్యం ప్రచక్షతే" అని.

ఆచార్యుడు అంటే యెవరు శాస్త్రాలలో ఉన్న విషయాలన్ని సక్రమంగా తెలుసుకున్నవాడు ఒక చోట ఒక విషయాన్ని ఒక రకంగా ఉండి, అన్నీచోట్ల అన్ని రకాలుగ వున్నటువంటి విషయాలన్ని అని సంగ్రహించి ఏం చేయాలి? ఏం చేయకూడదు? కర్తవ్యమేమిటి? అకర్తవ్యం అనేదేదైతే తీర్మానంగా నిశ్చయింపబడి ఉన్నదో దాన్ని తాను ఆచరిస్తాడు ఆచరించి" ఆచారే స్థపయత్యపిణ విద్యార్థులని శిష్యులని తనను ఆశ్రయించినవారిని ఆ సదాచారంతో నిలబెడతారు ఆ సన్మార్గం లోకి తీసుకు వెళతారు ఇలాంటి వ్యక్తిని ఆచార్యః అని అంటారు. ఆచార్యః అంటే గురువు వీరే మూడు రకాలుగా ఉంటారని పిల్లవాడిలో దోషాలు సరిచేస్తూ తప్పుగా చదువుతూంటే వివరిస్తు నిరంతరం దిద్దుకోవాలని ఉపదేశం చేస్తు వారిని సక్రమమైన మార్గంలోకి తీసుకోస్తారు. మనం మారటానికి నిరంతరం అవకాశమిస్తున్నటువంటి గురువు దొరకటం ఒక్క జన్మలో పుణ్యం చేసుకుంటే ఇంక రెండవరకంవారు, వీరేం చేస్తారంటే పిల్లవాణ్ణి పిలిచి విషయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. ఎలా చదువుకుంటే బాగుంటుంది అని పాఠ్యాంశాన్ని గురించి చక్కగా వివరణ ఇస్తుంటారు. ఇలా సక్రమమైన మార్గంలోకి సరిదిద్దటమే కాకుండ వివరణకూడ దానికి తోడైతే తిరుగే ఉండదు.

ఇటువంటి వాళ్లు దొరకటం గూడ సామాన్యమైన పుణ్యంకాదు. ఇంక మూడోరకంవారు, వీరు పిల్లల్ని సరిదిద్దటం వివరణలు ఇవ్వటాలు అనేవి లేకుండా వారు స్వయంగా ఆచరిస్తూ వారిన్ని వారిలోని నిపుణతకు ఒకరకమైన ప్రేరణని తీసుకొస్తారు. పిల్లలకు ప్రేరణ అంటే గురువులు ఆచరిస్తూ వాళ్లు కూడ ఒక భగవద్గీతో, సుందరకాండో, రామాయణమో మహాభారతమో చదువుతూ నేను చదువుతున్నాను నీవు చదువుకో అని చెబుతూ వాళ్లు ప్రేరణపొంది వారూ చదువుకు సుముఖత చూపుతారు. అలాంటి గురువులు ఆచార్యులు అనబడతారు. ఎన్ని జన్మలో మనం తహతహలాడితే మనకిలాంటి గురువులు దొరకుతారు. అలాంటి గురువు ఎవరికి దొరికాడు? దుర్యోధనుడికి దొరికాడు. ద్రోణాచార్యుడి లాంటి వాడని తెలుసు. అలాంటి గురువు దగ్గర ఏ విదంగా మాట్లాడుతున్నాడు? వినయంగా ఆచార్య అంటున్నాడు ఆచార్య అంటే మనకు వినటానికి బాగుంది. గురువును శ్రద్ధ పిలిచాడు. కాని మాటలో ఏమి స్వారస్యం లేదు. ఎందుకో చూడండి. 'పశ్యతాం' అన్నాడు. ఇదిగో ఎదురుగుండా నిలుచుని ఉన్న ఈ సేనను చూడు అన్నాడు సరే చూశాం తరువాతేంటి అంటే పాండు పుత్రాణా మా చార్య అంటున్నాడు.

(ఇంకా ఉంది)



ఎంత ధనం సంపాదించినా మనిషికి 'తృప్తి' ఉండదు

పురాణ వాఙ్మయం

# ఉదంకోపాఖ్యానం - గురుశిష్య సంబంధం

- శ్రీ పాలకుర్తి రామమూర్తి

మహాభారతంలో ఉదంకోపాఖ్యానం... ప్రముఖమైనది. ఉదంకుడు పైలమహర్షి శిష్యుడు. గురుశుశ్రూష చేసి అణి మాది సకల విద్యలనూ అభ్యసించాడు. ఆశ్రమాన్ని విడిచి వెళ్ళే సమయం వచ్చింది. గురువు వద్దకు వెళ్ళి గురుదక్షిణ నిచ్చు కుంటానన్నాడు. మమకారాదులు లేని గురువులకు ఆత్మార్పణ బుద్ధిచే విద్య నభ్యసించిన శిష్యుడు సమర్పించు కునే కానుకయే "గురుదక్షిణ", గురువు ఆ "గురుదక్షిణ"ను వద్దన్నాడు. శిష్యుడు కాదు, కూడదు ఇస్తానని అన్నాడు..

గురువు నిరీహుడే ఐనా తన భార్యకు చిరకాలంగా ఒక కోరిక ఉంది. పౌష్యుడనే రాజు భార్య ధరించే కుండలాలు తెప్పించమని తన నడుగుతూ ఉంది. తాను తాత్సారం చేస్తున్నాడు. ఇప్పుడు శిష్యుడు "గురుదక్షిణ" నిచ్చేందుకు ముచ్చట పడుతున్నాడు. అతనికి ఆ పనిని అప్పగిస్తే, మంచి ఆలోచనయే. కాని అందులో ప్రమాదం దాగి ఉంది. శిష్యుని అత్యు త్సాహం వల్ల అతనికేదైనా జరగకూడనిది జరిగితే? అలాంటి పరిస్థితి వస్తే తాను వెన్నంటి యుండి అతడిని కాపాడగలడు. అంతేకాదు తనకు శిష్యుని సమర్థత తెలుసు. అందుకే సరే అన్నాడు.

తాను చేయాల్సిన పని ప్రధానమైనది కానప్పుడు, ఆ పనిని తానే చేయాల్సిన అవసరం లేనప్పుడు ఉత్సాహవంతుడైన శిష్యుడు (అనుచరుడు) ముందుకొస్తే ఆ పనిని అతనికి అప్పగించడం మంచిది.

ఇందువల్ల, పైలునికి రెండు ప్రయోజనాలు నెరవేరుతాయి. మొదటిది, తన భార్య కోరిక తీర్చిన వాడవుతాడు. రెండవది, లోకానికి తన శిష్యుని సామర్థ్యాన్ని పరిచయం చేయవచ్చు. గురువుకు పని నెరవేరుతుంది. శిష్యునికి అవకాశం వస్తుంది.

గురువు- ఫలితంపై కాక కర్తవ్యంపై దృష్టి పెట్టినవాడు. ప్రతి విషయాన్ని బుద్ధిచే విచారించి విశ్లేషణ చేసి, హృదయంలో భావోద్వేగ సంయమనతను సాధించి, ఆ స్పందనలను ఆత్మలో జీర్ణం చేసుకొని స్థిత ప్రజ్ఞతను సాధించిన వ్యక్తి. నిరవధిక తపోదీక్షలో సాధించిన విజ్ఞానాన్ని "ఎఱుక"గా పరిణతి చెందించుకోగలిగిన ధీశాలి. తన సాధనా బలాన్ని శిష్యులకు అందించి, వారిలోని సహజమైన సృజనాత్మకతకు పదును పెట్టి క్రొత్త మార్గములలో వారు నడిచేందుకు ప్రేరణనిచ్చిన నిత్య నూతన చైతన్యశీలి.

ఉదంకుడు భక్తితో గురువులను సేవించి జ్ఞానాన్ని పొందినవాడు. సహజంగా తనలో ఉండే తపనను గురు శుశ్రూషచే ద్విగుణీకృతం చేసుకున్నవాడు. "జ్ఞాత్వా కర్మాణి కుర్వీత" అనే విధానంతో తను చేసే పనిపై క్షుణ్ణమైన అవగాహనను ఏర్పరచుకొని ఫలితాన్ని అది ఎటువంటిదైనా ఎదుర్కొనగలిగే దృఢ సంకల్పం కలిగినవాడు.

అందుకే, నేర్చిన విద్యకు గురుదక్షిణ చెల్లించాలి అనుకుంటాడు ఉదంకుడు. గురువుకు కోరికలేమీ లేకపోవచ్చు. కాని అతడు సంతోషించే ఏదైనా పనిని సమర్థవంతంగా చేసి చూపడం శిష్యునిగా తన కర్తవ్యం. న్యాయం కూడా! అందుకే పైలుడు వద్దంటున్నా ఒత్తిడి చేస్తాడు ఉదంకుడు.

గురువు ఆలోచించాడు. శిష్యుడి ఉత్సాహాన్ని గుర్తించాడు. అందుకే సరేనన్నాడు. ఎప్పుడూ ఎన్నో విజయాలు సాధించి తన అంచనాలను మించి సామర్థ్యాన్నీ, పనితనాన్ని చూపాడు. శిష్యుడి కార్యదక్షత సమర్థత తనను ముగ్ధుణ్ణి చేసింది. ప్రస్తుతం అప్పగించాల్సిన పనిలోని లోతుపాతులు తనకు తెలుసు. శిష్యుడు స్వయంగా విజయం సాధిస్తే మంచిదే! కాని, అపజయం పాలయితే కృంగిపోతాడు. గురుకార్యం నిర్వహించలేదనే బాధతో క్రుగ్గిపోతాడు. అది తనకిష్టం లేదు. అందుకే అన్ని ముందు జాగ్రత్తలు తీసుకున్నాడు. శిష్యుడికి గడువు విధించాడు. నేటికి నాలుగవ రోజున తిరిగి రావాలని చెప్పాడు.

ఉదంకుడు ఒంటరిగా బయలుదేరాడు. తనలో ఉత్సాహం ఉంది. సాధించాలనే తపన ఉంది. ఫలితాన్ని పూర్తిగా తాను అనుభవించాలనే ఆరాటం ఉంది.

గురువు శిష్యుణ్ణి పరిశీలిస్తున్నాడు. ఒంటరిగా వెళ్ళే శిష్యుడి వెంట తన మిత్రులైన ఇంద్రుడిని, అగ్నినీ, వరుణుడినీ ప్రచ్ఛన్నంగా వెంబడించమని పంపాడు. ఉదంకుని మార్గంలో వారు నిలిచారు. ఉదంకుడు వారిని చూచాడు. వారి తేజో వికాసాలకు ఆకర్షితుడయ్యాడు. భక్తితో నమస్కరించాడు. వారు కార్యసిద్ధి పొందమని దీవించారు. వివరాలు తెలుసుకున్నారు. సమయాభావాన్ని గడిచేందుకు అక్కడి వృషభ-గోమయ భక్షణ చేయమన్నారు. ఉదంకునిలో సందిగ్ధత. సంకల్పం నెరవేరాలి అంటే త్వరగా వెళ్ళాలి. తనపై తనకున్న నమ్మకం వల్ల, వారు పన్నిన గోమయ భక్షణ చేసాడు. పౌష్యుని పట్టణం చేరి, సభలో ప్రవేశించాడు.

పౌష్యునిచే సత్కరింపబడి తానువచ్చిన కార్యం చెప్పాడు. పౌష్యుడు కుండలాలు ఇస్తానన్నాడు. కాని ఉదంకుని అర్హతను పరీక్షించతలచాడు. ఆ ఉదంకునితో 'సరేనయ్యా ఇస్తాను, కానీ నా ధర్మపత్ని అంతఃపురంలో ఉంది. నేను చెప్పానని చెప్పి కుండలాలు తెచ్చుకోమని' పంపించాడు. ఉదంకుడు అంతఃపురం చేరాడు. రాజపత్ని కనిపించలేదు. ఆ విషయాన్నే మళ్ళీ వచ్చి పౌష్యునికి చెప్పాడు. దానికి నవ్వుతూ పౌష్యుడంటాడు. "నీవు చూస్తే పవిత్రుడి లాగా కనిపిస్తున్నావు. నా భార్య అపవిత్రులకు కనిపించదు. ఇది ఎలా సాధ్యం?" అంటాడు.

ఉదంకునికి ఒక కార్యం అప్పగించడింది. అంతా సవ్యంగా నడుస్తుందనుకున్న సమయంలో అపశృతి. ప్రయత్న లోపం లేదు. అయినా ఫలితం రాలేదంటే లోపం ఎక్కడో ఉందనేది స్పష్టం. కాని ఎక్కడ ఉందో తెలియడం లేదు.

తాను అపవిత్రుడయ్యేందుకు తానొనరించిన గోమయ భక్షణయే కారణం అని గ్రహించాడు. నీటిచే పాదప్రక్షాళనాదులు ముగించి ఆచమించి, మంత్రోచ్ఛారణచే పునీతుడై, తిరిగి అంతఃపురం చేరాడు. రాజపత్నిని దర్శించి ఆమెచే పూజింపబడి ఆమె ఇచ్చిన కుండలాలు గ్రహించాడు ఉదంకుడు. కుండలాలను ఇస్తూ పౌష్యుని భార్య ఉదంకునితో "ఈ కుండలాలు తస్కరించాలని, తక్షకుడు కాచుక్కూర్చున్నాడు. అప్రమత్తుడవై జాగ్రత్తగా వెళ్ళు" అని అంటుంది.

ఉదంకునిలో ఆనందం. ఫలితం చేతికందింది. కుండలాలను గురుపత్ని కందించడమే తరువాయి. రాజదంపతుల వద్ద సెలవుకోరాడు. వారు భోజనం చేసి వెళ్ళమన్నారు. ఉదంకుడు సరేనన్నాడు. చేస్తున్న భోజనంలో వెంట్రుక వచ్చింది. ఉదంకుని ఆనందం కోపంగా మారింది. పరీక్షించని భోజనం పెట్టావు కాబట్టి అంధుడవు కమ్మని పౌష్యుని శపించాడు ఉదంకుడు.

భోజనం తయారు చేసింది వంటవాడు. వడ్డించింది పనివారు. శపింపబడింది యజమాని. ఒక కర్మాగారం ఉంది. ఎవరో చేసిన ఏదో తప్పిదం వల్ల ప్రమాదం జరిగింది. యజమాని శిక్షింపబడ్డాడు. వ్యవస్థలో లోపం లేకుండా చూసుకోవలసిన బాధ్యత యజమానిది. ఎవరు ఎక్కడ సమర్థులో

## మాట తీరు ఎలా ఉండాలంటే...

'సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్,
నబ్రూయాత్ సత్యమప్రియం
ప్రియం చ నానృతం
బ్రూయాత్ ఏష ధర్మః సనాతన'

**"సత్య వాక్కులు పలకాలి, ప్రియమైన మాటలు పలకాలి. సత్యమైనప్పటికీ అప్రియమైన, అంటే బాధలు కలిగించే మాటలు చెప్పకూడదు. ఇదే 'సనాతన ధర్మం'." అని పురాణాలు చెబుతున్నాయి.**

**మాట అర్థవంతమైనది, శక్తివంతమైనది అయి ఉండాలి. దాని వలన దేవతలు ఆశీర్వదించి వరాలు ఇస్తారు. రాజులు బహుమానాలు ఇస్తారు. దూరపు వాళ్ళు దగ్గర అవుతారు. అంటే ఏదైనా సాధించాలంటే మాటతీరే ముఖ్యం.**

'ఏకః శబ్దః స్వరతో వా ....' **అక్షరంలో గాని, పలకడం లో గాని, తప్పులు మాట్లాడితే అర్థానికి బదులు అనర్థాలు ఏర్పడతాయి. అందుకే పలికే మాటకి తోడు, పలికే తీరుకీ ప్రాధాన్యత ఇవ్వాలి.**

**అందుకే-**

'అనుద్వేగకరం వాక్యం,
సత్యం ప్రియ హితం చ యత్
స్వాధ్యాయప్యసనంచైవ
వాంగ్మయం ఉచ్యతే'

**నొప్పించకుండా మాట్లాడటం, నిజం పలకడం, మేలు జరిగే మాటలే పలకడం, అనేవి 'వాచక తపస్సు' అని శాస్త్రాలు చెబుతున్నాయి.**

గుర్తించి వారిని అక్కడ వినియోగించుకోవలసిన బాధ్యత యజమానికుంటుంది. ఆ బాధ్యత నిర్వహణలో లోపం ఏర్పడితే యజమాని ఫలితం అనుభవించవలసిందే.

ఈ పరిణామానికి పౌష్యుడు కూడా కోపగించాడు. చిన్నదోషానికి శపించిన ఉదంకుని 'సంతానహీనుడు' కమ్మని ప్రతి శాపం ఇచ్చాడు.

విజయాన్ని కాంక్షించేవాడు భావోద్వేగాలను అదుపులో పెట్టుకోగలిగి ఉండాలి. లేని నాడు అనర్థాలు తప్పవు.

ఉదంకుడు తపస్సు చేసాడు. విజ్ఞుడయ్యాడు. కాని చిన్నతప్పుకు కోపించి రాజును శపించి ప్రతిశాపాన్ని పొందాడు. క్షమాగుణం ప్రదర్శించియుంటే అనపత్య దోషం అంటేది కాదు.

ఇక్కడ మరొక పరిశీలనాంశం ఉంది. పౌష్యుని వల్లే కుండలాలు లభించాయి. అతని వల్లే గురుదక్షిణ చెల్లించే అవకాశం వచ్చింది. అలాంటి వాడిని భోజనం పెట్టిన వాడిని శపించడం ఎంతవరకు సమంజసం. ఉపకారికి ఉపకారం చేయకపోయినా, అపకారం చేయడం ధర్మం కాదు. అందుకే చేసిన దానికి ఫలితం అనుభవించాడు ఉదంకుడు. సాధించిన విజ్ఞానం సంస్కారాన్ని ఇవ్వలేకపోతే చెడు ఫలితాన్ని అనుభవించవలసిందే.


తదుపరి పౌష్యునిచే ప్రార్థింపబడి అతని శాపానికి నివృత్తినిచ్చి వెళతాడు ఉదంకుడు. అలా వెళుతూ ఒక చెరువు తీరాన శుచి ప్రదేశమున కుండలములను పెట్టి ఆచమించాడు ఉదంకుడు. ఆ సమయంలో నగ్నవేషధారియైన తక్షకుడు ఆ కుండలాలను దొంగిలించి పాతాళలోకంలో దాక్కున్నాడు.

కుండలాలు తన చేతికి వచ్చాయి. కొద్దిదూరం వెళితే సమయానికి కుండలాలను గురుపత్నికి అందించవచ్చు. ఆ భావనయే అతనికి సంతోషాన్ని ఇచ్చింది. విజయానికి చేరువ కాగానే అతనిలో సంతోషంతో పాటుగా ఏమరుపాటు కూడా చేరింది. పౌష్యుని భార్యచే ముందే హెచ్చరించబడినా, అతడు ప్రమత్తుడై చెరువు వద్ద కుండలాలను పెట్టడం వల్ల తక్షకుడా కుండలాలను హరించ గలిగాడు.

తక్షకుని వెంట ఉదంకుడూ పాతాళానికి చేరాడు. తక్షకుడు అక్కడ కనిపించలేదు. ఏం చేయాలో తోచలేదు. నాగపతులందరిని పేరు పేరునా స్తుతించాడు. ఎవరూ వినిపించుకోలేదు. మంత్రాలకు చింతకాయలు రాలవు కదా! ఫలితం అనుభవించాల్సిన వేళ నేలపాలయింది. దిక్కుతోచక నాగలోకంలో ఒక పురుషుడు కనిపించాడు. అతని వద్దకు వెళ్ళి ఉదంకుడు భక్తితో ప్రణమిల్లాడు.. ఆ దివ్యపురుషుడు ప్రసన్నుడై ఏం కావాలో కోరుకోమన్నాడు. ఉదంకుడు తనకా నాగలోకం సమస్తం వశం కావాలని కోరాడు. అలాగే అన్న ఆ పురుషుడు అక్కడ ఉన్న గుర్రం చెవిలో ఊదమన్నాడు.

అలా చేయడంతో పాతాళలోకం అంతా గగ్గోలు పడింది. ఉదంకుని ముందు తక్షకుడు ప్రత్యక్షమై కుండలాలు ఇచ్చాడు.

ఉదంకునిలో సందేహం, కుండలాలయితే వచ్చాయి కాని, సమయం అయిపోయింది. ఎక్కడి నాగలోకం? ఎక్కడి పైలుని ఆశ్రమం? తాను చేరేదెట్లా? ఆరోజు గురుపత్ని కుండలాలు ధరించాల్సి ఉంది. ఆలోచనలో పడ్డాడు ఉదంకుడు. అతని ఆలోచనను గ్రహించిన దివ్యపురుషుడు తన గుర్రంపై వెళ్ళ మంటాడు. ఉదంకుడు ఆ దివ్యపురుషునికి నమస్కరించి ఆ గుర్రంపై బయలుదేరి సరైన సమయానికి గురుపత్నికి కుండలాలను అందించగలుగుతాడు.



ఈ విధంగా ఉదంకుడు తన గమనంలో ఎదురైన అడ్డంకులను అధిగమించి తన గురువైన పైలునికి గురుదక్షిణ సమర్పించి ఆదర్శప్రాయుడైనాడు.

గృహలక్ష్మి

# తల్లిదండ్రులు - తనయుల సంబంధాలు

- శ్రీ చివుకుల రమాకాంతశర్మ

తల్లిదండ్రులను ప్రత్యక్ష దైవాలుగ భావించి, వారికి విధేయులై ప్రవర్తించమని రామాయణం కూడ హితవు చెప్పింది. "యతో మూలం- ప్రత్యక్షే సతి దైవతే" ప్రత్యక్ష దైవస్వరూపుడైన తల్లిదండ్రుల ఆజ్ఞను పరిపాలించే వారెవ్వరూ చెడిపోరని వాల్మీకి సందేశం. దైవంగా భావించే నా తల్లి-తండ్రి ఆజ్ఞను నేను తప్పక నెరవేరుస్తాను. దేవతలకు సైతం తల్లితండ్రే దైవం అనేది శ్రీరాముని నిర్ణయం.

తల్లిదండ్రులు ధర్మానికి ప్రతిరూపాలు. వారిలో ప్రథమ గురువు తల్లి. తల్లిదండ్రులు అమృతహృదయులు. వారు తనయుల బాగు ఎల్లప్పుడూ కోరుకుంటారు.

రామలక్ష్మణ, భరతశత్రుఘ్నులు నలుగురు ఒకే తల్లి గర్భవాసంలో జన్మించకపోయినా అన్యోన్యత, ఆప్యాయతలతో ధర్మబద్ధంగా నడుచుకున్నారు. నలుగురిలో ఎవరూ గాని కౌసల్య, కైకేయి, సుమిత్రలను మారు తల్లులుగా, సవతి తల్లి భావన వారి మనస్సులో లేకుండా ముగ్గురిని సమభావనతో తల్లులుగానే వాత్సల్యం ప్రదర్శించేవారు. సుమిత్రాదేవి తన ఇద్దరు కుమారులలో లక్ష్మణుణ్ణి రాముని సేవలకును, శత్రుఘ్నుని భరతుని సేవలకును వినియోగించిన త్యాగమూర్తి.

కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన శ్రీమద్రామాయణ కల్పవృక్షం గ్రంథంలో తల్లి, తనయుల అనుబంధాన్ని ఎంతో చక్కగా వర్ణించారు.

శ్రీరామచంద్రుణ్ణి విడిచి కౌసల్య ఉండలేదు. శ్రీరామ భద్రుణ్ణి విడిచి కైకేయి ఉండలేదు.

శ్రీరఘుకుల రత్నాన్ని విడిచి లక్ష్మణుడుండడు. శ్రీరామ లక్ష్మణులున్న చోటనే సుమిత్ర ఉంటుంది.

దశరథమహారాజుకు, ఆయన ముగ్గురు భార్యలకు రామునిపై మమకారం, ముద్దు, మురిపెములు ఎక్కువగా తద్వారా ఉన్నవనే సందేశం మనసు తెలుస్తుంది.

తల్లిదండ్రుల పట్ల తనయుడు విధేయతతో నడచుకోవటమే మానవ ధర్మమని, సనాతన ధర్మమని, సన్మార్గమని అనేక విధాలుగా వాల్మీకి వ్యక్తపరిచాడు. 'మాతా, పితృవాక్య పరిపాలన' అనే ధర్మాన్ని పూర్వులు కూడా అంగీకరించినదే, ఆచరించినదే.

మాతా పిత పాదసేవాభాగ్యంలో దాగివున్నది మాధవ సేవే. ఈ సత్యం అనుభవంలోకి వచ్చి పరమేశ్వరుణ్ణి పొందే అవకాశం కూడ కలిగిస్తుంది. తల్లి-తండ్రి, తనయుల మధ్య అవినా భావ సంబంధాలు ఆరోగ్యకరంగా ఉండాలి.

రాముడు అరణ్యవాసంలో నున్న సమయంలో తల్లుల ముగ్గురి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ ఉండేవాడు. తల్లులకు ఎటువంటి కష్టాలు కలుగకుండా జాగ్రత్త వహించమని భరతుణ్ణి ఆదేశించేవాడు. భరతుడు తన తల్లి కైకేయిని దూషించ గూడదని, తల్లి మనసు బాధకు గురిచేయ గూడదని హెచ్చరికలు చేసేవాడు రాముడు. లక్ష్మణుడు గూడ అరణ్యాలకు సీతారాములతో వెళ్లే సమయంలో తన తల్లి సుమిత్రకు చెప్పి ఆజ్ఞ తీసుకుని, ఆశీస్సులు స్వీకరించి రఘువంశ రాజుల సదాచారాన్ని పాటించాడు.

పూర్వపు మహాపురుషుల, రాముని సోదరులవంటి సేవాభాగ్యమే కుటుంబ వ్యవస్థకీ, వంశాభివృద్ధికి, సమాజానికి, దేశానికి ఎంతో మేలు చేస్తుంది. శాంతి చేకూరుస్తుంది. అథర్వ వేదంలో కుటుంబసభ్యుల మధ్య అనురాగం గురించి ఇలా వివరించటం జరిగింది.

ఓం మాభ్రాతా భ్రాతరం ద్విక్షన్ మా స్వసారముత స్వసా।
సమ్యం చ న వ్రతా భూత్వా వాచం వదత భద్రయా॥
(అథర్వవేదం)

అన్నదమ్ముల మధ్య వైర భావం, ద్వేషం ఉండరాదు. అక్కచెల్లెళ్ళు ద్వేషించుకో గూడదు. కుటుంబ సభ్యులంతా అనురాగ సూత్రంలో ముడిపడి ఉండాలి. వేదధర్మం నాటికి, నేటికి, ఏనాటికి నిత్యమే! సత్యమే!!! శాశ్వత హితబోధ అన్ని యుగాలకు, అన్ని కాలాలకు, అందరికీ అన్వయిస్తుంది. నవ తరానికి, యువతరానికి రామాయణంలోని సోదరప్రేమ ఆదర్శం, ఆచరణీయం. వైదిక సంస్కృతికి ప్రతీకలే రామ లక్ష్మణులు. ప్రసిద్ధ గ్రంథమైన రామాయణం తల్లిదండ్రులను గౌరవించాలని వారిని అభిమానించాలని ఆప్యాయతతో కలిసి జీవితాన్ని సాఫల్యం చేసుకోవాలని మనకు ప్రబోధిస్తుంది.



భగవంతుడు మనిషి భావనలోనే ఉంటాడు




# పరమభక్తునిగా.. మలుచుకున్న స్వామి!

– డా॥ గణగళ్ళ విజయకుమార్

నేను చవిచూసిన శ్రీవేంకటేశ్వరుని అద్భుత లీలలు చెపితే కొందరికి నమ్మశక్యం కాదేమో.... నేను అనుభవించిన లీలల్లో ప్రధానంగా ఒకటి మీ ముందు వ్యక్తం చేస్తున్నాను.

సరిగ్గా 25 ఏళ్ల క్రితం భగవంతునిపై నమ్మకం ఉండేది కాదు. 'మానవ సేవే మాధవ సేవ' అని సూక్తిని నమ్మి నాకు గుడికెళ్లటం, కొబ్బరికాయలు కొట్టటం అంటే చిన్న చూపు చూసే వాడిని.

ఇలాంటి పరిస్థితుల్లో అదే శ్రీవారు నాకు కలలో కనిపిస్తూ ఉండేవారు. కాకతాళీయంగా నా పదేళ్ళ వయసులో ఒకసారి తిరుమలలో స్వామి వారిని దర్శించుకోవడం జరిగింది. తదుపరి నాకు 22 ఏళ్ల వయసులో శ్రీవారు గర్భగుడిలో నిలువెత్తు రూపం దగదగ వెలుగుల మధ్య నాకు స్వప్నంలో దర్శనమిస్తుండేవారు.

క్యాలెండర్లు, ఫోటోలతో ఎంతోమంది దేవుళ్ళ చిత్రాలను చూసిన నాకు శ్రీవేంకటేశ్వరుడే పదే పదే కలలో కనిపించడం ఏమిటి? అన్న సందేహం కలిగి సరే ఒకసారి తిరుమల వెళ్లి స్వామివారిని దర్శించుకుందాంలే అని నిర్ణయించుకుని రైల్వే స్టేషన్‌కు టిక్కెట్టు బుక్ చేసుకుందామని బయలుదేరాను.

మధ్యలో రోడ్డు మధ్య నా వాహనంతో సిగ్నల్ దాటబోతుండగా ఎదురుగా నా పరిచితుడు వచ్చి ఎన్నాళ్లగానో నాకు ఇవ్వాల్సిన నగదుని వడ్డీతో సహా నా చేతిలో పెట్టేసరికి ఆశ్చర్యం కలిగింది.

తిరుపతికి బయలుదేరుతున్నానని తెలిసి నా భార్య భవాని పూజగదిని అందంగా తయారు చేసింది. దీపం వెలిగిద్దాం అని అగ్గిపెట్టె కోసం వెతుకుతుంటే ఐదేళ్ల క్రితం నాటి నా జీతం కవరు స్వామి పీఠం క్రింద దొరికింది. నా తొలి జీతం డబ్బు కవరులో పెట్టి స్వామి పాదాల పీఠం క్రింద పెట్టిన గుర్తు నా భార్య. మేము ఎప్పుడో మరచిపోయాం. ఈ సంఘటనతో షాక్ అయ్యా. స్వామి దర్శనానికి ముందే చేతికి రాదనుకున్నా డబ్బు వడ్డీతో సహా వసూలైయింది... ఎన్నడో పెట్టి మరిచిపోయిన నగదు కనిపించటంతో ఆశ్చర్యం కలిగింది.

ఇంకా నా జీవితంలో స్వామిని నమ్మిన తర్వాత అనేక అద్భుతాలు జరిగాయి. ఇప్పుడు నేను స్వామికి పరమభక్తునిగా మారి పదుల సంఖ్యలో స్వామివారి దర్శనానికి నాతో పాటు ఎందరినో పేదవారిని ఉచితంగా తీసుకెళ్తున్న సంఘటనలు నేటికీ తరచుగా జరుగుతున్నాయి.



## మనవంతు సాయం!

దారిలో అంబులెన్సు వాహనం వచ్చినప్పుడు...
దానికి దారి వదిలి, మీవంతు సహాయం చేయండి!
అందులోని రోగికి ఆరోగ్యం మెరుగుపడాలని...
మనసారా 'శ్రీవేంకటేశ్వరస్వామి'ని వేడుకోండి!!



# ఉన్నతి, పురోగమనం ప్రతి జీవికి లక్ష్యం

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ

**"ఆరోహణమాక్రమణం జీవతో జీవతోయనం" - అథర్వవేదం**

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే – అనే తీరు వ్యక్తి అభి వృద్ధికి అవరోధం. ఏ పని చేపట్టామో, ఏ రంగంలో ఉన్నామో అందులో ఉన్నతి సాధించాలి, పురోగమించాలి. అందుకు ధార్మికమైన, సువ్యవస్థితమైన కృషి అవసరం.

సృష్టిచక్ర నిర్వహణ కోసం ఒక్కోవ్యక్తికీ ఒక్కో సామర్థ్యం, ఒక్కోపనీ, దానిని నిర్వహించే బుద్ధీ, అందుకు తగ్గ వ్యవస్థ అతడికి స్వాభావికంగానే భగవంతుడు ఏర్పరుస్తాడు. ఈ విశ్వచక్రంలో ప్రతి అణువూ సార్థకమే, చైతన్యభరితమే. వృథా ఏదీలేదు.

'ఇదిచాలులే', 'ఇంతచాలులే' – అనే ఉదాసీన వైఖరి మనిషికి ఉండకూడదు. ఆ ఉదాసీనత వైఫల్యానికి హేతువౌ తుంది.

తానుచేసే పనిపట్ల పూర్తి అవగాహన, అధ్యయనం, దీక్ష, క్రియ... అనేవి ముఖ్యం. నిరంతర ఆచరణ, గమన శీల మైన చైతన్యానికి చిహ్నం. ఆ చైతన్యం పని చేసేది ఒక ఉన్నతత్త్వాన్ని లక్ష్యంలో ఉంచుకొని. అయితే "లక్ష్యం ఉన్నతంగా ఉండగానే సరిపోదు" అని ఈ వేదవాక్యంలో రెండో శబ్దం (ఆక్రమణం) – 'పురోగమనం' సూచిస్తోంది.

అంటే 'నిరంతరం ముందుకు వెళ్లడం' అని అర్థం. వెనుతిరగని ధృతితో, ఆత్మ సంయమనంతో అవాంతరాలను దాటుకుంటూ సాగడమే 'ఆక్రమణం' – పురోగమనం.

ఇప్పుడున్న దానికన్నా ఉన్నతి, ఇప్పుడు చేస్తున్న దానికన్నా విశేషకృషి... ఈ రెండూ మనిషికి లక్షణంగా మారితే విజయం తథ్యం. వేదసంస్కృతి ముక్కు మూసుకుని మూల ముడుచుకోవడాన్ని బోధించడం లేదు. 'ఉత్తిష్ఠత' అని మేలు కొలిపింది.

> **"పరుషంగా మాట్లాడే వారిని...**
> **లోకం అసహ్యించుకుంటుంది.**
> **మధురంగా మాట్లాడే వారిని..**
> **అందరూ ఇష్టపడతారు"**

ఇలాంటి వాక్యాల ద్వారా అడుగడుగునా మనలోని చైతన్యాన్ని సక్రమంగా సముజ్జ్వలంగా వినియోగించుకొని భూమిని ఐశ్వర్యవంతంగా, సర్వసమృద్ధిగా, ఆనందధామంగా మలచుకోవాలి.

ఐతే, ఇందులో వదల కూడనిది 'ధార్మికత'. ఈ ధార్మికతకి మూలం దైవశక్తిపై విశ్వాసం. దీనిలో కలగలిసిన కర్తవ్యనిష్ఠను వేద మాత ప్రతిచోటా ప్రబోధిస్తోంది. పురోగమనం అంటే– ఉన్నధర్మాన్నీ, సంప్రదాయాల్నీ విడిచిపెట్టేసి కొత్తవేషాలు వేయడం కాదు. ధర్మాన్ని మునుపటి కన్నా అధికశ్రద్ధగా ఆచరించడమే పురోగమనం.

పైగా– జీవితంలో ఎప్పటికప్పుడు ఒక రోజుకన్నా మరొకరోజు ఉన్నతంగా గడవాలి. నిన్నకన్నా మరొక రోజు ఉన్నతంగా గడవాలి. నిన్నకన్నా నేడు గొప్పగా ఉండాలి. నేటికన్నా రేపు బాగుండాలి. క్రమంగా విలువలు తరిగిపోవడం కాదు. పెరుగుతూ వెళ్లాలి.

ఆత్మ ఔన్నత్యమే మన సంస్కృతిలో పరమలక్ష్యం. ధర్మాచరణలో శ్రద్ధ నిరంతరం అభివృద్ధి చెందుతూ సాగాలి. తమ జీవితకాలంలోనే కాక, తమ తరువాతి తరంవారు తమ కన్నా ఎక్కువగా ఈ ధార్మికనిష్ఠను కొనసాగించాలి. ఇలా కాల క్రమంలో ధర్మాచరణ క్రమంకూడా పెరగాలి. అది పురుష ప్రయత్నాల సార్థక్యం.

మానవజీవన లక్షణమే నిన్నటికన్నా నేడు బాగుండాలని కోరుకోవడం. ఆ 'బాగు' ధార్మికమైన విశ్వశ్రేయస్సు కావాలన్నది వైదిక ఆకాంక్ష.

సృష్టిలోనున్న ఐశ్వర్యాన్ని 'విశ్వశ్రేయస్సు' అనే దిశగా వెలికితీసి, తమ తమ మేధస్సులతో సద్వినియోగం చేసే మానవులున్నప్పుడు, ఆ దేశానికి అంతకన్నా కావలసిందేముంది! భారతీయ సంస్కృతికి అటువంటి మనిషే వారసుడౌతాడు.



## హరిదాస వాఙ్మయంలో...

# శ్రీవేంకటాచలాధీశుడు 11

– శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం...*

"సణ్ణవ నెందు నా నీరు తారెందరె
బెణ్ణె కళ్ళ క్రిష్ణ మరుళుమాడి ।
చిన్నద గిండిలి నీరన్ను తందరె
కణ్ణుకాణదె నాతోణదె ఫండరిరాయ"

(చిన్నవాడని నాడు నీరు తెమ్మని పిలిచిన హే కృష్ణ నీవు బంగారు చెంబులో నీళ్లు తెచ్చియిచ్చితివి గదయ్యా)

"అప్పణ్ణ భాగవతన రూపవు తానాగి
తుప్పద బిందిగె తంద సర్పశయనన" ॥

(అప్పణ్ణ భాగవతుని రూపమున నాడు తానుగా నేతిని తీసుకొని వచ్చినవాడవు గదా)

"సణ్ణవ నెందు నా నీరు తారెందరె
బెణ్ణె కళ్ళ క్రిష్ణ మరుళుమాడి ।
చిన్నద గిండిలి నీరన్ను తందరె
కణ్ణుకాణదె నాతోణదె ఫండరిరాయ"

(చిన్నవాడని నాడు నీరు తెమ్మని పిలిచిన హే కృష్ణ నీవు బంగారు చెంబులో నీళ్లు తెచ్చియిచ్చితివి గదయ్యా)

"అప్పణ్ణ భాగవతన రూపవు తానాగి
తుప్పద బిందిగె తంద సర్పశయనన॥"

(అప్పణ్ణ భాగవతుని రూపమున నాడు తానుగా నేతిని తీసుకొని వచ్చినవాడవు గదా)

భక్తసులభుడు, హరిదాసుల కొంగుబంగారమైన వేంకటేశ్వరస్వామిని తమ జీవితములో అనేక పర్యాయములు దర్శించుకొనిన పురందరదాసుల వారు కంటిముందు తిరుమల క్షేత్రమును, క్షేత్రాధిపతి శ్రీనివాసుని, ఆతని ఆలయము, పరిసరము, పుష్కరిణి మొదలగు దృశ్యములను శబ్దజాలములచే నిలిచేటట్లు చూపించినారు. పురందరదాసులవారి కీర్తనలో శ్రీవేంకటేశ్వరునికి సంబంధించినవి సుప్రసిద్ధములైన 'దాసన మాడికో ఎన్న స్వామి సాసిరనామద వేంకటరమణ' (నాదనామ క్రియ), 'శ్రీనివాసనీనే పాలిసో శ్రితజనాపాల' (ఆనందభైరవి), 'బారయ్య వేంకటరమణ' (సావేరి), 'వేంకటరమణ వేదాంత నిన్నయపాద' (అరభి), 'బందునింతిహనోడి' (మధ్యమావతి), 'దణియనోడిదేను' (కాపి), 'తిరుపతి వేంకటరమణ' (ఖరహరప్రియ) మొదలైనవి. ఇవేకాక 'శ్రీనివాసను ఒలియను కేళోజ్ఞానో పార్థనె మాడదలె', 'నా నేను మాడిదెనో వేంకటరాయ', 'కనను కండెనె మనదలి కళవళ గొండెనే', 'వేంకటరమణనె బారో', 'వేంకటేశ నిన్న నామక్కె', 'తప్పు గళెల్ల నీనొప్పికొళ్ళో', 'నిన్న నె నంబిదె నీరజనయన', 'కండె కండె స్వామియబేడి కొండె', 'పంకజముఖియరెల్లరు బందు లక్ష్మి వెంకటరమణగారుతి ఎత్తిరే'– ఈ పాటలు జనసామాన్యమున, సంప్రదాయ సంగీతజ్ఞులలోను వినబడుచుంటాయి. శ్రీనివాసభక్తిని హృదయంలో రేకెత్తించే ఈ కీర్తనలలో శ్రీనివాసుని తత్త్వము, శ్రీనివాసుని సార్వభౌమాధిపత్యము సర్వోత్తమత్వము సత్సిద్ధాంత సంప్రదాయము ననుసరించి యున్నది. పురందరదాసులవారు తిరుమలకు వచ్చి శ్రీవేంకటేశ్వరుని దర్శించికొన్న తర్వాత వారిలో కలిగిన భావనను ఇట్లు తెలిపియున్నారు. (ముఖారి)

"కండెకండె స్వామియ బేడికొండె ॥
కండె తిరుపతి వేంకటేశన కారణాత్మక సార్వభౌమన ।
కామితార్థగళీవదేవన । కరుణానిధి ఎందెనిసి మేరెవన ॥"

(చూచితిని, చూచితిని (కనుగొంటిని) స్వామిని, వేడుకొంటిని చూచితిని తిరుపతి వేంకటేశ్వరుని అతడు కారణాత్మకుడు సార్వభౌముడు కామితార్థములను ప్రసాదించే దేవుడు. కరుణానిధియని ప్రసిద్ధి పొందిన విఖ్యాతుడు).

"కోటి సూర్యప్రకాశవెనిప కిరీటవను మస్తకదికండెను ।
నోట కాశ్చర్యవాద నగెముఖనొసలొళగె తిరుమణి యకండెను ।
సాటి యిల్లద శంఖ చక్ర చతురహస్తదలిరలు కండెను ।
బూటకదమాతల్ల కేళిరో భూరిదైవద గండ సంప్రియ ॥

(కోటి సూర్యప్రకాశమైన కిరీటము తలపై, ఆశ్చర్యమును కల్గించే నగుమోముతోను కూడిన లలాటముపై ఉన్న

తిరుమణిని, చతుర్బాహులలో గల రెండు చేతులలో శంఖ చక్రములను ఇట్లు సకల దేవతలకు దేవుడైన వేంకటేశ్వరుని పాదపద్మములను చూచితిని).

“తప్పుకాణికె కప్పగళను సమస్త ద్వీపదలింద తరిసువ ।
ఉప్పు ఒగరగళనె మారిసి ఉచిత దిందలి హణవగళిసువ ।
ఇప్పత్తుదుడ్డిగెసేరు తీర్థవ ఒప్పదలి క్రయమాడి కొడిసువ ।
సర్పశయన సార్వభౌమన అప్పతిరుపతి వేంకటేశ ॥

(సమస్త ద్వీపములనుండి భక్తులు తెచ్చే కప్పకానుకలను గైకొనువానిని, దధ్యోధనాదులను భక్తులకు ప్రసాదించుటను తద్వార వారి నుండి కానుకలను స్వీకరించుటను మ్రొక్కుబడిగా సమర్పించే కానుకలను గ్రహించు సర్పశయనుడైన, సార్వ భౌముడైన అప్పడగు తిరుపతి వేంకటేశుని చూచితిని).

ఉరది శ్రీదేవియళకండెను ఉన్నతద కౌస్తుభవ కండెను ।
గరుడ కిన్నర నారదాది గంధర్వర ఎడబలదల్లి కండెను ।
తరతరది భక్తరిగెవరగళ కరెదు కొడువుదు నిరుత కండెను ।
శరధిశయన శేషగిరియ వరద పురందర విఠల నంఘ్రియ ॥

(స్వామి వక్షఃస్థలమున ప్రకాశిస్తున్న కౌస్తుభమణిని, శ్రీదేవిని, స్వామి కిరువైపుల భక్తి నమ్రాంగులై నిలబడిన గరుడ కిన్నర నారదాదులను, స్వామి ముందు భాగమున వివిధ భక్తు లను, వారిని పిలిచి వరముల నిచ్చుటను, మరియు శేషశయను డైన శేషగిరివాసుడైన పురందర విఠలుడైన శ్రీవేంకటేశ్వరుని, ఆతని పాదపద్మములను చూచితిని,)

## వైకుంఠపాళి

### :: 66 – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 దా | | 2 పో | పు | | 3 పో | 4 తు | | |
| రు | | డు | | 5 ఆ | | మ్మ | | 6 ధా |
| 7 కు | రు | | 8 ఆ | యు | డు | | 9 అ | త్రి |
| డు | | 10 స్మృ | | వు | | 11 నం | | క |
| | 12 కో | తు | లు | | 13 అ | ది | తి | |
| 14 కో | | లు | | 15 సు | | ని | | 16 మ |
| 17 మ | ది | | 18 కా | ర | ము | | 19 వా | ణి |
| లి | | 20 ఈ | | భి | | 21 నే | | పు |
| | | 22 తి | రి | | 23 ఆ | మి | | ష్పం |

తిరుమల కొండ, ఆ కొండపైనున్న గుడి, ఆగుడిలో ఉన్న గరుడ గంభము, జయవిజయులు, స్వామి దివ్యమంగళ విగ్రహము, ఆ దేవదేవుని సౌందర్యము, ఉత్సవాదులు, పాడు కొనేవారి కన్నులముందు, హృదయాకాశమున సదా నిలబడే నట్లు పాడిన ఈ కీర్తన ఎంత రసవత్తరమైయున్నది. (మధ్య మావతిరాగం).

బందునింతిహ నోడి । భూతళది వేంకట ।
ఒందిరెయ గుడగూడి । ఒప్పవ నిరంతర ।
పొంది భజనెయమాడి । ఆనందగూడి ॥ (బేడి)

(ఈ భూతలముపైకి లక్ష్మీదేవితో కూడి ఒప్పుతూ వేంకటేశ్వరుడు వచ్చి నిలబడియున్నాడు. ఆతని నాశ్రయించి భజించి ఆనందమును పొందుడు).

వందిసుత మనదొళగె ఇవనడి
ద్వంద్వ భజిసలు బంద భయహర ।
ఇందుధర సురవృందనుత గో-
వింద ఘనదయసింధు శ్రీహరి ॥

(మనస్సులో ఈతని పాదపద్మములను భజించడం వలన భయములు దూరమగును. ఇతడు శివేంద్రాది వందితుడు గోవిందుడు దయాసింధువు అయినవాడు, శ్రీహరి.)

“ద్వార దెడబలదల్లి । జయవిజయరిబ్బరు
సేరి సేవిపరల్లి । సనకాదినుతశృం
గార నిధి అంగదల్లి । ముత్తినలి హార శోభిపుదల్లి
విస్తార దల్లి ॥

వారవారకె పూజె గొంబువ । హారముకుటా భరణ కుండల
ధార భుజకేయూర భూషిత । మారపిత గుణ మోహనాంగ
చారు పీతాంబర కటి కర వీర కల్హారాది పూవిన ।
హార కొరళొళు ఎసెవుతిరెవద । నారవందను నగుతనలియుత”
॥ బంద ॥

(స్వామి గర్భాలయమునకు ముందు ఇరువైపుల జయ విజయులిద్దరు నిలబడి సేవించడం, సనకాదులచే స్తుతింపబడే (శ్రీనివాసుని) శృంగార దేహముపై జారగా ఉన్న ముత్యాల దండలు, అనునిత్యము జరిగె పూజలను గైకొనేవాడును, సువర్ణ కంఠాభరణములు, కుండలములు, భుజకిరీట, శిరోకిరీటములచే భూషితుడును, మన్మథ జనకుడును, సౌందర్యవంతుడును, కంఠ మందలి దండలు అందమును చిందిస్తూ ఉంటే నవ్వుతూ నిలబడి ప్రకాశించేవాడును).

(ఇంకా ఉంది)



ప్రాణులపట్ల దయ కలిగిన వాడే 'జ్ఞాని'



# వ్యాసుడు - వేదవిభాగము

- కీ.శే. కులపతి ఎక్కిరాల రామకృష్ణమాచార్య

ఆషాఢపూర్ణిమనాడు వేదవ్యాసుడుగా గురుపీఠమలంకరించిన పరాశరపుత్రుడగు కృష్ణద్వైపాయనుడు బ్రహ్మవాదులైన ఋషులతో గుహాముఖమున పద్మాసనాసీనుడయ్యెను. అర్ధరాత్రమున సత్యవతీదేవి జ్యోతిర్మూర్తియై వేదమయ దేహముతో సత్యవతియనబడు పశ్యంతీవాక్కుగా వారికి సమాధిలో దర్శనమిచ్చెను. గుహలోనికి వెడలిపోయిన పరాశరుడు పరావాక్కుగా వారందరికిని ఆత్మరూపమున అనుభూతుడయ్యెను. వ్యాసుడు మధ్యమా వాక్కుతో శ్రుతి గలిపి సరస్వతిగా వెలిగెను. మిగిలిన ఋషులను వైఖరీ వాక్కుగా స్పందింపచేసి వాగ్రూపుడై స్పృశించెను.

ఆ గుహాముఖము నుండి దిగువ లోయలమీదగా ప్రసరించు చున్న పున్నమి వెన్నెలలతో నిండిన యాకాశము దేశకాలాత్మకమైన గోళముగ గిర గిర తిరుగుచు వేదమయమైన అండముగా వారిని తన డొక్కలో నిలిపెను.

ఉత్తరదక్షిణ ధృవములు, ఉదయాస్తమయ సీమలైన తూర్పుపడమరలు దేశాత్మమైన నాలుగువేదముల సంహితగా వ్యాసుని మనస్సున విభాగము పొందెను. జీవుని గమనమైన శ్వాసను వ్యాసుడు సామవేదముగా వారికి దర్శనము చేయించెను. దానిని ప్రస్తారము చేయించి గాంధర్వమగు సంగీత విద్యను లోకమున వ్యాపింప జేయుటకై జైమినిమహర్షి నభిషేకించెను. జైమినికి దర్శనమందు సామవేదమొక వేణువు నుండి వెలువడుచున్నట్లు, సాగర వనపర్వతసీమలను మాధుర్యమున ముంచెత్తుచున్నట్లు పొడచూపెను. ఆ గానమునకు సంవత్సరమందలి పగలన్నియు తెల్లని ధేనువులై, రాత్రులు కపిలగోవులై పరుగెత్తి ఎవరినే వెదకుచున్నట్లు గోచరించెను.

ఋగ్వేదము కంఠనాదమైన ప్రణవముగా, వైఖరీ వాగ్రూపుడగు వ్యాసునకు ప్రసన్నమయ్యెను. దాని విభాగములను విస్తరింపజేయుచుని పైలుని ఆదేశించెను. పైలునకు ధ్యానమున ఆ కంఠనాదము ఆహతము, ఆనాహతము అను రెండు విధములుగా గోచరించి కాలగతిలో ఆహోరాత్రములుగా పనిచేయుచుండెను. అందు పగలు సూర్యరశ్మితో కూడిన సగమునకు ఇంద్రప్రమిత అని పేరుపెట్టెను. రాత్రి సగమునకు బాష్కలుడు అని పేరుపెట్టెను. ఆహోరాత్ర మూర్తులగు ఇద్దరును తెల్లని, నల్లని రూపముల తోడి ఇరువురు బాలకులుగా గోవుల మధ్య చరించుచున్నారు. అందు నల్లనివాడు వేణుగానముగా సామమును ప్రసరించుచున్నట్లు తెలివి కలిగెను.

పగళ్ళు వర్షఋతువున ధారాపాతమైన వర్షమునకు చెఱువులుగా, దొఱువులుగా నేర్పడుచున్నవి. వాని సమీపమున నిద్దరు బాలకులును తమ పరివారముతో తిరుగుచున్నారు. దొఱువులందు, చెఱువులందు కప్పలు బెకబెక లాడుచుండగా ఆ బాలకులు గంతులు పెట్టుచుండిరి. ఆ నల్లనివాడు తనచిందులతో కప్పుల బెక బెకలకు లయలేర్పరచి అనేక వైఖరులలో తాళములు మార్చుచు వేణువు నూరుచుండెను. అందుండి మాండూక్యమను వేదసంహిత విచిత్ర గీతికలతోడి ఛందస్సులుగా శాశ్వతలోకము నుండి వ్యక్తమయ్యెను.


ముప్పది గడియల వెన్నెల రాత్రిని నాలుగు సమభాగములు చేసి ఆ నల్లనివాడు మరల నాలుగు విధములైన సంగీతములతో వేణువు నూదెను. అందలి నాలుగు గతులకును బోధి సంహిత, ఆదిమాధవ సంహిత, యాజ్ఞవల్క్య సంహిత, పరాశర సంహిత యని పైలుడు నామకరణము చేసెను. మాండూక్య గతులయందు మనస్సు లయము చెందిన శకపూర్ణుడు, వేదమిత్రుడు అను ఋషులిద్దరును రెండు రూపములతో కాలరూపమైన వేదమును దర్శించిరి. అందు శకపూర్ణుడు అహోరాత్రముల యందలి కాలమానమును మూడు సమభాగములుగా నేర్పరచెను.

అందుండి మూడుపాదముల ఛందస్సులు పుట్టినవి. అందు ఒక్కొక్క పాదమును ఎనిమిది సమభాగములుగా విడదీసి గాయత్రీ ఛందస్సును గానముచేయు విధానమును ప్రకటించెను. ఆయిరువది నాలుగు పాదములకు మూడు విధములైన గమనములు కనిపెట్టెను. వానిని వరుసగా వైతాళికము, క్రౌంచము, బలాకము అని పేర్లు పెట్టెను. అందు వైతాళికము నుండి తాళగతులు లేని అలాపన గీతికలు పుట్టినవి. క్రౌంచము నుండి పుట్టిన గీత సంహితలు పఠించుచున్నపుడు కఱుజుపిట్టల కూతలవలె వినిపించుచుండెను. బలాకగీతములు ఆకాశమున కొంగలు బారులు తీర్చినట్లు మాత్రాగణ ఛందస్సులలో వివిధములుగా వెలువడినవి.

వేదమిత్రుడు అహోరాత్ర కాలగమనమును అయిదు సమభాగములుగా చేసెను. వానితోగూడిన యహూరాత్రీ పురుషుని పంచాయుధ ధారియైన వేద పురుషుడుగా దర్శించెను. అందైదింటి గాన విశేషములను వేరువేరుగా అయిదుగురు ఋషులకుపదేశించెను.

వారు ముద్గలుడు, గోముఖుడు, వాత్స్యుడు, శాలీయుడు, శరుడు అనువారు. ఈ అయిదు సంహితలును కాలక్రమమున మహాసంహితలనబడినవి. వానియందలి క్రమమున అధిలోకము, అధిజ్యౌతిషము, అధివిద్యము, అధి ప్రజము, అధ్యాత్మము అనబడు ప్రకరణములలో బ్రహ్మవిద్య సమన్వయింపబడినది. వేదమిత్రుడు కనిపెట్టిన మూడు విభాగములకు వరుసగా కాలయని, కథాజవుడు, గార్గ్యుడు ఆచార్యులయిరి.

జీవుల కాచరణీయమైన సత్కర్మరూపమున యజుర్వేదమును దర్శించి వ్యాసుడు వైశంపాయనునకు ప్రసాదించెను.



అతడు కాలస్వరూపమైన దినచర్యను యజుస్సుగా ధరించి అహోరాత్రములను ఇరువది ఏడు సమభాగములుగా చేసెను.

అది పద్య గద్యాత్మకమైన నక్షత్ర సంహితగా కూర్పుచేయబడెను. దానినుండి ఖగోళ పరిభ్రమణ విశేషములు ఋషిలోకమునకు వెదజల్లబడెను. కృత్తిక మొదలు భరణి వరకును గల నక్షత్రములు తన దేహ భాగములుగా నొక శిశువు రూపముదాల్చెను. అతడు అనంత కాలగుహలో నుండి వెలువడెను. గిరగిర తిరుగుచు తోడి బాలురతో వానవల్లపులాడుచు సంవత్సర పరిభ్రమణము చేసెను. ఈ మొత్తము విజ్ఞానమును స్వీకరించిన

యాజ్ఞవల్క్యుడు తన ముఖమునుండి తేజోరూపమున ఆ మొత్తమును వెడలగ్రక్కెను.

మిగిలిన ఋషులందరును ధ్యానమున దానిని గ్రోలు చుండగా తెల్లవారుజామున తిత్తిరి పక్షుల కూతలు వినిపించెను. ఆ తీతువుల కూతలతో లయ కలిపి నల్లని బాలకుడు మరి యొక వైఖరిలో వేణుగానము చేసెను.

అది ప్రళయాత్మకమైన వాతావరణమును పుట్టించెను. అహోరాత్రములు మున్నగు కాలమాన విభాగములు ఆయు ర్దాయ స్వరూపములైన ఛందస్సులుగా వెలువడి మరల నాదము లోనికి లీనమగుచుండెను. ఆ తిత్తిరిపక్షుల కూతల నుండి వెలువడిన తైత్తిరీయ మనబడు వేదసంహిత గద్యపద్యాత్మక మంత్రభాగ మయ్యెను.

సామవేదమున రూపమున కాలమానమును వ్యాసుడు జైమినిమహర్షి కుపదేశించెను. దాని గమనము ననుసరించి ప్రణవము నుచ్ఛ్వాస నిశ్వాసలరూపమున న్యాసము చేసి జైమిని మహర్షి ప్రాణాయామ మనుష్ఠించెను.

ఉచ్ఛ్వాసము నందు అయిదువందల మాత్రలు, నిశ్వాసమునందు అయిదువందల మాత్రలు కాలమానముగా జైమినికి సుదీర్ఘ సామమయ ఛందస్సులు గమనికకు వచ్చెను. అందుచ్ఛ్వాసమందలి అయిదువందల కాలమూర్తులును ఉదిత్య సామగులనియు, నిశ్వాసమందలి అయిదువందలును ప్రాచ్య సామగులనియు సంకీర్తింపబడెను.

అట్టి యుచ్ఛ్వాస నిశ్వాసముల జంట నొక్కొక్క దానిని ఒక్కొక్క హంసగా ఛందస్సులను కల్పించి జైమిని గగన యాననమునకు విడిచి పెట్టెను. వానిని మరల కూడదీసి గుంపులుచేసి ఇరువది నాలుగు సంహితులుగా దర్శించెను. అందు కృష్ణపక్షములుగా పంద్రెండు గుంపులు నల్లనివి, శుక్ల పక్షములుగా పంద్రెండు గుంపులు తెల్లనివి దర్శపూర్ణిమాసముల పద్ధతిలో పంచి పెట్టబడెను.

దీనినుండి సూర్యచంద్రాత్మకమైన జ్యోతిష్టోమవిద్య యుపదేశింపబడెను. అందు తెల్లని గుంపులకు శుక్ల యజుస్సు లనియు, నల్లని గుంపులకు కృష్ణయజుస్సులనియు జైమిని నామకరణము చేసెను.

ఈ ఋషులు చేసిన దేశకాలాత్మక, నాదాత్మక ప్రయో గములలో శ్వాసలు సామలుగాను, ఋక్కులు కంఠనాదాత్మక మైన యుచ్చారణములుగాను పుట్టినవి. సామలైన శ్వాసలనుండి ఋక్కులైన సప్తస్వరములు పుట్టి సప్తఛందస్సులుగా నిబద్ధము చేయబడినవి.

అందు ఋక్కుల నుండి మరలసామలు పుట్టించ బడుట గాంధర్వవిద్యయగు సంగీతము సప్తస్వరములతో మూడు స్థాయిలతో నేర్పడినది. వేదపురుషునకు సంగీతము సప్త స్వరములు పరిధులుగా నేర్పడినవి. మూడుస్థాయిలలో సప్త స్వరములు గుణింపబడి ఇరువదియొక్క సమిధలుగా సంవత్సర యజ్ఞము పురుషుని ఆయుర్దాయమునకు కాలమానమైనది. ఋక్కులనుండియు, సామలనుండియు యజుస్సులు ఋషుల దినచర్యగా పుట్టినవి.

ఆ తెల్లవారుఝామున సంవత్సర పురుషుని గమన మంతయు సమగ్రమైన బ్రహ్మవిద్యగా అపౌరుషేయమైన గ్రంథ రూపమున పునరుద్ధరింపబడెను.

అందు శుక్ల పక్షములు స్త్రీలుగా, వారి నడుమ కృష్ణ పక్షములు నల్లని బాలకుని రూపముగా మండలాకృతియైన నాట్యముత్పన్నమయ్యెను. ఆ నృత్తమునకు రాసమండల మనియు, ఆ విద్యకు తాండేయ మనియు జైమిని పేర్లు పెట్టెను.

ఈ మొత్తము నొక నల్లని బాలకుడు వేణువునుండి యూదుచుండగా అవ్యక్తమైన బ్రహ్మము నదీ, పర్వత, వన ప్రదేశములుగా నేర్పడి ఆతని విహారస్థానమయ్యెను. ఈ మొత్తము దృశ్యమును వ్యాసునితో పాటు మిగిలిన ఋషులందరును సత్త్వమయమైన ధ్యానమున దర్శించిరి.

అందు చతుర్ముఖుడు, ఇంద్రుడు, సప్తఋషులు, మనువులు, సనకసనందన సనత్కుమార సనాతనులు వ్యక్త మగుచు వర్తించి, నర్తించి లీనమగు చుండిరి. ఈ మొత్తము వేదసంహితను దర్శించుటలో ఆషాఢ పూర్ణిమ నుండి శ్రావణ కృష్ణాష్టమి వరకు ముప్పది ఎనిమిది దినములు పట్టెను. ముప్పది ఎనిమిదివ దినమున దేవకి అష్టమగర్భమున జన్మిం చిన శిశువు దేశకాలాత్మకుడైన వేదమూర్తిగా సమన్వయింప బడెను. ఈ సమన్వయము పరాశరముని యుపదేశించిన విష్ణుపురాణ సంహితకు వివరణమై నిలిచెను. జన్మించిన బాలుని అవతారగాథను పూర్ణపురాణ సంహితగా సూత మహర్షికు పదేశించి లోకమునకు విప్పిజెప్పుమని వ్యాసుడా జ్ఞాపించెను.

## ఆయుర్వేదం

# అపారఔషధ గుణాలున్న 'నల్లతుమ్మ'

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ

గ్రామ, పట్టణ, నగర ప్రాంతాలలో నిమిత్తం లేకుండా అన్ని చోట్ల పెరిగే ఔషధ వృక్షం నల్లతుమ్మ. దీనినే నల్లతుమ్మ చెట్టు అని కూడా పిలుస్తారు. బహుశ అందుకే **'తుమ్మలేని అమ్మలేని ఊరు ఉండదు'** అనే సామెత బాగా ప్రాచుర్యం పొందింది.

సంస్కృతంలో బబ్బూల అని ఆంగ్లంలో బబుల్ అని, ఇండియన్ గమ్ అరబిక్ ట్రీ అని, హిందీలో బబ్బుల్ అని వ్యవహరిస్తారు. మైమోసేసి అను వృక్ష కుటుంబానికి చెందిన దీని శాస్త్రీయ నామం అకేషియ అరబిక. ఈ చెట్టు జమ్మి ఆకుల లాంటి ఆకులని కలిగి వాడిగల పొడవైన జంట ముళ్ళతో కూడి వుంటుంది. పసుపు పచ్చని పూలను, బూడిద రంగు కలిగిన పొడువాటి కాయలను కలిగి యుంటుంది. ఎండించిన తుమ్మబంక, తుమ్మ బెరడు పొడి పచారి కొట్లలో, ఆయుర్వేద ఔషధ విక్రయశాలల్లో సంవత్సరమంతా లభ్యమవుతాయి.

నల్లతుమ్మ చెట్టు ఆకులు, కాయలు, బెరడు, బంక (నిర్యాసం, జిగురు) ఇలా అన్ని ఔషధంగా ఉపయోగపడేవే. మనం దైనందిన జీవితంలో ఎదుర్కొనే వివిధ అనారోగ్య సమస్యలకి వీటిని ఔషధంగా ఎలా సద్వినియోగం చేసుకోవచ్చో తెలుసుకుందాం.



తుమ్మ బంకని కొద్దిగా నెయ్యి వేసి వేయించి, పొంగించి, చల్లార్చి, చూర్ణించి ఔషధంగా వాడుకోవాలి.

**అధిక ఋతుస్రావం:** రోజు ఉదయం, సాయంత్రం పూటకి 2–3 గ్రాముల తుమ్మబంక పొడిని తగినంత తేనెలో కలిపి సేవిస్తు ఉంటే వివిధ కారణాల వల్ల స్త్రీలలో కలిగే అధిక రుతుస్రావం తగ్గుతుంది.

**సంతానప్రాప్తికి:** పురుషులు రోజు ఒకసారి 3–5 గ్రాముల తుమ్మబంకని 3–4 గంటలు నీటిలో నానించి కరిగించి 100 మి.లీ. పాలు, 100 మి.లీ. నీళ్ళు, అర టీ స్పూను తాటి కలకండ, ఒక టీ స్పూను నెయ్యి కలిపి కొద్దిసేపు మరిగించి, దించి, చల్లార్చి సేవిస్తూ ఉంటే వీర్యకణాల సంఖ్య, కదలికలు పెరిగి సంతానం అయ్యేందుకు దోహదపడుతుంది. వీర్య దోషాలు, శీఘ్రస్ఖలనం లాంటి సమస్యలు తగ్గుతాయి.

**పచ్చకామెర్లకు:** రోజు రాత్రి 100 మి.లీ. నీటిలో ఒక టీ స్పూను తుమ్మ బంక పొడి, ఒక టీ స్పూను జీలకర్ర వేసి ఉదయం వడగట్టి ఆ నీటిని సేవిస్తు ఉంటే త్వరగా ఫలితం కలుగుతుంది.

**అధిక చెమటకి:** తుమ్మ ఆకులని తగినంత నీటితో మెత్తగా నూరి ఒంటిపై రుద్ది ఆరిన పిదప కరక్కాయల పొడిని నీటిలో కలిపి చేసిన పేస్టుని పట్టించి గంట సేపు ఆగి స్నానం చేస్తుంటే ఆ సమస్య నుంచి బయటపడవచ్చు.

**పడకలో మూత్ర విసర్జన:** తుమ్మబంక పొడి, ఆయుర్వేదౌషధ విక్రయశాలల్లో లభ్యమయ్యే తుంగముస్తల పొడి, జటామాంసి పొడి సమానంగా కలిపి ఉంచుకొని రెండు పూటలా వయస్సు



విశాలహృదయం, దృఢవిశ్వాసం ఉంటేనే ఉన్నతమైన వ్యక్తిత్వం ఏర్పడుతుంది

బట్టి పూటకి 1–3 గ్రాముల పొడిని తగినంత తేనె కలిపి సేవిస్తు ఉండాలి.

**దంతధావన చూర్ణం:** ఎండిన తుమ్మబెరడును కాల్చి చేసిన బూడిద 50 గ్రా॥లు, ఆయుర్వేదౌషధ విక్రయశాలల్లో శుభ్రభస్మ అనే పేరుతో లభ్యమయ్యే పటిక భస్మ 10 గ్రా॥లు, సైంధవ లవణం పొడి 10 గ్రాములు కలిపి ఉంచుకొని రోజు ఒకసారి దంతధావన చూర్ణంగా వాడితే దంతాలపై ఏర్పడే గార తొలగటమే కాక దంతశూల, చిగుళ్ళ నొప్పులు, చిగుళ్ళవాపు, చిగుళ్ళ నుంచి చీము, రక్తం కారటం లాంటి దంత, చిగుళ్ళసమస్యలు తగ్గుతాయి.

**కాలిన పుళ్ళకు:** రోజు రెండుసార్లు నల్లతుమ్మ చెక్క బెరడు చూర్ణాన్ని తగినంత కొబ్బరినూనెలో కలిపి లేపనం చేస్తుంటే చర్మం కాలడం వల్ల కలిగే మంట, నొప్పి, బాధ తగ్గి పుళ్ళు కూడా చాలా త్వరగా మానిపోతాయి.

**కాలి పగుళ్ళకు :** రోజు ఒకసారి తుమ్మబంకని నీటిలో మెత్తగా నూరి లేపనం చేస్తుంటే కాలి పగుళ్ళు, నుదిటిపై పట్టిస్తుంటే తలనొప్పి తగ్గుతుంది.

**స్త్రీలలో యోని స్రావాలు, కుసుమ రోగాలు:** లేత నల్ల తుమ్మ కాయలను నల్లగొట్టి నీడన ఆరించి చేసిన పొడి, పటిక బెల్లం పొడి సమానంగా కలిపి ఉంచుకొని ఉదయం, సాయంత్రం పూటకి అర టీ స్పూను నుండి టీ స్పూను వరకు తగినంత నీటిలో కలిపి సేవించి చప్పిడి పథ్యం చేస్తుంటే వివిధ రకాల యోని స్రావాలు, తెల్లబట్ట లాంటి సమస్యలు తగ్గుతాయి.

**నడుము నొప్పి తగ్గేందుకు :** తుమ్మబంక పొడి, పటిక బెల్లం పొడి ఒక్కొక్కటి 50 గ్రా॥ల చొప్పున కలిపి ఉంచుకొని ఉదయం, సాయంత్రం పూటకి 2 గ్రాముల పొడిని, 50 మి.లీ. పాలలో కలిపి సేవిస్తు ఉండాలి. (మధుమేహ వ్యాధిగ్రస్తులు పటిక బెల్లం పొడి లేకుండానే).

ఇలా వాడటం వల్ల విరిగిన ఎముకలు కూడా త్వరగా అతుక్కుంటాయి. శరీర కండరాలు, నాడులు దృఢత్వాన్ని సంతరించుకొని నీరసం, నిస్త్రాణ లేకుండా ఉండేం దుకు దోహదపడుతుంది.

బబ్బులారిష్ట, లవంగాదివటి వంటి ప్రఖ్యాత ఆయుర్వే దౌషధాల తయారీలో కూడా ఈ నల్లతుమ్మను ఉపయోగిస్తారు.

## బాధ్యతతో అభివృద్ధి

మనిషిచేసే చేతలను బట్టి, అతడి మీద నమ్మకం కలగడం, కలగకపోవడం జరుగుతుంది. చేసే పనులలో సమర్థత, నిజాయితీ ఉంటేనే ఆ నమ్మకం కలుగుతుంది. అలాంటప్పుడే మరికొన్ని అదనపు బాధ్యతలు అప్పగిస్తారు పైవాళ్లు. అది అతని సామర్థ్యానికి గుర్తింపు.

అలాంటప్పుడే చిత్తశుద్ధితో నిజాయితీతో పని చేసి తన మీద ఉంచిన నమ్మకానికి న్యాయం చేయాలి. మరిన్ని సమర్థవంతమైన పనులు చేయాలి. అదే అతడి అభ్యున్నతికి దోహదపడుతుంది.

కానీ, కొందరు ఆ నమ్మకాన్ని వమ్ము చేస్తారు. ఇతరులు తన మీద ఉంచిన నమ్మకాన్ని అపార్థం చేసుకోవడమే దీనికి కారణం. ఏదైనా బాధ్యత నిర్వహించవలసి వచ్చినప్పుడే మరింత జాగ్రత్తగా నిర్వహించాలి. మన ఆలోచనలే మనలని మలుస్తాయి. అవకాశాలు రావాలంటే ఎంతగానో కృషి చేయాలి. ఎన్నో అడ్డంకులు అధిగమించి కష్టాలకు ఓర్చి తట్టుకునే వాడై ఉండాలి. అలాంటప్పుడు వచ్చిన అవకాశాన్ని నిల బెట్టుకోవాలి.

మంచిపనులు చేసే అవకాశం మానవజన్మకే ఉంది. పూర్వజన్మ సుకృతమే దీనికి కారణం అంటారు. ఇతరులకు చేతనైన ఉపకారం ప్రకృతికి, పరిసరాలకు తోటివారికి భావితరాలకి ఏదో ఒక మంచి చేయ గలగాలి.

# కలసి ఉంటే కలదు సుఖము

- శ్రీ రామమూర్తి పాలకుర్తి

"ధృతరాష్ట్రుండును బుత్రులున్ వనము, గుంతీ నందనుల్....
కార్య మీ యుభయమున్ సంతుష్టిమై నున్కికిన్!"
(మహాభారతం-ఉద్యోగపర్వం)

సంజయుడు ధృతరాష్ట్రుని రాయబారిగా అతని సందేశాన్ని ధర్మరాజుకు వినిపించిన సమయంలో కృష్ణుడు సంజయునితో పై విధంగా అంటాడు.

'ఓ సంజయా! ధృతరాష్ట్రుడు, దుర్యోధనాదులు ఒక అడవిలాంటి వారు. పాండవులు ఆ అడవిలో నివసించే సింహముల వంటివారు. సింహాలు లేని అడవి పాడు చేయబడు తుంది. అలాగే దట్టంగా లేని అడవిలో సింహాలకు రక్షణ ఉండదు. కాబట్టి, కౌరవపాండవులు వైరభావాన్ని వదిలి సంధి చేసుకొని మైత్రీభావనతో మెలగడం మంచిది. అది ఒక్క కురు వంశానికే కాదు. ప్రపంచశాంతికే ఉపకరిస్తుందని' తన మాటగా ధృతరాష్ట్రునికి సంజయుని ద్వారా కృష్ణుడు వర్తమానం పంపుతాడు.

ఒకరిపై ఆధారపడి బ్రతకడం, ఎవరిపై ఆధారపడ కుండా స్వతంత్రంగా బ్రతకడం, అన్యోన్య మైత్రీ భావంతో, సహకరిస్తూ, సహకారాన్ని పొందుతూ "జీవించడం" ఈ మూడూ మనకు సహజంగా కనిపించే జీవన శైలులు. మొదటిది.. నీచమైనది. రెండవ విధానం కొంతవరకు మంచిది. మూడవ విధానం ఆదరణీయమైనది లేదా అనుసరణీయం. దీని వల్ల సమాజానికి శ్రేయస్సు లభిస్తుంది.

మనమెంత గొప్ప వారమైనా, ఒంటరిగా బ్రతకలేము. ఏదో విధంగా సమాజంపై ఆధారపడి జీవించాల్సిందే. సమాజం లోని వ్యక్తుల మధ్య విలువలతో కూడిన ఆత్మీయభావం అంతర్లీన శక్తిగా కొనసాగినప్పుడు ఆ సమాజంలో ఆనందం, సౌభాగ్యం, వికసిస్తుంది.

**ఒకరిపై ఆధారపడి జీవించడం, ఎవరిపై ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించడం, అన్యోన్య మైత్రీ భావంతో జీవించాలి.**

ఆ భావన కరువయితే ప్రతిక్షణం అభద్రతా భావనతో అశాంతితో. బ్రతుకులు వెళ్ళబుచ్చవలసి వస్తుంది. అన్యోన్య సహకారంవల్ల సమాజం పటిష్టం అవు తుంది. వ్యక్తిగతంగా ఒక్కొక్కరు సాధించే ఫలితాలనన్నింటిని కలిపిన దానికన్నా ఎక్కువ ఫలితాన్ని పొందగలుగుతారు.

పాండవులు ఎన్నో విజయాలు సాధించిన వారు. అలాగే కౌరవపక్షయోధులలో ఎందరో ఎన్నో విజయాలు సాధించిన వారు ఉన్నారు.

అందువల్ల ఈ రెండు బలాలు కలిసి ఒకే వర్గంగా, కూటమిగా పని చేస్తే, ఫలితాలు అద్భుతంగా ఉంటాయి. అలా ఉద్యమించిన సామ్రాజ్యం వైపు కన్నెత్తి చూసే సాహసం ఎవరూ చేయరు.

జ్ఞానం, నైపుణ్యం, సాహసం, ఆలోచనా పరిణతి సమృద్ధిగా ఇరువర్గాలలోని యోధులలో ఉన్నాయి. అటు భీష్ముడు, ఇటు ధర్మరాజు జ్ఞానానికి ప్రతీకలు. అటు దుర్యో ధనుడు, ఇటు భీముడు సాహసానికి ప్రతీకలు. అటు కర్ణుడు, ఇటు అర్జునుడు నైపుణ్యానికి ప్రతీకలు. అటు శకుని, ఇటు కృష్ణుడు ప్రణాళికా రచనాసమర్థులు. ఆలోచనా పరిణతికి ప్రతీకలు.

ఇలాంటి మానవ వనరులు సమృద్ధిగా కలిగిన నాయ కత్వం సమకూరితే, దేశ ఆర్థికవ్యవస్థయే కాదు ప్రపంచ ఆర్థిక విధానమే మారిపోతుంది.

వనానికి సింహం, సింహానికి అడవి, ఎలాగయితే రక్షణ నిస్తాయో అలాగే కౌరవ పాండవ బలాలు అన్యోన్య మైత్రీ భావనతో విజయపథం వైపు పయనించడం మంచిదంటాడు కృష్ణుడు.

తన సంతతియైన కౌరవ పాండవులను సమన్వయ పరచగలిగే విజ్ఞతను ధృతరాష్ట్రుడునకు సంజయుడి ద్వారా కార్యరూపానికి తగిన విధంగా స్పందించాలని సూచన చేస్తాడు తద్వారా అందరూ 'కలసి ఉంటే కలదు సుఖమని' బోధించమని తెలియజేస్తాడు.

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-09

రచన- మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య

నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

(कृ धातुः = కృ ధాతువు)

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| देवः | = | దేవుడు | जनकः | = | తండ్రి | अग्रज | = | అన్న |
| किमर्थम् | = | ఎందుకు | एव | = | ఏ | किल | = | ఆట |
| करोति | = | చేయుచున్నాడు | करोषि | = | చేయుచున్నావు | करोमि | = | చేయుచున్నాను |

### అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) देवः कुत्र अस्ति?

02) सः अत्र अस्ति।

03) अग्रजः किं करोति?

04) किं वा?

05) त्वं किं करोषि?

06) अहम् अत्रासम्।

07) यूयं किमर्थं तत्र स्थ?

08) ते एव तत्र आसन् किल।

09) यूयं तत्र किमर्थं नास्त?

10) अहं तत्रैव अस्मि।

### అ) జవాబులు

01) దేవుడు ఎక్కడనున్నాడు?

02) వాడు ఇక్కడనున్నాడు.

03) అన్న ఏమి చేయుచున్నాడు?

04) ఏమి

05) నీవు ఏమి చేయుచున్నావు?

06) నేనిక్కడ ఉంటిని.

07) మీరు ఎందుకు అక్కడనుంటిరి?

08) వారే అక్కడనుండిరి కదా!

09) మీరు అక్కడ ఎందుకు లేకుంటిరి?

10) నేను అక్కడనే ఉన్నాను.

### ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) దేవుడొకచోట నున్నాడు.

02) వాడు చాలా చోట్లనున్నాడు.

03) మీరిపుడెక్కడనుంటిరి?

04) ఎవడేమి చేయుచున్నాడు?

05) వారందరు అక్కడ ఉండవలెను.

06) నీవే చేయుచున్నావేమి?

07) మేమే ఇక్కడనుండవలెను.

08) ఎవరిక్కడ లేరు?

09) నీవిక్కడ లేవట.

10) నేనిక్కడనే యున్నాను.

### ఆ) జవాబులు

01) देवः एकत्र अस्ति।

02) सः अनेकत्र अस्ति।

03) युयं अधुना कुत्र स्त?

04) कः किं वा करोति?

05) ते सर्वे तत्र स्युः।

06) त्वमेव करोषि किम्?


07) वयमेव अत्र स्याम।

08) के वा अत्र न सन्ति।

09) त्वम् अत्र नासि किल।

10) अहमत्रैव अस्मि।

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



## పిసినిగొట్టుబుద్ధి

పిసినివానియింట పీనుగు వెడలిన,
కట్టెకోలలకును కాసు లిచ్చి,
వెచ్చ మాయె ననుచు వెక్కి వెక్కేడ్చురా!
విశ్వదాభిరామ! వినుర వేమ!


**అర్థాలు:** పిసినివాడు = లోభి; వెచ్చమాయె = ఖర్చాయె; పీనుగు = శవము; కట్టెకోలలు = కట్టెపుల్లలు.

**భావం:** పిసినిగొట్టువాడు తనయింట్లో ఎవరైనా చస్తే, వారిని కాల్చడానికి కావలసినకట్టెపుల్లలకు కాసులు (డబ్బు) ఇచ్చి ఖర్చయిపోయిందని పొగిలి పొగిలి ఏడుస్తాడు.

**వివరణ:** పిసినిగొట్టువాడు ఎవరికీ ఏమీ దానం చేయడు. చివరికి తాను కూడ కడుపునిండా తినలేడు. తనసొమ్ము అయిపోతుం దని బాధపడుతునే ఉంటాడు. తనయింట్లోనే తనకోసమో, తనవారి కోసమో, తప్పనిసరిగా ఖర్చు చేయవలసిన సందర్భం వచ్చినా, ఎలాగో ఆఖర్చు పెడతాడు. కాని, ఖర్చయిందని ఏడుస్తునే ఉంటాడు. చివరకు తనవారిశవాన్ని తగలబెట్టడానికి కట్టెలకోసం ఖర్చు చేసినా, చనిపోయిన వాడిని గురించి కూడా బాధపడడు. శవం దహనం చేయడం అవసరం. అయినా, అందు కోసం తనకయిన ఖర్చును గురించే ఏడుస్తాడు. లోభం తగదని తాత్పర్యం.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

## 66 వైకుంఠపాళి



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)కూరల్లో తాలింపు(2); 3)మహిషము(2); 7)కౌరవుల వంశం(2); 8)కంచుకి(3); 9)ఒకమహర్షి(2); 12)వానరులు(3); 13)'పునర్వసు'కు మరో పేరు(3); 17)మనస్సు(2); 18)కూరల్లో ఇది వేస్తారు(3); 19)సరస్వతి(3); 22)మెలిక మరో పేరు(2) 23) మదము(2)

### నిలువు

1)శ్రీకృష్ణుని రథసారథి(4); 2)అడవి(2); 4)వంట చెఱకులో ఇది ఒకటి(2); 5)ప్రాణము(2); 6)ద్రౌపది పరిచారిక(3); 10)ధర్మశాస్త్రాలు(3); 11)వశిష్ఠుని హోమధేనువు(3); 14)స్త్రీ(3); 15)నందిని తల్లి(3); 16)సహదేవుని శంఖం(4); 20)బాధలు(2); 21)దశరథుని అసలు పేరు(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు




# భక్తిశ్రద్ధలతో అనుష్ఠానం

- శ్రీమతి ఎం.సత్యవతి

ఒక ఊళ్ళో ఒక ధనవంతుడు శ్రీవేంకటేశ్వరస్వామి గుడి కట్టించాడు. ఆ గుడిలోని పూజారి పరమభక్తుడు. అన్ని శాస్త్రాలు క్షుణ్ణంగా అభ్యసించినవాడు. గుడికి వచ్చే భక్తులు అధిక సంఖ్యలోనే ఉండేవారు. కాని ఆ భక్తులు శ్రీవేంకటేశ్వర స్వామి వివిధ నామస్మరణతో తమ భక్తిని ప్రదర్శించేవారు.

శాస్త్రవేత్త అయిన ఆ పూజారి భక్తులు తప్పులతో దైవ నామ స్మరణ చేయడం విని భరించలేకపోయేవాడు. ఆ భక్తులు గొంతెత్తి బిగ్గరగా "ఏడుకొండలవాడా, వేంకట్రవణా! గోయిందా, గోయిందా" అని అరిచేవారు. అది అతనికి ఇష్టమయ్యేది కాదు ఎన్నిసార్లు చెప్పినా, మళ్ళీ వారు 'వేంకట్రవణా' అనేవారు. పూజారి వాళ్ళకు, స్పష్టంగా- నామ సంకీర్తన చెయ్యాలని చెప్పి చెప్పి విసిగిపోయాడు. వీళ్ళిక ఎప్పుడూ ఇలాగే ఉంటారు. మారరు అనుకొని బాధ పడేవాడు. అయినా భక్తుల సంఖ్య పెరగడంతో, గుడికి వచ్చే అదాయం కూడా బాగానే పెరిగింది. దాంతో భక్తుల కోసం గుడిలో 'గీతా పారాయణం' కూడా ఏర్పాటుచేశారు, గీతాపారాయణం చేసే పండితుడు భక్తిపార వశ్యంతో, భగవద్గీత శ్లోకాలను తప్పులు, తప్పులుగా చదివేవాడు.

గుడిలో జరుగుతున్న తప్పులతోటి గీతా పారాయణం, పూజారి ఇంక భరించలేకపోయాడు. వెళ్ళి పండితుణ్ణి నిందించ సాగాడు. అందుకా పండింతుడు ఎంతో వేదనచెందాడు. "అలాగే స్వామి! మరైతే నేను భగవద్గీత చదివినప్పుడల్లా, నాకళ్ళ ముందు శ్రీకృష్ణుడు, అర్జునుడు కనిపిస్తూనే ఉంటారే! శ్రీకృష్ణుడు సంతోషంగా తల ఊపుతుంటే, అర్జునుడు చిరునవ్వుతో మెచ్చు కొంటున్నట్లుగా నా వైపు చూస్తుంటారే' అన్నాడు ఆ పండితుడు.

"అంతా నీ భ్రమ అది. నిన్ను మెచ్చుకోవడం కాదు. నీ తప్పుల తడకల శ్లోకాలు విని నిన్ను శిక్షించాలనుకోవడం" అన్నాడు పూజరి కోపంగా.

ఆ పండితుడేమీ మాట్లాడలేదు. ఆ రోజుకు గీతాపారా యణం ఎలాగో పూర్తయిందనిపించాడు. ఆ పైన చదవడానికి భయపడ్డాడు. ఉరకలేస్తున్న ఉత్సాహంతో చెప్పే ఆ పండితుడు చిన్నబోయి నిరుత్సాహంగా చెప్పసాగాడు.

పూజారి భక్తులను కూడ బాహటంగా వెటకారం చెయ్యడంతో, వారు కూడ మౌనంగా భగవంతుని స్మరించు కుంటూ వెళ్ళిపోసాగారు. పండితులు కానివారు భజనలు చేసే భక్తులు గుంపుల్లో చేరి గోవిందనామ స్మరణచేసే భక్తులందరూ పూజారి ప్రవర్తనకు భయపడసాగారు.

ఒక రోజు రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి పూజారి కలలో కనబడి "నీవునా భక్తులనందరిని బాధ పెడుతున్నావు. అలా వారిని బాధించవద్దని నీతో చెప్పడానికే నేను నీకు సాక్షాత్కరిం చాను" అన్నాడు.

పూజారికి ఆ మాటలు ఆశ్చర్యాన్ని కలిగించాయి. అదెలా స్వామీ అన్నాడు "నా భక్తులు నన్ను ఎలా ఉచ్చరించినా నాకు సంతోషమే. చిన్నపిల్లలు ముద్దు మాటలతో తప్పు, తప్పుగా మాట్లాడినా తల్లిదండ్రులు కోపగించుకోరుకదా? పైగా వారి ముద్దుమాటలకు పొంగి పోయి మురిసిపోతారు. నేనూ అంతే! పాపం భక్తి పారవశ్యంతో "గీత" చెప్పే ఆ పండితుడు నీ కారణంగా మానుకున్నాడు. భక్తులకు అదివినే అవకాశం పోయింది.

భక్తులందరూ గుడిలో నా నామాన్ని పలుకడానికే భయపడుతున్నారు. వారు నన్నెలా పిలిచినా నేను పలుకుతాను, వెళ్లి ఆ గీతాకారుణ్ణి రప్పించి, "గీతా పారాయణం మళ్ళీ ప్రారంభం నుంచి చెప్పమను" అని స్వామి అంతర్ధానమయ్యాడు. పూజారి సిగ్గుపడ్డాడు.

"భక్తులు తన నామాల్ని ఎలా పలికినా. కోపగించని స్వామి పిల్లలను తల్లిలా చూసుకొని మురిసిపోతుంటే, నేనెందుకు బాధపడాలి, వారినేదో ఉద్ధరించాలని చూడ్డం ఎందుకు? మనం చదివే తప్పుల్నీస్వామి క్షమించి కరుణిస్తున్నాడు గదా!" అను కున్నాడు పూజారి.

అలాగని తప్పొప్పులు చూడకుండా, అశ్రద్ధగా అను ష్ఠానం చేయరాదు. తెలిసినవారి వద్ద నేర్చుకొని శ్రద్ధగా అను ష్ఠించాలి. శక్తివంచన లేకుండ శ్రద్ధచూపడం ముఖ్యం. శ్రద్ధా లోపం లేకుండ పారాయణం చేయాలి. ఎంతచేసినా మనకు తెలియని తప్పులుంటే భగవంతుడు క్షమిస్తాడు. నిర్లక్ష్యంతో చేసిన తప్పుకి క్షమాపణ దొరకదు కదా!


నీతి : భక్తి శ్రద్ధ - కలిగిన అనుష్ఠానమే ముఖ్యం.

చిత్ర కథ

# వేదవ్యాసుడు

కథ- డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- కె.తులసీప్రసాద్




మత్స్యగంధి బాగా ఆలోచించింది. తొందరపడకుండా మంచి నిర్ణయం తీసుకుంది. మహర్షిని రెండు వరాలు కోరింది. అవి తీరిస్తే ఆయన కోరిక తీరుస్తాను అని కచ్చితంగా అంది మత్స్యగంధి.
అయ్యా! నా వంటి నిండా చేపలకంపు. మీరు భరించగలరా?
నేటి నుంచి నీ వంటి చేపలకంపు పోయి సుగంధం యోజన దూరం వ్యాపిస్తుంది. నీ పేరు మత్స్యగంధి కాదు. యోజనగంధి. ఇదే నా వరం.
అయ్యా! ఎప్పటికి నేను కుమారిగా ఉండాలి
అలాగే ఉంటావు. నా రెండో వరం ఇస్తున్నాను.
మహర్షి అనుగ్రహంతో యోజనగంది దివ్యమైన తేజస్సుతో నావని ఒక ద్వీపానికి చేర్చింది.
ఇక్కడ పరిసరం బాగుంది.
లోకకల్యాణార్థం వారిరువురి వల్ల యౌవనంతో ఉన్న వేదవ్యాసుడు జన్మించాడు.
అమ్మా! నమస్కారం. తపస్సుకి వెడుతున్నాను.
శుభమస్తు నాయనా!
వేదవ్యాసమహర్షి
ఆ విధంగా ఆదిగురువు అయ్యాడు
శ్రీగురవే నమః
లోకాః సమస్తాః సుఖినో భవన్తు!

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధస్సుకు పదును పెట్టండి

నిర్వహణ: డా॥ అల్లాడి సంధ్య

## కదంబం

### దశ వాయువులు

1)ప్రాణము 2)అపానము 3)వ్యానము
4)ఉదానము 5)సమానము 6)నాగము
7)కూర్మము 8)కృకరము 9)దేవదత్తము
10)ధనంజయము

## పిల్లలూ..జతచేయండి!!

| | |
|---|---|
| 1) తరిగొండ | అ) శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి |
| 2) తిరుపతి | ఆ) శ్రీకరియమాణిక్యస్వామి |
| 3) నగరి | ఇ) శ్రీపల్లికొండేశ్వరస్వామి |
| 4) అప్పలాయగుంట | ఈ) శ్రీగోవిందరాజస్వామి |
| 5) సురుటుపల్లి | ఉ) శ్రీలక్ష్మీనరసింహస్వామి |

జవాబులు: 1-(ఉ); 2-(ఈ); 3-(ఆ); 4-(అ); 5-(ఇ)

## మీకు తెలుసా?

1) దశరథ మహారాజు వంశం ?
2) రామాయణంలో మొత్తము శ్లోకాలు ఎన్ని?
3) సీతా స్వయంవరంలో రాముడు విరిచిన విల్లు పేరేమిటి?
4) బంగారు లేడి రూపంలో వచ్చిన రాక్షసుడు ఎవరు?
5) జటాయువు సోదరుని పేరు?
6) సీతారాములు నివసించిన పర్ణశాల ఉన్న ప్రదేశం పేరు ఏమిటి?
7) విభీషణుని భార్య పేరేమి?

జవాబులు:
1) ఇక్ష్వాకు
2) 24 వేలు
3) శివధనుస్సు
4) మారీచుడు
5) సంపాతి
6) పంచవటి
7) సరమ

## కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

వు త మె త ప కో న త్రు న త

జవాబు:
తన కోపమె
తన శత్రువు

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

Edited and published on behalf of Tirumala Tirupati Devasthanams by **Prof. K.Rajagopalan, Ph.D.,** Publisher & Chief Editor, T.T.D. and printed at Tirumala Tirupati Devasthanams Press by **Sri P.Ramaraju, M.A.,** Special Officer (Press & Publications), T.T.D. Press, Tirupati - 517507.





తిరుమల ఆకాశగంగతీర్థం వద్ద తొలిసారిగా హనుమజ్జయంతి వేడుకలు
(2021, జూన్ 04)



తిరుమల వసంతమండపంలో ఆగమోక్తంగా జరిగిన విష్ణు అర్చనంలో
పాల్గొన్న తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్.,
(2021, జూలై 20)

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY
Published by Tirumala Tirupati Devasthanams

SAPTHAGIRI,
Volume:52, Issue:2
July 2021

# శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కార వైభవోత్సవం

## శ్రీనివాసమంగాపురం

## (2021, జూలై 13 నుండి 15 వరకు)

